# ది క్రైమ్ న్యూస్

Crime News

తెలుగు దినపత్రిక

శుక్రవారం, ఫిబ్రవరి 28, 2025 | సంపుటి - 20 | సంచిక 150 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## తెలంగాణలో మిస్‌వరల్డ్ పోటీలు

**మే 7 నుంచి 31 వరకు గ్రాండ్ ఫినాలె**

**వరల్డ్ ఫెస్టివల్‌లో 120కి పైగా పాల్గొననున్న దేశాలు**

హైదరాబాద్ : మిస్ వరల్డ్ పోటీలు అంటే ప్రపంచంలోనే ఓ అరుదైన, అద్వితీయమైన వేడుక. వివిధ దేశాల నుంచి సుందరీ మణులు పాల్గొనే ఈ వేడుకలకు ఈసారి తెలంగాణలోని హైదరాబాద్ వేదిక కానుంది. ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూసే ప్రపంచ అందాల పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యమివ్వడం అనే మాట వింటుంటేనే హైదరాబాద్ జోష్ పెంచుతుంది.



2

# ముగిసిన మహాకుంభ మహోత్సవం

## శివరాత్రి స్నానాలతో కుంభమేళాకు ముగింపు

## నభూతో..న భవిష్యత్ అన్న చందంగా సాగిన క్రతువు

మహాకుంభమేళా సంబరం ముగిసింది. అనూహ్యంగా ప్రపంచమంతా భారత్ వైపు చూసేలా ఈ ఆధ్యాత్మిక క్రతువు సాగింది. కోట్లాదిమంది హాజరై పుణ్యస్నానాలు చేసిన ఇతివృత్తం గతంలో ఎప్పుడూ జరగలేదని చెప్పవచ్చు. ఓ రకంగా ఇది న భూతో..న భవిష్యత్ అన్న తీరుగా సాగింది. 144 ఏళ్లకోసారి వచ్చే మహాకుంభమేళా మహాఘట్టం బుధవారంముగిసింది.



ప్రయాగరాజ్ : జనవరి 13న మొదలైన ఈ మహా కుంభమేళా.. మహా శివరాత్రి పర్వదినంతో ముగిసింది.. చివరి రోజున భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. మహాకుంభ మేళాలో మహాశివరాత్రి రోజున 2.5 కోట్లకు పైగా భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించారు.. ప్రయాగ్‌రాజ్‌లోని సంగం ఒడ్డున 45 రోజుల పాటు జరిగిన మహాకుంభమేళాలో ఇప్పటివరకు 65 కోట్ల మందికిపైగా పుణ్యస్నానాలు చేసినట్టు యూపీ ప్రభుత్వం వెల్లడించింది.. చివరి రోజున గణాంకాలు చూసు కుంటే.. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.. ఏడు శైవ అఖారాలకు, మహాకుంభ్–2025 బుధవారం నాడు గొప్ప ఊరేగింపుల తర్వాత కాశీ విశ్వనాథ ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలతో మహాశివరాత్రి నాడు ముగిసింది. మిగతా 2లో

### మహాకుంభమేళాలో 66కోట్ల మంది పుణ్యస్నానాలు

**రూ.3 లక్షల కోట్ల ఆర్థిక లావాదేవీలు నడిచాయి**

**వివరాలు వెల్లడించిన యూపి ప్రభుత్వం**

లక్నో : మహా కుంభమేళా విజయ వంతంగా ముగియడంతో ఎంత మంది వచ్చారన్న లెక్కలను యూపి ప్రభుత్వం తీసింది. ప్రయాగ్ రాజ్‌లో దాదాపు 45 రోజుల పాటు మహా కుంభమేళా జరిగింది. ఫిబ్రవరి 26న మహా శివరాత్రితో కుంభమేళా గ్రాండ్‌గా ముగిసింది. కోట్లాది మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. అంతేకా కుండా కోట్లలో బిజినెస్ కూడా నడిచింది. ఇందుకు సంబంధించిన వివరాలు తాజాగా వెల్లడయ్యాయి.

## ఐక్యత కోసం జరిగిన మహా యజ్ఞం

**కుంభమేళాతో ప్రపంచమే ఆశ్చర్య పోయింది**

**ఎవరికైనా అసౌకర్యం కలిగితే క్షమించండి**

**కుంభమేళా ముగింపుపై మోడీ వెల్లడి**



2

# తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ ఆపలేరు

## వేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ

**దేశ విదేశాల నుంచి అత్యధిక పెట్టుబడులు సాధించాం**

**హెచ్‌సిఎల్ టెక్ క్యాంపస్ ప్రారంభించిన సిఎం రేవంత్**

**దేశంలోనే తెలంగాణ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ ఆపలేరని, 2025వ సంవత్సరంలోనే దేశ విదేశాల నుంచి అత్యధిక పెట్టుబడులు సాధించామని, తెలంగాణ వన ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చే ప్రయత్నం చేస్తున్నామని రేవంత్ ధీమా వ్యక్తం చేశారు. ఐవి, బయోటెక్ సహా తదితర రంగాల్లో హైదరాబాద్ అగ్రగామిగా ఉందని ప్రశంసించారు.**

హైదరాబాద్ : మాదాపూర్‌లో హెచ్‌సిఎల్ టెక్ నూతన క్యాంపస్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రసంగించారు. నూతన హెచ్‌సిఎల్ క్యాంపస్ ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. హైదరాబాద్ దేశంలోనే అత్యంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా మారిందని కొనియాడారు. దేశంలోనే తెలంగాణ, హైదరాబాద్ నగరం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం ఏడాదిలోనే దేశవిదేశాల నుంచి అత్యధిక పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. ఉద్యోగ కల్పనలో నంబర్‌వన్‌గా నిలిచామని చెప్పారు. ఈ విషయాన్ని గర్వంగా చెబుతున్నానన్నారు. 'తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల జీడీపీ రాష్ట్రంగా మారుస్తానని నేను చెప్పినప్పుడు అది సాధ్యం కాదని కొందరన్నారు. రెండుసార్లు దావోస్ పర్యటనల్లో రూ. 41,000 కోట్లు, రూ. 1.78 లక్షల కోట్ల ఎంవోయూలపై





## మెట్రోను అడ్డుకున్నట్లు రుజువు చేస్తారా

**కేంద్రాన్ని అడిగి ఎన్నికల హామీలు ఇచ్చారా**

**సిఎం రేవంత్ స్థాయిని మరిచి విమర్శలు**

**మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

న్యూఢిల్లీ : ఎవరిని అడిగి ఎన్నికల హామీలు ఇచ్చారు... ఎవరిని మీరు విమర్శిస్తున్నారని సిఎం రేవంత్ రెడ్డిపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. మెట్రో రెండోదశను అడ్డుకున్నట్లు రుజువులు చూపాలని సవాల్ చేశారు. విస్తరణకు పైసా లేకున్నా పనులు ఎలా చేపడతారని కూడా ఎదురు ప్రశ్నించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన విమర్శలపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. తాను ఏదైనా ప్రాజెక్టును అడ్డుకున్నట్లు నిరూపించాలని సవాల్ విసిరారు. మిగతా 2లో

# రెండుమూడు నెలల్లో టన్నెల్ పనుల పునఃప్రారంభం

**సహాయక చర్యల పూర్తికి యుద్ధప్రాతిపదికన చర్యలు**

**జగన్‌తో అంటకాగి నీటి చౌర్యానికి సహకరించిన బిఆర్ఎస్**

**మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడి**



హైదరాబాద్ : రెండు, మూడు నెలల్లో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు పునః ప్రారంభిస్తా మని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.రెండు మూడు రోజుల్లో సహాయక చర్యలు పూర్తి చేస్తామని అన్నారు.. పదేళ్లపాటు బీఆర్ఎస్ అధికారంలో ఉందని.. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ అను మతుల గురించి మాటాడుతున్నారని చెప్పారు. అప్పుడు మాట్లాడని నేతలు ఇప్పుడు మాట్లాడటం విడ్డూరంగా ఎందని విమర్శించారు. మాజీ మంత్రి హరీష్‌రావు మాటలు పూర్తి అబద్ధాలు, గొబెల్స్ ప్రచారమేనని విమర్శించారు. ఎస్ఎల్బీసీ ద్వారా 30 టీఎంసీలు గ్రావిటీ ద్వారా వస్తుంటే బీఆర్ఎస్ నేతలె పనులు వదిలిపెట్టి వెళ్లారని చెప్పారు. వాళ్లు సరైన పని చేసి ఉంటే తెలంగాణలో 30 టీఎంసీలు నీళ్లు వచ్చి మూడు నాలుగు లక్షల ఎకరాల నల్గొండ భూములు సాగులోకి వచ్చేవని అన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో జరిగిన ప్రమాదాన్ని అందరికీ చూడటానికి అనుమతి స్తున్నామని చెప్పారు. వారి హయాంలో ఎన్ని ప్రమాదాలు జరిగినా ప్రతిపక్షంలో 2లో



## ముగిసిన ఎమ్మెల్సీ పోలింగ్

**3న ఓట్ల లెక్కింపు.. ఫలితాల ప్రకటన**

హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో ఆరు ఎమ్మెల్సీ స్థానాలకు గురువారం జరిగిన పోలింగ్ పక్రియ ముగిసింది. ఆంధ్ర ప్రదేశ్‌లో 3, తెలంగాణలో 3 ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్ జరిగింది. అయితే, సాయంత్రం 4 గంటల వరకు క్యూ లైన్లలో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. ఏపీలో 2 గ్రాడ్యుయేట్, ఒక టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరిగాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోలింగ్ సమయం ముగిసే నాటికి 2లో



2

## బెంగాల్లో దొంగ ఓట్లను చేర్పించిన బిజెపి

**ఇసి సహకారంతో నకిలీ ఓటర్లను చేర్పించారు**

**వీటిని తొలగించకుంటే..ఇసి ముందు ధర్నా చేస్తాం**

**బెంగాల్ సిఎం మమతా బెనర్జీ హెచ్చరిక**

## ప్రాజెక్టులనుకాపాడలేని దుస్థితిలో ప్రభుత్వం



**నీటిని తరలించుకుపోతున్నా పట్టించుకోని వైపనం**

**సారంగం పనుల్లో కానరాని పురోగతి**

**ఆందోళనకు దిగిన బిఆర్ఎస్..అడ్డుకున్న పోలీసులు**

**ప్రభుత్వ తీరుపై మండిపడ్డ హరీష్ రావు**

మిగతాది 2లో

# తెలంగాణలో మిస్‌వరల్డ్ పోటీలు

ఒక్కసారి ప్రపంచం దేశాలన్ని హైదరాబాద్ వైపు చూపుతిప్పుకునే ఆ రోజు అతి చేరువలోనే ఉంది. ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్‌లో చెయ్యాలని నిర్వాహకులు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. దీంతో 72వ మిస్ వరల్డ్ పోటీలకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనున్నది. చారిత్రక, వారసత్వ సంపదను ప్రపంచానికి చాటడానికి తెలంగాణకు ఇదొక గొప్ప అవకాశం కానుంది. తెలంగాణ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటేందుకు అరుదైన ఘట్టం కానుంది. ఈ ఏడాది అందాల పోటీలకు అనువైన ప్రదేశంగా తెలంగాణను ఎంచుకోవడం, అందులోనూ హైదరాబాద్ వంటి మహానగరం ఈ వేడుకులకు సిద్దమవ్వడం ఈ ప్రభుత్వంలో జరిగే ఓ అద్వితీయం వేడుకగా చెప్పవచ్చు. ఈ ఏడాది మేనెలలో నాలుగు వారాల పాటు జరిగే ఈ పోటీల ప్రారంభ, ముగింపు వేడుకలతోపాటు గ్రాండ్ ఫినాలేను సైతం హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ ఫెస్టివల్‌లో 120కి పైగా దేశాలు పాల్గొంటాయి. బ్యూటీ విత్ ఎ పర్పస్ అనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ మిస్ వరల్డ్ అందాల పోటీల్లో పాల్గొనే దేశ విదేశాల ప్రతినిధులకు తెలంగాణ స్వాగతం పలకబోతుంది. మే 7 నుంచి ఈ అందాల పోటీలు ప్రారంభం కానున్నాయి. మే 31న గ్రాండ్ ఫినాలే ఉంటుంది. ప్రస్తుత మిస్ వరల్డ్ తర్వాత అందాల సుందరి కిరీటాన్ని ఎవరు ధరిస్తారో గ్రాండ్ ఫినాలే రోజు తేలనుంది. గతంలో న్యూఢిల్లీ, ముంబైలో ప్రపంచ సుందరి పోటీలు నిర్వహించారు. 71వ ఎడిషన్ ముంబైలోనే జరిగింది. ప్రపంచంలోనే అత్యుత్తమ మౌలిక సదుపాయాలున్న హైదరాబాద్ ఇప్పటికే పలు అంతర్జాతీయ వేడుకలకు వేదికైంది. ఐటీ, ఫార్మాసూటికల్, రియల్ ఎస్టేట్ వంటి రంగాల్లో దూసుకెళ్తున్న తెలంగాణకు ఈ అవకాశం దక్కడం నిజంగా గర్వించదగ్గ విషయమే. తెలంగాణను పర్యాటకంగా ప్రపంచ పటంలో నిలబెట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు ఇప్పటికే సిద్ధం చేసినట్లు సమాచారం. తెలంగాణ జరూర్ ఆనా నినాదంతో టూరిజం శాఖ దేశ విదేశీ పర్యాటకులను ఇప్పటికే ఆహ్వానాలు పంపుతోంది. గొప్ప చేనేత వారసత్వం, అద్భుతమైన పర్యాటక ప్రదేశాలు, అరుదైన వంటకాలు, విభిన్నమైన కళా వారతస్వమున్న తెలంగాణలో మిస్ వరల్డ్ పోటీలను స్వాగతిస్తున్నామని.. మిస్ వరల్డ్ లిమిటెడ్ ఛైర్మెన్, సీఈఓ జూలియా మోర్లీ, తెలంగాణ పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ తాజాగా ఓ అధికారిక ప్రకటన విడుదల చేసారు. మిస్ ఇండియా పోటీలు అంటేనే సుందరీమణుల అలరిస్తారు. అందులోనూ మిస్ వరల్డ్ పోటీలు అంటే ఇంక మాటల్లో చెప్పక్కర్లేదు. ఎంత ఆహ్లాదంగా ఉంటుంతో, అంతే స్థాయిలో వివిధ దేశాల యువతుల మధ్య గట్టిపోటీ కూడా సర్వసాధారణం. ఈ పోటీల వేదికగా హైదరాబాద్ బ్రాండ్ వాల్యూని మరింత పెంచడంతోపాటు, ప్రపందేశాల ప్రతినిధులను ఆకట్టుకునేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేసింది తెలంగాణ ప్రభుత్వం.

# బెంగాల్లో దొంగ ఓట్లను చేర్పించిన బిజెపి

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ ఓటర్ల జాబితాలో అవకతవకలు జరుగుతున్నాయని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. ఎన్నికల సంఘం సాయంతో ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ ఓటర్లను తమ రాష్ట్ర జాబితాలో భాజపా చేర్చుతోందని దుయ్యబట్టారు. వెంటనే దిద్దుబాటు చర్యలు తీసుకోకపోతే ఎన్నికల సంఘం కార్యాలయం ముందు నిరవధిక దీక్ష చేపడతానని హెచ్చరించారు. తృణమూల్ కాంగ్రెస్ సమావేశంలో మాట్లాడిన దీదీ భారత ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా జ్ఞానేశ్ కుమార్‌ను నియమించడంపైనా ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘాన్ని కూడా భాజపా ప్రభావితం చేస్తోందని ఆరోపించారు. 2006లో భూసేకరణ వ్యతిరేక ఆందోళనల క్రమంలో చేపట్టిన 26 రోజుల నిరాహార దీక్షను ఆమె గుర్తుచేశారు. ఓటర్ల జాబితాను సరిచేసి, తప్పుడు ఓటర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈసీ కార్యాలయం ముందు దీక్ష చేపడతానని అన్నారు. ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు హరియాణా, గుజరాత్ ఓటర్లను తమ రాష్ట్ర జాబితాలో చేర్చుతోందని మమతా బెనర్జీ ఆరోపించారు. దిల్లీ, మహారాష్ట్రల్లోనూ భాజపా ఈ తరహా వ్యూహాలను అమలు చేసిందన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తే విజయం సాధించలేమని భాజపాకు తెలుసునని, అందుకే తప్పుడు జాబితాను రూపొందించే పనిలో పడిందన్నారు. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఇక్కడ రావని, బయట వ్యక్తులు (భాజపా) బెంగాల్‌ను స్వాధీనం చేసుకోవడాన్ని తాము అనుమతించబోమన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 294 స్థానాలకు 215 చోట్ల విజయం సాధిస్తామని మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు.

# ముగిసిన ఎమ్మెల్సీ పోలింగ్

పశ్చిమ గోదావరి జిల్లాలో 65.43 శాతం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. దీంతో పాటు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విశాఖపట్నం జిల్లాలో 87.30 శాతం పోలింగ్ నమోదు అయింది. ఎన్‌టీఆర్ జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ముగిసే సమయానికి 61.99 శాతం నమోదు అయింది. మరోవైపు, తెలంగాణలోని మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ ముగిసింది. ఉమ్మడి కరీంనగర్- మెదక్-నిజామాబాద్- ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి 40.61 శాతం, ఇవే జిల్లాల్లో జరుగుతున్న టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 63.49 శాతం పోలింగ్ నమోదు కాగా, వరంగల్-నల్లగొండ- ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 76.35 శాతం పోలింగ్ నమోదు అయినట్లు తెలిపారు. కాగా, వచ్చే నెల 3వ తేదీన తుది ఫలితాలను ఎన్నికల కమిషన్ వెల్లడించనుంది.

# వేగంగా కొనసాగుతున్న బురద తొలగింపు చర్యలు

## ఎస్ఎల్‌బీసీ వద్ద ఇంకా వీడని ఉత్కంఠ

మహబూబ్‌నగర్ :ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో పేరుకుపోయిన బురదను తొలగించే ప్రక్రియ షురూ అయింది. గురువారం నాడు సహాయక చర్యల్లో భాగంగా ఒక వైపు డీ వాటరింగ్ చేస్తూ, మరో వైపు బురదను లోకో ట్రైన్ ద్వారా బయటికి తీసుకువస్తున్నారు. టీబిఎం మిషన్ సమీపంలో పడి ఉన్న సామాగ్రిని కూడా తరలిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తి అయితే తప్ప సహాయక చర్యలు చేపట్టే అవకాశం లేదని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. బురద తొలగించే పనులను నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్‌లు పర్యవేక్షిస్తున్నారు. సొరంగం నుంచి పెద్ద ఎత్తున బురద బయటకు తీస్తున్నారు. లోకో ట్రైన్ వెళ్లి రావడానికి గంట సమయం పడుతుంది. పెద్ద ఎత్తున కూలీలను ఉపయోగించి.. లోపల హిట్యాచి ద్వారా బురదను బయటికి తకలిస్తున్నారు. భారీ యంత్రం సహాయంతో వీటిని తీసి టిప్పర్‌లలో తరలిస్తున్నారు. ఈరోజు మొత్తం ఇదే కార్యక్రమం సాగుతుందని.. బురద తీసాక పరిస్థితిని అంచనా వేసి లోపల చిక్కుకున్న వారిని బయటకు తీసుకురావడం ఎలా అనేదానిపై ఒక ప్రణాళిక సిద్ధం చేస్తామని చెబుతున్నారు. ఒక వైపు బురద తొలగిస్తూనే మరో వైపు టీబిఎం మిషన్‌ను చిన్న చిన్న బాగాలుగా కట్ చేస్తున్నారు. ఈ భాగాలను కూడా వేరుచేసి బయటకు తీస్తున్నారు. ముందుగా రెండుకిలోమీటర్ల వద్ద బురదను క్లియర్ చేస్తున్నారు.

# ముగిసిన మహాకుంభ మహోత్సవం

ఊరేగింపులో భాగంగా, 10,000 మందికి పైగా నాగ సాధువులు, పండుగ ఉత్సాహాన్ని పెంచుతూ, కాశీ రోడ్ల గుండా తమ దేవతలు, జెండాలతో, త్రిశూలాలు, కత్తులు, గదలను ప్రదర్శిస్తూ 'హర్ హర్ మహాదేవ్' నినాదాల మధ్య పాడుతూ, నృత్యం చేస్తూ ప్రదర్శన చేశారు. శివరాత్రి రోజున పుణ్యస్నానాలు ఆచరించేందుకు ప్రయాగ్‌రాజ్‌కు భక్తులు పోటేత్తారు. చివరిరోజున కుంభమేళాలో భక్తులపై హెలికాప్టర్‌తో పూలవర్షం కురిపించారు.. ఆధ్యాత్మిక యాత్రకు వచ్చే వారిలో మరింత భక్తిభావం పెంచేలా ఇలా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. మహా శివరాత్రి పర్వదినం కూడా కలిసిరావడంతో 'హర హర మహాదేవ్' నామస్మరణలతో త్రివేణీసంగమం ఘాట్లు మార్మోగాయి. కుంభమేళాలో చివరి అమృతస్నానం ఆచరించేందుకు భక్తులు అర్ధరాత్రి నుంచే పెద్దసంఖ్యలో ఘాట్ల వద్దకు చేరుకొన్నట్లు అధికారులు తెలిపారు. దేశం నలుమూలలతోపాటు నేపాల్ నుంచి కూడా భక్తుల బృందం ఒకటి తరలివచ్చింది. కుంభమేళా ప్రాంతంలోని అయిదు ప్రధాన శివాలయాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. బాలీవుడ్ ప్రముఖనటి ప్రీతి జింటా బుధవారం త్రివేణీసంగమంలో పుణ్యస్నానం చేశారు. కుంభమేళాకు తాను రావడం ఇది మూడోసారి అంటూ ఆమె తన 'ఎక్స్' హ్యాండిల్‌లో ఓ వీడియో పోస్టు చేశారు. ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సీనియర్ అధికారులతో కలిసి గోరఖ్‌పుర్ కంట్రోల్ రూములో తెల్లవారుజామున 4 గంటల నుంచే ఏర్పాట్లను పర్యవేక్షించారు. జనవరి 13న మొదలై నాగ సాధువుల ఊరేగింపులు, మూడు అమృత స్నానాలతో వైభవంగా 45 రోజులపాటు కొనసాగిన మహా కుంభమేళా ప్రశాంతంగా ముగిసింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం మొత్తం 65 కోట్లమంది భక్తులు కుంభమేళాను సందర్శించి పుణ్యస్నానాలు చేశారు. జనవరి 29 నాటి రెండో అమృతస్నానం సందర్భంగా రద్దీ వల్ల జరిగిన తొక్కిసలాటలో 30 మంది భక్తులు చనిపోయిన విషాద ఘటన రాజకీయ దుమారం రేపింది. భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ వాంగ్‌ఛుక్, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహా పలువురు కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, పారిశ్రామికవేత్తలు ముకేశ్ అంబానీ, గౌతం అదానీ, సినీతారలు, క్రీడాకారులు త్రివేణీసంగమంలో పుణ్యస్నానాలు చేశారు. ముగింపు వేడుకల్లో భాగంగా భారత వాయుసేన పైలట్లు అద్భుతమైన వైమానిక విన్యాసాలు ప్రదర్శించారు. కుంభమేళాలో భాగంగా మహా శివరాత్రి రోజు చివరి అమృత స్నానం ఆచరించేందుకు కోట్లాది మంది ప్రయాగ్‌రాజ్‌కు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. మహాశివరాత్రి కావడంతో భక్తులు భారీ సంఖ్యలో హాజరవుతుండటంతో మరోసారి యూపీ అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎక్కడికక్కడ ఆంక్షలను అమలు చేస్తూ? అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టింది. కుంభమేళా ప్రాంతాన్ని ఇప్పటికే నో వెహికిల్ జోన్‌గా ప్రకటించి.. సిబ్బందిని భారీగా మోహరించారు. కాగా.. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. ఎప్పటికప్పుడు సీనియర్ అధికారులతో మాట్లాడుతూ.. శివరాత్రి వేడుకలు సజావుగా జరిగేలా చూశారు.

# మహాకుంభమేళాలో 66కోట్ల మంది పుణ్యస్నానాలు

ప్రపంచంలోనే ఇంత పెద్ద మతపరమైన పండుగ ఇదేనని పరమార్థ నికేతన్ అధ్యక్షుడు స్వామి చిదానంద సరస్వతి తెలిపారు. ప్రయాగ్‌రాజ్ ఒక చరిత్ర సృష్టించిందని చెప్పారు.యాత్రికులకు ఆర్థిక సౌలభ్యం కల్పించడానికి 16 బ్యాంకులు ప్రాంగణంలో శాఖలను ఏర్పాటు చేశాయి. ఈ బ్యాంకులు రూ. 37 కోట్ల విలువైన లావాదేవీలను నిర్వహించాయి. వీటిలో ఎక్కువ డిపాజిట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లో నమోదయ్యాయి. గణనీయమైన సంఖ్యలో భక్తులు నగదు జమ చేశారని, ఉపసంహరణలు చాలా తక్కువగా ఉన్నాయని అధికారులు గుర్తించారు. మైదానంలో 50 మొబైల్ ఎటిఎంలతో సహా 55 ఎటిఎంబూత్‌లు ఏర్పాటు చేశారు. అయితే డిజిటల్ లావాదేవీలు పెరగడంతో ఎటిఎంలకు డిమాండ్ తక్కువగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా 76 దేశాల ప్రతినిధులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. భారతీయ సాంస్కృతిక మరియు ఆధ్యాత్మిక వారసత్వంపై అంతర్జాతీయంగా ఆసక్తిని కనబరిచారు. భూటాన్ రాజు, వివిధ దేశాల మంత్రులు మరియు ప్రముఖులతో కలిసి సంగమంలో పవిత్ర స్నానం చేశారు. నేపాల్ నుంచి 50 లక్షలకు పైగా భక్తులు ప్రయాగ్‌రాజ్‌ను సందర్శించగా? 27 ఇతర దేశాల నుంచి రెండు లక్షలకు పైగా ప్రజలు హాజరయ్యారు. ఆపిల్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్స్ భార్య సందర్శించారు.అలాగే రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, అనేక మంది కేంద్ర మంత్రులు సహా భారతదేశ అగ్ర నాయకత్వం పాల్గొంది. గౌతమ్ అదానీ, ముఖేష్ అంబానీ వంటి ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, అక్షయ్ కుమార్ వంటి బాలీవుడ్ ప్రముఖులు ఈ ఉత్సవానికి హాజరయ్యారు. తాజాగా దీన్ని పురస్కరించుకుని ప్రధాని మోడీ ఎక్స్ ట్విట్టర్‌లో పోస్టు చేశారు. 'మహా కుంభమేళా పూర్తయింది. ఐక్యత మహా యజ్ఞం పూర్తయింది. 45 రోజుల పాటూ ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహాకుంభ మేళాలో 140 కోట్ల దేశ ప్రజల విశ్వాసం అద్భుతమైంది.' అంటూ కొనియాడుతూ మోడీ రాసుకొచ్చారు.

# ఐక్యత కోసం జరిగిన మహా యజ్ఞం

న.్యూఢిల్లీ : ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక 'మహాకుంభమేళా' ఘనంగా ముగిసింది. 45 రోజుల పాటు సాగిన ఈ కుంభమేళా విశేషాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన బ్లాగ్‌లో రాశారు. ఇంత పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించడం అంత సులువు కాదన్నారు. ఏర్పాట్ల విషయంలో భక్తులెవరైనా అసౌకర్యానికి గురైతే గనుక అందుకు క్షమించాలని కోరారు. 'ఐక్యత కోసం జరిగిన మహాయజ్ఞం దిగ్విజయంగా ముగిసింది. భారతీయ ఐక్యతకు కుంభమేళా నిదర్శనంగా నిలిచింది. అంచనాలను మించి వివిధ ప్రాంతాల నుంచి కోట్లాది మంది భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. భారత్ కొత్త శక్తితో ముందుకుసాగుతోందని, నవ భారత్‌ను నిర్మించే కొత్త శకం వచ్చిందని చెప్పేందుకు ఇదే నిదర్శనం అని అన్నారు. ఇంత గొప్ప కార్యక్రమాన్ని దేనితోనూ పోల్చలేం. త్రివేణి సంగమం నదీ తీరానికి అన్ని కోట్ల మంది ఎలా వచ్చారా? అని యావత్ ప్రపంచం ఆశ్చర్యపోతోంది. ఈ భక్తులెవరికీ అధికారిక ఆహ్వానాలు పంపలేదు. అయినా పవిత్ర సంగమంలో పుణ్యస్నానాల కోసం వారంతా తరలివచ్చారు. నదిలో స్నానమాచరించిన తర్వాత వారి ముఖాల్లో కన్పించిన సంతోషం, సంతృప్తి నేనెప్పటికీ మర్చిపోలేను. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు చాలామంది వ్యయప్రయాసలకోర్చి కుంభమేళాకు రావడం ఆనందంగా ఉందని మోదీ రాసుకొచ్చారు. ఈసందర్భంగా మహాకుంభమేళాను విజయవంతం చేసిన యూపీ ప్రభుత్వం, సహకరించిన ప్రయాగ్‌రాజ్ ప్రజలు, భక్తులకు మోదీ ధన్యవాదాలు తెలిపారు. 'ఇంతటి పెద్ద కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా నిర్వహించడం అనేది అంత సులువు కాదని తెలుసు. మా పూజల్లో ఏదైనా లోపం ఉంటే క్షమించాలని ఆ గంగా, యమునా, సరస్వతి మాతలను ప్రార్థిస్తున్నా. భగవంతుని స్వరూపాలుగా భావించే భక్తులకు సేవ చేయడంలో ఏదైనా లోపం ఉంటే అందుకు ప్రజలు కూడా క్షమించాలని కోరుతున్నా' అని మోదీ రాసుకొచ్చారు. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు 45 రోజుల పాటు సాగిన మహా కుంభమేళాకు దేశ విదేశాల నుంచి భక్తులు పోటెత్తారు. సామాన్య పౌరులతో పాటు పలువురు రాజకీయ, సినీ రంగాలకు చెందిన ప్రముఖులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఫిబ్రవరి 10, ప్రధాని మోదీ ఫిబ్రవరి 5న కుంభమేళాను సందర్శించి పుణ్యస్నానం చేశారు.

# మెట్రోను అడ్డుకున్నట్లు రుజువు చేస్తారా

హైదరాబాద్ మెట్రో రెండోదశ ప్రాజెక్టును కేంద్ర క్యాబినెట్ వద్దకు వెళ్లకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారని రేవంత్ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. సీఎంగా ఉన్న వ్యక్తి అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి తెలంగాణకి సీఎం కావడం రాష్ట్ర ప్రజల దురదృష్టం. కేంద్ర ప్రభుత్వానికి ఒక విధానం ఉంటుంది.. దానికి అనుగుణంగానే వ్యవహరిస్తారు. రేవంత్ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతూ దుందుడుకుగా వ్యవహరిస్తున్నారు. కేంద్రం నుంచి డబ్బులు తెచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని ఎన్నికల్లో చెప్పారా?' అని కిషన్‌రెడ్డి నిలదీశారు. తెలంగాణకు సిఎం రేవంతా లేక తానా అని ప్రశ్నించారు. ప్రధాని మోడీ నాయకత్వంలో మైనింగ్‌లో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. గనుల శాఖలో నూతన పాలసీ తీసుకొచ్చామని.. 12 ఖనిజాల రాయల్టీని పెంచామని తెలిపారు. ఈ ఏడాది జీఎస్ఐ 448 ప్రాజెక్టుల్లో గనుల అన్వేషణ చేపట్టిందని పేర్కొన్నారు. గనుల అన్వేషణలో ప్రైవేట్ రంగాన్ని కూడా భాగస్వామ్యం చేస్తున్నామని.. ఇందులో భాగంగానే ఈ ఏడాది 12 ప్రైవేట్ కంపెనీలు గనుల అన్వేషణలో భాగస్వామ్యం అయ్యాయని తెలిపారు. ఆఫ్ షోర్ ఏరియాలో ఖనిజాల ఉత్పత్తిని పెంచుతున్నామన్నారు. పలు ఆఫ్ షోర్ మినరల్స్ గుర్తించి వేలం వేయబోతున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 103 బ్లాకుల గనులను వేలం వేశాయని.. ఈ వేలం పక్రియలో 14 రాష్ట్రాలు భాగస్వామ్యం అయ్యాయని తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్??పై దృష్టి పెట్టామని పేర్కొన్నారు. మెట్రో రెండోదశ ప్రాజెక్టును కేంద్ర క్యాబినెట్ వద్దకు వెళ్లకుండా కిషన్‌రెడ్డే అడ్డుకున్నారు. తన మిత్రుడు కేసీఆర్ పదేళ్లలో చేయని పని ఇప్పుడు చేస్తే రేవంత్‌రెడ్డికి పేరొస్తుందనే అలా చేశారని రేవంత్ ఆరోపించారు. నాకు రాష్ట్ర ప్రయోజనాల కంటే పేరు ముఖ్యం కాదు. కావాలంటే అనుమతులు, నిధులు తెప్పించి ఆ పేరును కిషన్‌రెడ్డినే తెచ్చుకోమనండి. నేను కూడా ఆయన పేరే ఊరూరా ప్రచారం చేస్తా. సన్మానం చేసి గండపెండేరం తొడుగుతా. తెలంగాణ అభివృద్ధికి అవసరమైన 5 ప్రాజెక్టులకు సహకరించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి విన్నవించాం. వాటికి అనుమతులు, నిధులు తీసుకురావాల్సిన బాధ్యత కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లదే. లేకపోతే వారిద్దరూ గుజరాత్‌కో.. ఇంకో రాష్ట్రానికో వెళ్లిపోవాలి. తెలంగాణలో వారికి తిండి దండగ' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దీనికి కిషన్ రెడ్డి ఘాటుగా బదులిచ్చారు.

# ప్రాజెక్టులను కాపాడలేని దుస్థితిలో ప్రభుత్వం

నాగర్‌కర్నూలు : ఉన్న ప్రాజెక్టులను కాపాడలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లోకి వెళ్లేందుకు తమకు అనుమతి ఇవ్వలేదన్నారు. 'సహాయక చర్యలకు ఇబ్బంది అవుతుందని ఇన్ని రోజులు రాలేదు. ఆరు రోజులు గడిచినా చిక్కుకుపోయిన వారి ఆచూకీపై ఇప్పటికీ స్పష్టత లేదని అన్నారు. వారి కుటుంబాలు ఆందోళన చెందుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఎస్ఎల్‌బీసీ కోసం ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.3,300 కోట్లు ఖర్చు పెడితే.. భారాస ప్రభుత్వం రూ.3,900 కోట్లు ఖర్చు చేసింది. ఏపీ ప్రభుత్వం అక్రమంగా కృష్ణా జలాలు తరలించుకుపోతోంది. మన నీటిని ఏపీ తరలించుకుపోతుంటే ప్రభుత్వం ఆపటం లేదన్నారు. రాష్ట్ర ప్రాజెక్టులను కేంద్ర బోర్డుకు అప్పగించేందుకు ఆనాడు భారాస ప్రభుత్వం అంగీకరించ లేదన్నారు. గోదావరిపై ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తుంటే కాంగ్రెస్ సర్కారు నోరెత్తటం లేదు. కృష్ణా జలాలపై మేం నిలదీసిన తర్వాత కేఆర్ఎంబీ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేశారు. రాష్ట్ర హక్కులను కాపాడటంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఇదిలావుంటే బిఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున మందీమార్బలంతో టన్నెల్ వద్దకు రావడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అయితే ఆరు రోజుల తర్వాత తీసింది కేవలం తట్టెడు మట్టి మాత్రమేనని హరీష్ రావు అన్నారు. 8 మంది ప్రాణాలు కాపాడటం పట్ల ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఇదేనా.. అన్నారు. కాంగ్రెస్ సర్కార్ అవినీతి, నిర్లక్ష్యంతో 15 నెలల్లోనే 4 ప్రాజెక్టులు కూలిపోయినయ్. ప్రమాద ఘటనలో చిక్కుకున్న 8 మంది కార్మికుల ప్రాణాలు కాపాడే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఆరు రోజులైనా ఇప్పటి వరకు సరైన డైరెక్షన్ లేదు. మంత్రులు పొద్దున వస్తున్నారు.. సాయంత్రం పోతున్నారు.. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఏమైనా టూరిస్ట్ ప్లేసా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇక ఉన్న ప్రాజెక్టులను కాపాడలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. ఏపీ ప్రభుత్వం అక్రమంగా కృష్ణా జలాలు తరలించుకుపోతోంది. మన నీటిని ఏపీ తరలించుకుపోతుంటే ఈ ప్రభుత్వం ఆపడం లేదు.రాష్ట్ర హక్కులను కాపాడటంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఆయన వెంట మాజీ మంత్రులు జగదీశ్ రెడ్డి, శ్రీనివాసగౌడ్, నిరంజన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ ఆపలేరు

సంతకాలు చేసుకున్న తరువాత ఇప్పుడు అది సాధ్యమని నమ్ముతున్నారు. తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ ఆపలేరు. మా పోటీ ముంబయి, దిల్లీ, బెంగళూరు, చెన్నైతో కాదని నేను చెప్పినప్పుడు.. కొంతమంది అది పెద్ద కలనే అవుతుందన్నారు. ఈవీ అడాప్షన్‌లో హైదరాబాద్‌ను నంబర్ వన్‌గా చేశాక.. రాష్ట్రాన్ని డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ, లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, స్కిల్స్, మ్యానుఫ్యాక్చరింగ్, అగ్రి ప్రాసెసింగ్ హబ్‌గా మారుస్తున్నాం. ఇప్పుడు హైదరాబాద్ రైజింగ్ ఆగదు అని ప్రజలు అంటున్నారు. ఇప్పుడు ప్రపంచం మొత్తం అంగీకరిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద లైఫ్ సైన్సెస్ కంపెనీల్లో ఒకటైన ఆమ్జెన్‌ను ఇటీవలే ప్రారంభించాం. ప్రపంచంలోని అత్యుత్తమ సమావేశాల్లో ఒకటైన బయో ఆసియా సదస్సును నిర్వహించాం. గ్లోబల్ కంపెనీగా హెచ్‌సీఎల్ టెక్ దేశానికి గర్వకారణంగా నిలిచింది. ఇది 2.2 లక్షల మందికిపైగా ఉద్యోగులతో 60 దేశాల్లో ఆపరేట్ చేస్తోంది. డిజిటల్, ఇంజినీరింగ్, క్లౌడ్, ఏఐ రంగాల్లో వరల్డ్ క్లాస్ ఆఫరింగ్స్ క్రియేట్ చేస్తున్నారు. 2007లో హైదరాబాద్‌కు వచ్చినప్పటి నుంచి హెచ్‌సీఎల్ అంచలంచెలుగా పెద్ద స్థాయికి ఎదిగిందని రేవంత్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఐటిశాఖ మంత్రి శ్రీధర్ బాబు, సెక్రటరీ జయేశ్ రంజన్ పాల్గొన్నారు.

# రెండుమూడు నెలల్లో టన్నెల్ పనుల పునఃప్రారంభం

ఉన్న తమకు ఎలాంటి అనుమతులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. వాళ్ల హయాంలో రూ.1.81 లక్షల కోట్లు ఖర్చుపెట్టి నామమాత్రపు పనులు చేశారని మండిపడ్డారు. వాళ్ల హయాంలో నీటిపారుదుల శాఖను నిర్వీర్యం చేసిన ఘనత కేసీఆర్, హరీష్ రావులకు దక్కుతుందని చెప్పారు. తాము ప్రజాస్వామ్యతంగా పారదర్శకంగా ముందుకు పోతున్నామని చెప్పారు. వాళ్లు శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం బ్లాస్ట్ జరిగి.. 9 మంది చనిపోతే ఒక్కరూ కూడా ఎందుకు పరామర్శకు రాలేదని ప్రశ్నించారు. ఆరోజు రేవంత్ రెడ్డి వస్తుంటే కారులో అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారని గుర్తుచేశారు. దేవాదులలో ఏడు మంది చనిపోతే.. అస్తిపంజరాలు ఐదేళ్ల తర్వాత దొరికాయని చెప్పారు. అప్పుడు హరీష్ రావు ఎప్పుడైనా ఆ విషయం గురించి మాట్లాడావా అని నిలదీశారు. ఎన్నో ప్రమాదాలు జరిగినప్పుడు వారి హయాంలో అడిగే నాథుడే లేరన్నారు. ఇక్కడికి వచ్చి పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మీరు జగన్‌తో కుమ్మక్కై ప్రగతిభవన్‌లో విందులు, వినోదాలు చేసుకుంటుంటే జగన్ కృష్ణానదిని దోచుకువెళ్లారని విమర్శించారు.. పాలమూరు రంగారెడ్డిలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ. 27,500 కోట్లు ఖర్చుపెట్టి ఒక ఎకరాకు కూడా నీరందించలేదని ధ్వజమెత్తారు. ఎస్ఎల్‌బీసీకి కరెంట్ కట్ చేస్తే డీ ఓటరింగ్ చేయలేక పనులు ఆగిపోయాయని చెప్పారు. అప్పుడు జగదీశ్ రెడ్డి మంత్రిగా ఉన్నాడు ఏమి చేశారని ప్రశ్నించారు. తనకు హెలికాప్టర్‌లో తిరగాలని తనకు ఏ మాత్రం లేదని..తాను గతంలో పైలట్‌ను అని గుర్తుచేశారు. భారతదేశంలో టన్నెల్ ప్రమాదాల్లో అత్యంత నిపుణులను కలిగిన 11 ఏజెన్సీలను తీసుకువచ్చి సమర్థవంతంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు చెప్పిన మాటలు అబద్ధాలు అని.. ఆ మాటలను తీవ్రంగా ఖండిస్తున్నానని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు.

# వికసిత భారత్ పేరుతో జేబులు గుల్ల

## కేవలం పదిశాతం మాత్రమే ఆదాయం పొందుతున్నారు

## మోడీ తీరుపై ఘాటు మల్లికార్జున ఖర్గే విమర్శలు

న్యూఢిల్లీ : ప్రధాని మోదీ చెబుతున్న వికసిత్ భారత్ ద్వారా దేశ ప్రజల జేబులు ఖాళీ అవుతున్నాయని కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎద్దేవా చేశారు. మాటలుతప్ప ఆచరణలో కానరావడం లేదని అన్నారు. ఈమేరకు కేంద్రంలోని మోదీ సర్కార్‌పై మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. కొందరు సంపన్నుల ఖజానాను నింపుతోందని ఆరోపించారు. ఖర్చు చేసేందుకు కోట్లాది మంది ప్రజల వద్ద అదనపు ఆదాయం లేదన్నారు. భారత్ సుంకాలు, వాణిజ్య అడ్డంకులను ఎదుర్కొంటోందని ఖర్గే వ్యాఖ్యానించారు. మోదీజీ..ఖర్చు చేయడానికి కోట్లాది భారతీయులకు అదనపు ఆదాయం లేదు. దేశ జీడీపీలో 60శాతం ప్రజలు ఖర్చు చేయడంపైనే ఆధారపడి ఉంది. కానీ, దేశంలో 10 శాతం మంది మాత్రమే ఆర్థిక వృద్ధి, వినియోగాన్ని పెంచుతున్నారు. మిగిలిన 90 శాతం మంది నిత్యం అవసరమయ్యే వస్తువులను కొనుగోలు చేయలేకపోతున్నారు' అని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. పన్ను చెల్లిస్తున్న ప్రజల్లో 50 శాతం మందికి దశాబ్ద కాలంలో వేతన పెరుగుదల ఆగిపోయింది. గ్రామీణ వేతనాల పెరుగుదలలోనూ అంతే. కేంద్రంలోని ఎన్డీయే విధానాలు అందరి ఆదాయాలను పెంచడంలో విఫలమయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా భారత్ సుంకాలతో పోరాడుతోంది. వాణిజ్యంలోనూ అడ్డంకులున్నాయి. నిరుద్యోగం ఊబిలో యువత చిక్కుకుపోయింది. ద్రవ్యోల్బణం పీడిస్తోంది. కేంద్రం ప్రవేశపెట్టిన బ్జడెట్‌లో సామాన్యులకు ఎలాంటి ప్రయోజనాలు దక్కలేదు. మీరు చెబుతున్న వికసిత్ భారత్ సాధారణ ప్రజల జేబులను ఖాళీ చేస్తోంది. కొందమంది సంపన్నుల ఖజానా నింపుతోందని మల్లికార్జున ఖర్గే విమర్శలు చేశారు.

# హిందీ రుద్దడంతో స్థానిక భాషలు సర్వనాశనం

## భోజ్‌పురి, బుందేల్ లాంటి భాషలు కనుమరుగు

## మరోమారు హిందీపై అక్కసు వెళ్లగక్కిన స్టాలిన్



చెన్నై : ఏకపక్షంగా హిందీ భాష విధింపుతో ప్రాచీన భాషలు ఉనికిలేకుండా పోతున్నాయని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో బలవంతంగా హిందీని రుద్దడం వల్ల 100 ఏళ్లనాటి 25 భాషలు నాశనమయ్యాయని గురువారం నాడిక్కడ అన్నారు. ఉత్తరప్రదేశ్, బీహార్‌లు హిందీ రాష్ట్రాలు కావని, ఆయా రాష్ట్రాలకు చెందిన వాస్తవ భాషలు ఇప్పుడు గతానికి సంబంధించినవిగా మారాయని అన్నారు. హిందీ యుపి మాతృభాష కాదని, ఆ రాష్ట్ర ప్రాచీన భాషలైన భోజ్‌పురి, బుందేల్‌ఖండి (బుందేలీ) భాషలను కోల్పోయిందని అన్నారు. ఉత్తరాఖండ్ కుమావోనిని కోల్పోయిందని, రాజస్థాన్, హర్యానా, బీహార్, ఛత్తీస్‌గఢ్‌లలో స్థానిక భాషల ఉనికి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జాతిని, సంస్కృతిని నాశనం చేయడానికి భాషలపై దాడికి దిగుతోందని మోడీ ప్రభుత్వానికి చురకలంటించారు. తమిళం పట్ల ప్రధాని మోడీకి గౌరవం ఉందన్న వ్యాఖ్యలపై ఉత్తరప్రదేశ్‌లో ప్రయాగ్‌రాజ్‌లో బుధవారం ముగిసిన కుంభమేళాలో, తమిళ సంగమం (వారణాసిలో) సమయంలో హిందీయేతర భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారా? అని కేంద్రాన్ని ప్రశ్నించారు. హిందీని విధించడంపై కొన్ని అభ్యంతరాలను లేవనెత్తారు. ఏ రాష్ట్రంలోనైనా పాఠశాల విద్యార్థులు ఏ భాషనైనా నేర్చుకోవచ్చని సూచిస్తున్నారు. కానీ వాస్తవానికి తమిళాన్ని ఓ సబ్జెక్టుగా అందించడం లేదని అన్నారు. నూతన జాతీయ విద్యావిధానంలోని త్రిభాషా ఫార్ములా ప్రకారం అన్ని రాష్ట్రాలు సంస్కృతానికి ప్రాధాన్యత ఇస్తాయని అన్నారు. ద్రావిడ ఉద్యమం ద్వారా మాత్రమే తమిళం రక్షించబడుతుందని అన్నారు. అండమాన్‌లో తప్ప ఎక్కడా తమిళం నేర్పడం లేదని, కేంద్రీయ విద్యాలయాల్లో తమిళ భాషా ఉపాధ్యాయులు లేరని అన్నారు. పాఠశాలల్లో కనీసం 15 మంది విద్యార్థులు తమిళాన్ని ఎంచుకుంటేనే ఉపాధ్యాయులను నియమిస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి చెప్పారని అన్నారు. రాజస్థాన్‌లోని పాఠశాలల్లో ఉర్దూ స్థానంలో సంస్కృత ఉపాధ్యాయులను నియమించారని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా, తమిళనాడు లోని అధికార డీఎంకేల మధ్య హిందీ భాష విషయంలో మాటల యుద్ధం నడుస్తోన్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఇలా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈమేరకు గురువారం ఎక్స్ వేదికగా ఆయన పోస్టు పెట్టారు. '100 ఏళ్లలో ఉత్తర భారతంలో 25 భాషలు కనుమరుగయ్యాయి. భోజ్‌పురి, మైథిలీ, బుందేలీ, గర్వాలీ, కుమావోని, మాగాహి, మార్వారీ, మాల్వీ, ఛత్తీస్‌గఢి, సంథాలీ, అంజికా ఇలా అనేక భాషలు మనుగడ కోసం ఎదురుచూస్తున్నాయన్నారు. తమిళనాడుకు అలాంటి పరిస్థితి రాకూడదనే ప్రతిఘటిస్తున్నాం. జాతి, సంస్కృతిని నాశనం చేయడానికి భాషలపై దాడి చేస్తున్నారు' అని స్టాలిన్ రాసుకొచ్చారు. తాము ద్విభాషా సూత్రానికే కట్టుబడి ఉంటామని, హిందీని బలవంతంగా రుద్దితే ఊరుకోబోమని డీఎంకే ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.మరోవైపు.. భాజపా, డీఎంకేల మధ్య వివాదం చిన్నపిల్లల కొట్లాటలా ఉందంటూ తమిళగ వెట్రి కళగం పార్టీ అధ్యక్షుడు, నటుడు విజయ్ వ్యాఖ్యానించారు.

# ఎన్ని చట్టాలు చేసినా.. కఠినంగా అమలు చేయాలి

## మహిళలకు భరోసా ఉందన్న నమ్మకం కలిగించాలి

## ప్రభుత్వం, పోలీసులు, ప్రజలకూ బాధ్యత ఉంది

## పుణె అత్యాచార ఘటనపై మాజీ సిజెఐ చంద్రచూడ్

ముంబై : మహిళల రక్షణ కోసం తీసుకొచ్చిన చట్టాలను సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని సుప్రీం మాజీ సిజె జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు.. ఎక్కడికి వెళ్లినా తాము సురక్షితంగా ఉన్నామనే నమ్మకాన్ని మహిళలకు కలిగించాలన్నారు. ఇలాంటి కేసుల్లో సరైన దర్యాప్తు, కఠిన చర్యలు అత్యంత కీలకం అన్నారు.. న్యాయవ్యవస్థ, పోలీసులకు పెద్ద బాధ్యత ఉంది. వీరితో పాటు సమాజానికి కూడా అంతే బాధ్యత ఉందని జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. మహారాష్ట్రలోని పుణెలో 26 ఏళ్ల యువతిపై బస్సులో ఓ దుండగుడు అత్యాచారానికి పాల్పడిన ఘటన ప్రజల్లో ఆగ్రహానికి కారణమైంది. రాజకీయంగా దుమారం రేపుతోంది. దీనిపై సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ కీలక వ్యాఖ్యలు చేశారు .నిర్భయ ఘటన తర్వాత చట్టాల్లో ఎన్నో మార్పులు వచ్చాయి. కేవలం చట్టాలతోనే అలాంటి ఘటనలను నివారించలేం.అందుకు ప్రభుత్వం, పోలీసులు, ప్రజలు కూడా బాధ్యతతో వ్యవహరించాల్సి ఉందన్నారు. అత్యంత రద్దీగా ఉండే బస్ స్టేషన్‌లలో ఒకటైన స్వర్‌గేట్‌లో మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఈ దారుణం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. తన స్వగ్రామానికి వెళ్లేందుకు బస్‌స్టేషన్‌కు చేరుకున్న యువతితో నిందితుడు మాటలు కలిపాడు. అక్క అని సంబోధిస్తూ నమ్మించాడు. గ్రామానికి వెళ్లే బస్సు మరో చోట ఉందని చెప్పి బస్ స్టేషన్‌లోనే దూరంగా ఎవరూ లేని చోట ఆగి ఉన్న మహారాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్ దగ్గరకు ఆమెను తీసుకెళ్లాడు. బస్సులోకి వెళ్లేందుకు యువతి తటపటాయించడంతో లోపల ప్రయాణికులు ఉన్నారని.. నిద్రలో ఉండటంతో వాళ్లు లైట్లు వేసుకోలేదని నమ్మించాడు. బస్సులోకి యువతి ప్రవేశించగానే తలుపు వేసి అత్యాచారానికి పాల్పడ్డాడు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడు దత్తాత్రయ రామదాస్ (36)గా పోలీసులు గుర్తించారు. అతడిపై అనేక కేసులు ఉన్నాయని, 2019 నుంచి బెయిల్ మీద ఉన్నాడని తెలిపారు. రామదాస్‌ను పట్టుకొనేందుకు 8 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అత్యాచారం జరిగిన ప్రాంతానికి 100 మీటర్ల దూరంలోనే పోలీస్ స్టేషన్ ఉండటం గమనార్హం. నిందితుడి గురించి సమాచారం ఇచ్చిన వారికి రూ.లక్ష రివార్డు ఇస్తామని పుణె పోలీసులు వెల్లడించారు. ఇక ఈ ఘటనపై మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే స్పందించారు. ఈ కేసుపై తమ ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టిసారించిందని, నిందితుడిని త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు.

# ఇప్పటి నుంచి దేవాదాయశాఖకు చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారి

## ఆలయం లెక్కలు చెప్పాల్సిందే..!

హైదరాబాద్ : పాతబస్తీలోని ఛార్మినార్‌ను ఆనుకుని ఉన్న భాగ్యలక్ష్మి ఆలయం అంటే తెలుగు రాష్ట్రాల్లో ప్రతీ హిందువుకూ ఓ సెంటిమెంట్. మైనార్టీలు అధికంగా ఉన్న ప్రాంతంలో ఏర్పాటైన ఆలయం కావడం వల్లనో, లేక కోరిన కోర్కెలు తీర్చే మహిమగల దేవతగా పేరొందడం వల్లనో, భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆలయం దర్శానికి నిత్యం భక్తులు భారీగా తరలివస్తుంటారు. అంతేకాదు బీజేపీ కేంద్ర పెద్దలు అమిత్ షా, నడ్డా వంటి కీలక నేతలు సైతం హైదరాబాద్ వచ్చారంటే తప్పకుండా ఛార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారిని దర్శించుకోకుండా వెళ్లరు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం బీజేపీ నేతలకు ఆనవాయితీగా వస్తోంది. అంతేకాదు ఇటీవల కాలంలో పొలిటికల్ పార్టీల మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లకు, ప్రమాణాలకు భాగ్యలక్ష్మీ ఆలయం వేదికగా మారింది. అంతలా హిందువుల సెంటిమెంట్ ఈ ఆలయంతో పెనవేసుకుని ఉంది. హిందూ, ముస్లింల ఐక్యతతోపాటు, మత విద్వేషాలు చెలరేగకుండా చూడాల్సిన సున్నితమైన ప్రదేశం కూడా ఈ భాగ్యలక్ష్మి ఆలయం. ఇంతలా ప్రధాన్యత ఉన్న భాగ్యలక్ష్మీ ఆలయం తాజాగా దేవాదాయశాఖ ఆధీనంలోకి వెళ్లనుంది. ఇకపై హైదరాబాద్ పాతబస్తీలో చార్మినార్ భాగ్యలక్ష్మీ ఆలయ నిర్వహణ దేవాదాయశాఖ పరిధిలోకి రానుంది. ఈ మేరకు దేవాదాయ శాఖను ట్రైబ్యూనల్ ఆదేశిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. భాగ్యలక్ష్మీ ఆలయ చరిత్ర గురించి మాట్లడుకుంటే..1960 సంవత్సరంలో చార్మినార్ వద్దనున్న ఈ అమ్మవారి ఆలయ పరిధిలో బస్సు ప్రమాదం జరగడంతో అమ్మవారి విగ్రహం కూలిపోయింది. స్థానిక భక్తులు విరాళాలు సేకరించి అమ్మవారి విగ్రహాన్ని తిరిగి ప్రతిష్టించారు. అంతకుముందు పోచమ్మ పేరుతో ఉన్న అమ్మవారి పేరును అప్పటి నుంచి భాగ్యలక్ష్మీ అమ్మవారిగా మార్చారు. అలా నాటి నుంచి ఆలయ నిర్వహణ బాధ్యతలు చూసే మహంత్ రామ్‌చంద్ర దాసు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజ్ మోహన్ దాసు అనే వ్యక్తిని పూజారిగా నియమించారు. టెంపుల్ ట్రస్టీ మీద గతంలో ఉన్న సుప్రీంకోర్టు తీర్పు కారణంగా హెరిడెటరీ ట్రస్టీ ఆర్డర్స్‌తో ఆలయాన్ని తన ఆధీనంలోకి తీసుకొని ఆదాయాన్ని రాజ్ మోహన్‌దాసు ఒక్కరే అనుభవిస్తూ వచ్చారు. దీనిపై మహంత్ రామ్‌చంద్ర దాసు కుమార్తె భాగ్యలక్ష్మీ ఆలయం అజామాయిషీ చేస్తున్న వారిపై కోర్టును ఆశ్రయించారు. కోట్లాది రూపాయాల ఆలయ నిధులను ప్రస్తుత నిర్వహకులు దుర్వినియోగం చేస్తున్నట్టు సాక్షాధారాలను కూడా ట్రబ్యునల్ దృష్టికి తీసుకెళ్లడంతో భాగ్యలక్ష్మీ ఆలయాన్ని దేవాదాయ శాఖకు అప్పగించాలని తాజాగా తీర్పు ఇచ్చినట్టు దేవాదాయశాఖ అధికార వర్గాల సమాచారం. ప్రస్తుతం ఉన్న భాగ్యలక్ష్మీ ఆలయ నిర్వహణ బాధ్యతను మహంత్ మనోహర్ దాసు, మహంత్ రామ్‌చంద్రదాసు నుంచి దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకోనుంది. 1960 దశకం నుంచి వీరు ఆలయ నిర్వహణ భాధ్యతలు చూస్తున్నారు. ఇప్పుడు నిర్వహణ బాధ్యతలను దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకువచ్చేందుకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ ఆలయానికి తక్షణమే ఈఓను నియమించి ఆలయంలో ఎటువంటి అవకతవకలులేకుండా , అభివృద్ధిలో ముందుకు తీసుకు వెళ్ళాలని దేవాదాయ శాఖ కమిషనర్‌ను ట్రైబ్యునల్ ఆదేశించింది. ఈ ఆలయ ఆదాయాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్న ఫిర్యాదులపై కోర్టు విచారణ అనంతరం ఈ ఆదేశాలు జారీ అయినట్టు ఆలయ వర్గాలు తెలిపాయి. అంతేకాదు ఇప్పటి వరకూ ఆలయ ఆదాయం, ఖర్చులు ఇతర వివరాలను సేకరించడంతోపాటు భక్తుల విరాళాలు, నిధుల దుర్వినియోగంపై విచారణ జరపడంతోపాటు, ఒకవేళ అవకతవకలు జరిగితే తగిన చర్యలు తీసుకోవాలని ట్రైబ్యునల్ ఆదేశించినట్లు తెలుస్తోంది.

# ఎమ్మార్ ప్రాపర్టీస్ వ్యవహారంపై ప్రభుత్వం చొరవ

## వివాదాల పరిష్కారానికి అంగీకారం

## ఎమ్మార్ ప్రతినిధులతో సిఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్ : ఎమ్మార్ ప్రాపర్టీతో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. వారి న్యాయకమిటీ అందించే సూచనలు,సలహాలు స్వీకరిస్తామని తెలిపింది. వివిధ కేసులతో పెండింగ్‌లో ఉన్న తమ ప్రాజెక్టుల వివాదాలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మార్ ప్రాపర్టీస్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆశ్రయించింది. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఎమ్మార్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఎమ్మార్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ అలబ్బర్, భారత్ లో యూఏఈ మాజీ రాయబారి డాక్టర్ అహ్మద్ అల్ బన్నా, ఎమ్మార్ గ్రూప్ సీఈవో అమిత్ జైన్, ఆ కంపెనీ ఇంటర్నేషనల్ అ్గ÷ర్స్ హెడ్ ముస్తఫా అక్రమ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి,పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, న్యాయశాఖ కార్యదర్శి తిరుపతి, ఈ సమావేశంలో పాల్గొన్నారు. 2001లో ఉమ్మడి రాష్ట్రంలో దుబాయ్‌కు చెందిన ఎమ్మార్ ప్రాపర్టీస్ హైదరాబాద్లో కన్వెన్షన్ సెంటర్, హోటల్, గోల్ఫ్ కోర్సు, విల్లాలు తదితర ప్రాజెక్టుల్లో పెట్టుబడులకు అప్పటి ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుంది. ఏపీఐఐసీతో ఆ సంస్థ చేసుకున్న ఒప్పందాల్లో అక్రమాలు జరిగాయని అప్పట్లో సీబీఐ, ఈడీ కేసులు నమోదయ్యాయి. ఏజెన్సీల దర్యాప్తులు, కోర్టుల్లో విచారణలు కొనసాగుతున్నాయి.తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత 2015 అక్టోబర్‌లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎమ్మార్ ప్రాపర్టీస్ కు సంబంధించిన ప్రాజెక్టుల వివాదాల పరిష్కారానికి ఛీఫ్ సెక్రెటరీ సారధ్యంలో అయిదుగురు సెక్రెటరీల కమిటీని ఏర్పాటు చేసింది. మరోవైపు కేంద్ర విదేశాంగశాఖ, సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియాకూడా ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు. ఎమ్మార్ ప్రతినిధులతో జరిగిన చర్చల సందర్భంగా ఈ అంశాలన్నింటినీ అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు. వివిధ దర్యాప్తు ఏజెన్సీల కేసులు, ఛార్జ్ షీట్లు, న్యాయపరమైన అంశాలతో ముడిపడి ఉన్నందున ఎమ్మార్ ఒప్పందాల డాక్యుమెంట్లు, కోర్టు కేసుల వివరాలతో పాటు కేంద్ర ప్రభుత్వ సూచనలన్నీ క్షుణ్నంగా పరిశీలించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎమ్మార్ ప్రాపర్టీస్ వ్యవహారాన్ని పరిష్కరించేందుకు 2015లో చీఫ్ సెక్రటరీ నేతృత్వంలో అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీకి అదనంగా న్యాయ నిపుణులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. న్యాయ వివాదాలను అధ్యయనం చేయడానికి, సామరస్య పూర్వక పరిష్కారం చేసుకోవడానికి యూఏఈ ప్రభుత్వ ఆమోదంతో ఒక లీగల్ ఏజెన్సీని ఏర్పాటు చేస్తామని సంస్థ ప్రతినిధులు ప్రతిపాదించగా, వారి ప్రతిపాదనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమోదించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే కమిటీ వారితో సంప్రదింపులు జరిపి తదుపరి సూచనలు, సలహాలు అందిస్తుందని చెప్పారు.

# కృష్ణాజలాల్లో తాగునీటికే ప్రాధాన్యం

## ఇరు రాష్ట్రాలు జాగ్రత్తగా వాడుకోవాలి

## కృష్ణానదీ యాజమాన్య బోర్డు సమావేశంలో నిర్ణయం

హైదరాబాద్ : తాగునీటికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ రెండు రాష్ట్రాల్లో ఉన్న పంటలను దృష్టిలో ఉంచుకొని శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో ఉన్న నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని కృష్ణానదీ యాజమాన్య బోర్డు సమావేశంలో నిర్ణయించారు. ఛైర్మన్ అతుల్ జైన్ నేతృత్వంలో బోర్డు ప్రత్యేక సమావేశం హైదరాబాద్ జలసౌధలో జరిగింది. తెలంగాణ నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ అనిల్ కుమార్, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఈఎన్సీ వెంకటేశ్వరరావు, ఇంజనీర్లు సమావేశానికి హాజరయ్యారు. రెండు జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటిని వినియోగించుకునే విషయమై సమావేశంలో చర్చించారు. మే నెలాఖరు వరకు తమకు 63 టీఎంసీలు కావాలని తెలంగాణ, 55 టీఎంసీలు కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు సీఈల సమావేశం అనంతరం వివరాలు సమర్పించాయి. ప్రస్తుతం రెండు జలాశయాల్లో కనీస వినియోగ మట్టానికి ఎగువన 60 టీఎంసీలకు పైగా నీరు ఉంది. ఉన్న కొద్ది పాటి నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని బోర్డు రెండు రాష్ట్రాలకు సూచించింది. తాగునీటికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని, ఉన్న పంటలను దృష్టిలో పెట్టుకొని మిగిలిన నీటిని ప్రణాళికతో వాడుకోవాలని తెలిపింది. పక్షం రోజులకు ఒకసారి పరిస్థితులను సమీక్షించుకుంటూ ముందుకెళ్లాలని సూచించింది.

# తెలంగాణ ప్రాజెక్టుల బాధ్యత కిషన్ రెడ్డిదే

## రాష్ట్ర ప్రాజెక్టులపై అనేకమార్లు కేంద్రానికి నివేదించాం

## మంత్రి పొన్నం ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు

సిద్దిపేట : తెలంగాణలోని ప్రాజెక్టులు పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశారని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. గత పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న తమ నాయకుడిని బీఆర్ఎస్ పార్టీ సంప్రదించలేదని రాష్ట్రానికి ఏం కావాలో అడగలేదని.. ప్రధాని వస్తే కేసీఆర్ కలవడంలేదని ఏదేదో చెప్పి కాలం గడిపారని చెప్పారు. తెలంగాణ ప్రాజెక్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎంపీలు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని చాలాసార్లు కలిసి అడిగామని గుర్తుచేశారు. ఫెడరల్ వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం అనే సంబంధాల దృష్ట్యా రాష్ట్రానికి అవసరమైన అన్ని ప్రాజెక్టులు అడుగుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా గురువారం హుస్నాబాద్ టౌన్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటు హక్కును మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు వినియోగించు కున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... రాష్ట్రానికి రావాల్సిన ఏ ప్రాజెక్టు రాకపోయినా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బాధ్యత వహించాల్సి ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇప్పటి వరకు మెట్రో మలిదశ , మూసీ, ఓఆర్ఓఆర్, ట్రిపుల్ ఆర్ , హైదరాబాద్ తాగునీటి సమస్య ఇతర కార్యక్రమాలకు సంబంధించి ఉపాధి అవకాశాలు మెరుగుపడే అంశాలకు సంబంధించి అనేకమైన ప్రాజెక్టులు కేంద్రానికి సమర్పించామని తెలిపారు. కేంద్రం తెలంగాణ రాష్ట్ర విభజనకు సంబంధించిన హామీలు నెరవేర్చాల్సి ఉందని అన్నారు. కిషన్ రెడ్డి రాష్ట్రానికి నిధులు తేకపోతే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ వేరు కాదని గమనించాల్సి వస్తోందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఢిల్లీలో దోస్తీ గల్లీలో కుస్తీ అని ముందు నుంచి చెబుతున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం దేశానికి రోల్ మోడల్‌గా తీసుకున్న కుల సర్వేపై మొదటి వారంలో శాసన సభలో చట్టం చేసి రాజకీయ విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చేసే తీర్మానాన్ని చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కేంద్రం ఎప్పుడైతే ఈబీసీకి సంబంధించి షెడ్యూల్లో మార్చుకున్నారో అదేవిధంగా దీనిని కూడా దాని మాదిరిగానే మార్చాల్సిందేనని.. రాజకీయ కారణం చూపిస్తే సరిపోదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గుజరాత్‌లో ప్రధాని మోదీ స్టేట్మెంట్ ఉంది దాని మాదిరిగానే రిజర్వేషన్లు ఇస్తున్నామని అన్నారు. కొంతమంది నేతలు తప్పుడు ప్రచారాలు చేసి మత పరమైన పబ్బం గడుపుతున్నారని మండిపడ్డారు. పాకిస్తాన్ - ఇండియా అంటూ నేతలు రెచ్చగొడుతున్నాని ధ్వజమెత్తారు. తమకు తెలంగాణ ప్రయోజనాలు ప్రజల అభివృద్ధి ముఖ్యమని స్పష్టం చేశారు. తమిళనాడులోఎన్ని రాజకీయ విభేదాలు ఉన్న అభివృద్ధి ప్రయోజనాలు విషయంలో అందరూ ఒక్క మాట మీదనే ఉంటారని చెప్పారు. తెలంగాణకు సంబంధించిన ప్రయోజనాల విషయంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతో కేంద్రంలో ఉన్న బీజేపీ కలిసి వచ్చి పెద్దన్న పాత్ర పోషించి నిధులు కేటాయించే ప్రయత్నం చేయాలని కోరారు. అది కేంద్ర ప్రభుత్వం బాధ్యతని.. లేదంటే తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. మాజీ మంత్రి కేటీఆర్ మాటలు వింటే నవ్వువస్తోందని విమర్శించారు. ఢిల్లీలో కాంగ్రెస్ ఓడిపోతే ట్వీట్ చేస్తున్నారు.. పంటలు ఎండిపోతే ట్వీట్ చేస్తున్నారని చెప్పారు. తమ ప్రభుత్వం తాగు, సాగు నీటికి చర్యలు తీసుకుంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# వ్యాక్సిన్ దుష్ప్రభావంతో చనిపోయిన వారి సంగతేంటి

## వారికి పరిహారంపై కేంద్రం స్పందించాలి

## సుప్రీం ధర్మాసనం సూటి ప్రశ్న

న్యూఢిల్లీ : కోవిడ్ వ్యాక్సినేషన్ దుష్ప్రభావాల కారణంగా చనిపోయిన వారికి పరిహారంపై కేంద్రం స్పందించాలని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. కరోనా వ్యాక్సిన్ తీసుకున్న దేశ ప్రజల్లో కొందరు టీకా పడకపోవడంతో దుష్ప్రభావాల కారణంగా చనిపోయారు. ఇలా చనిపోయిన వారి బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించేందుకు కేంద్రం ఏదైనా పాలసీ చేసిందో.. లేదో చెప్పాలని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం అడిషనల్ సోలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటిని అడిగింది. కోవిడ్-19 వ్యాక్సిన్ ఇచ్చిన తర్వాత తన భర్త ఆరోగ్యం క్షీణించి చనిపోయాడని, తనకు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని కేరళకు మిసెస్ సయ్యద్ సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ సుప్రీంలో విచారణకొచ్చిన సందర్భంలో ఎక్స్‌గ్రేషియాపై కేంద్రం స్పందించాలని ఆదేశించింది. కరోనా సమయంలో?ఎమ్మ్జ్గ÷న్సీ పేరుతో క్లినికల్ ట్రయిల్స్ లేకుండానే కొవిషీల్డ్ వ్యాక్సిన్‌కు కేంద్రం అనుమతి ఇచ్చిందని, దీంతో వ్యాక్సిన్ వేసుకున్న వారిలో దుష్ప్రభావం ఇప్పటికీ ఉందని అవేకెన్ ఇండియా మూమెంట్ ఆరోపించిన సంగతి తెలిసిందే. కొవిషీల్డ్ వ్యాక్సిన్ వేసుకున్న వారిలో గుండెపోటు, క్యాన్సర్, నరాల వ్యాధులు వంటివి వస్తున్నాయని అవేకెన్? ఇండియా మూమెంట్ ప్రతిధులు ఆరోపించారు. ఇప్పటికే చాలామంది మృతి చెందారని, వారికి కేంద్ర ప్రభుత్వంతో పాటు వ్యాక్సిన్ ?తయారీ సంస్థ నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వంతో పాటు వ్యాక్సిన్ ను ?ప్రమోట్? చేసిన సెలబ్రెటీలు కూడా సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

# రాజకీయాలకు ఓ హద్దు ఉండాలి

## కొండగట్టు, మాసాయిపేట ఘటనలు మరిచారా

## శ్రీశైలం పవర్ ప్లాంట్ అగ్ని ప్రమాదంలో ఆరుగురు మృతి గుర్తుందా

## హరీష్ రావు రాజకీయాలపై మండిపడ్డ మంత్రి ఉత్తమ్

దోమలపెంట : రాజకీయం చేయడానికో హద్దు ఉండాలని హరీష్ రావుకు మంత్రిఉత్తమ్ కుమార్ రెడ్డి చురకలు అంటించారు. టన్నెల్ వద్ద సహాయక చర్యలు జరుగుతుంటే రాజకీయం చేస్తారా అని మండిపడ్డారు. గతంలో బిఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో కొండగట్టు బస్సు ప్రమాదంలో 62 మంది చనిపోతే.. నాడు కేసీఆర్ వెళ్లలేదు. కేసీఆర్ ఫామ్‌హౌస్ దగ్గర్లోనే మాసాయిపేట రైలు ప్రమాదం జరిగింది. రైలు ప్రమాదంలో చిన్నారులు చనిపోతే కేసీఆర్ కనీసం పరామర్శించలేదు. గతంలో శ్రీశైలం పవర్ ప్లాంట్ అగ్ని ప్రమాదంలో ఆరుగురు ఉద్యోగులు చనిపోతే కనీసం వెళ్లి చూడలేదు. పాలమూరు పంప్‌హౌస్‌లో ప్రమాదం జరిగి ఆరుగురు చనిపోతే స్పందించలేదు. ఇప్పుడేమో ప్రమాదం జరిగిన చోట రాజకీయం చేయడానికి హరీశ్‌రావు వచ్చారు. హరీశ్‌రావుకు అనుభవం ఉంటే పదేళ్లలో ప్రాజెక్టు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. నిపుణుల చర్యలకు ఇబ్బంది కావొద్దని అందరినీ లోపలికి పంపట్లేదు. టీబీఎం వెనుక ఉన్న బురద తొలగింపు పనులు జరుగుతున్నాయి. బురద తొలగింపు పూర్తికాగానే మిషన్ శిథిలాలు తొలగిస్తాం అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద సహాయక చర్యలు రెండ్రోజుల్లో పూర్తి చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. రెండు నెలల్లో తిరిగి సొరంగం తవ్వకం పనులు చేపడతామని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. టన్నెల్ కూలిపోవడానికి గత ప్రభుత్వ వైఫల్యమేనని ఉత్తమ్ ఆరోపించారు. గత ప్రభుత్వం టన్నెల్‌లో నీటి తొలగింపు పనులు కూడా చేపట్టలేదు. టన్నెల్‌లో నీటిని తోడివేసి ఉంటే.. ఇప్పుడీ ప్రమాదం జరిగేది కాదు. గ్రావిటీ ద్వారా 30 టీఎంసీలు తీసుకునే ప్రాజెక్టును పక్కకు పెట్టారు. టన్నెల్ పూర్తి చేసి ఉంటే 4.50 లక్షల ఎకరాలకు నీళ్లు అందేవని అన్నారు.. భారాస చేపట్టిన ప్రాజెక్టులన్నీ వాళ్ల జేబులు నింపుకొనేందుకే. రూ.లక్ష కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం కడితే అది మూడేళ్లకే కూలిందని గుర్తు చేశారు. .

# ఎస్ఎల్‌బీసీ ఘనటపై సీఎం బాధ్యతారాహిత్యం

హైదరాబాద్ : ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్దకు వెళ్లే ముందు హైదరాబాద్ హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ఎస్ఎల్‌బీసీ ఘటనలో సహాయక చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైందని ఆరోపించారు. వివిధ ఏజెన్సీల మధ్య సమన్వయాన్ని సాధించడంలో కూడా ప్రభుత్వం ఫెయిల్ అయిందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వ బృందాలు, రాష్ట్ర ప్రభుత్వ బృందాలు, ఏజెన్సీ మధ్య సమన్వయం లోపించినట్టు కనిపిస్తుందన్నారు. వీరికి డైరెక్షన్ ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా ఫెయిల్ అయింది అని హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంత్రులు అక్కడికి వెళ్లి హెలికాప్టర్లలో టీవీ ఇంటర్వ్యూలు ఇవ్వడానికి పోటీ పడుతున్నారు తప్ప, సహాయక చర్యలు చేపట్టడంలో పూర్తిగా ఫెయిల్ అయ్యారని పేర్కొన్నారు. పైనుంచి హెలికాప్టర్‌లో చూస్తే సొరంగం లోపల ఏమన్నా కనిపిస్తాదా, ప్రత్యేకంగా చూడడానికి వీఎక్స్ రే కెమెరాలు ఉన్నాయా? హెలికాప్టర్లలో చెక్కర్లు కొట్టుడు టీవీ ఇంటర్వ్యూలు ఏమిటో నాకు అర్థం కావడం లేదని తెలిపారు. వారి ప్రాణాలు కాపాడటానికి ప్రతి నిమిషం కూడా చాలా ముఖ్యమైనదని.. క్షణం కూడా చాలా విలువైనదని తెలిపారు. సొరంగం లోపల ఆహారం లేక తాగునీరు లేక చావు బ్రతుకుల మధ్య కొట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి ప్రాణాల మీద రాష్ట్ర ప్రభుత్వానికి శ్రద్ధ కరువైందేమోనని అనిపిస్తుందని హరీశ్‌రావు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఎనిమిది మంది ప్రాణాలు ముఖ్యమా? ఎన్నికల ప్రచారం ముఖ్యమా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. కనీసం అక్కడికి వెళ్లి, ఒక డైరెక్షన్ ఇవ్వడంలో రేవంత్ రెడ్డి, నీటి పారుదల మంత్రి పూర్తిగా ఫెయిలయ్యారని ఆరోపించారు.తమ తప్పును కప్పిపుచ్చుకోవడానికి, ఇతరుల మీద నెపం నెట్టే ప్రయత్నం చేస్తున్నారు కాంగ్రెస్ నేతలు అని హరీశ్‌రావు మండిపడ్డారు.

# సంపాదకీయం

## వాణిజ్య పంటలకు మార్కెట్ కల్పించలేని పాలకులు!

రకరకాల వాగ్దానాలు..రకరకాల పథకాలు...రైతులను ఆదుకునేందుకు మద్దతు ధరలు..ఇలాంటి ప్రకటనలతో ప్రభుత్వాలు ప్రకటనలు గుప్పించి అధికారంలోకి వస్తున్నా..అన్నదాతల విషయంలో ఏ ప్రభుత్వం కూడా ముందుచూపుతో వ్యవహరించడం లేదు. దీనికంతటికి ఈ దేశంలో సమగ్ర వ్యవసాయ విధానం లేదు. ఏ పంటలు పండించాలి..ఏ పంటలు ఎగుమతి చేయాలన్న దానిపై పాలకులకు అవగాహన లేకుండా పోతోంది. రైతుల నుంచి సమాచారం వచ్చినా పట్టించుకోవడం లేదు. ప్రధానంగా మనదేశంలో వరి,గోధుమ, జొన్నలు లాంటి తృణధాన్యాలతో పాటు, వాణిజ్య పంటలకు కూడా అవకాశం ఉంది. మన నేతలు అన్ని పంటలకు అనువుగా ఉన్నాయి. ప్రధానంగా వాణిజ్య పంటలను విపరీతంగా పండించే ఛాన్స్ ఉంది. మిర్చి, పసుపు, పత్తి, అల్లం వెల్లుల్లి లాంటి పంటలను కూడా ఎగుమతులు చేసేలా పండించుకునే వీలుంది. రైతులు చెమటోడ్చి ఈ పంటలను ఏటా పండిస్తూనే ఉన్నారు. అయినా పంటల దిగుబడి రాగానే మద్దతు ధరల పేచీ..ఎగుమతుల విధానంలో పేచీ...ఇలా సవాలక్ష కొర్రీలతోరైతులను ఆగం చేస్తున్నారు. ఇంతెందకు ఇటీవల ఎపిలో మిర్చి పండించిన రైతులకు ప్రభుత్వాలు చుక్కలు చూపుతున్నాయి. తెలంగాణలో మిర్చితో పాటు పత్తి, పసుపు పంటలకు సకాలంలో గిట్టుబాట ధరలు రావడం లేదు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ గురించి కబుర్లు చెబుతున్న సిఎం చంద్రబాబు నాయుడు మిర్చి సేకరణ విషయంలో పూర్తిగా విఫలం అయ్యారు. తెలంగాణలోనూ అదే పరిస్థితి. పండించిన పంటలను కొనుగోలు చేసి, పేదలకు తక్కువ ధరలకు అమ్మడం కూడా ఓ రకంగా ఆదుకోవడమే అవుతుంది. ఎగుమతులను పెంచుకోవడం ద్వారా రైతులకు అండగా నిలవవచ్చు. కానీ అలా జరగడం లేదు. రూపాయికే కిలో బియ్యం ఇస్తున్న ప్రభుత్వం ఈ దండగమారి పథకాన్ని ఎత్తేయడం లేదు. ఉపాధిహామీతో పనికిరాని పనులు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఉచిత పథకాలతో కూలీలు కూడా దొరకడం లేదని సుప్రీం జడ్జి వ్యాఖ్యానించినా మొద్దు నిద్ర వీడడం లేదు. తమ భద్రతకు వేలకోట్లు ఖర్చు చేస్తున్న నాయకులు రైతుల కోసం మాత్రం బిచ్చం వేసినట్లుగా వ్యవహరిస్తున్నారు. తాజాగా ఎపిలో మిర్చి రైతులు గిట్టుబాటు ధరలు లేక ఆందోళన చెందుతున్నారు. తెలంగాణలో కూడా ఇప్పుడు మిర్చి బాగా పండింది. నిజానికి వ్యవసాయాధారిత పరిశ్రమలను పెట్టి పంటలను కొనుగోలు చేసి, మిర్చి పౌడర్‌ను తక్కువ ధరలకు ప్రజలకు అందించవచ్చు. దీంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. మార్కెట్లో డబ్బు చెలామణి అవుతుంది. ప్రభుత్వం, ప్రైవేట్ రంగంలో ప్రోత్సాహకాలతో పంటలను అమ్మించే ప్రయత్నం చేయవచ్చు. దిగుమతులు తగ్గించి, ఎగుమతులు పెంచితే విదేశీ మారకం పెరగగలదు. కానీ అలా చేయడం లేదు. ఎపిలో పీకల్లోతు కష్టాల్లో ఉన్న మిర్చి రైతులను బేషరతుగా ఆదుకోవడానికి బదులుగా కేంద్ర ప్రభుత్వం అనేక ఆంక్షలు పెట్టడం, రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూడడం కూడా తప్పే. ఇలాంటి సందర్భంలో ఎలా ఆదుకోవాలన్న ఆలోచన లేకుండాపోతోంది. లక్షల రూపాయలు పెట్టుబడి పెడితేగాని మిర్చి సాగు సాధ్యం కాదు. నారు నాటినప్పటి నుండి పంట చేతికివచ్చేంతవరకు మిర్చి రైతుది దినదిన గండం బతుకే! చీడ, పీడలు, తెగుళ్ల బెడద ప్రతిరోజూ వెంటాడుతున్నది. వీటన్నింటిని అధిగమించి యార్డు దాకా తెచ్చిన సరుకుకు నామమాత్రపు ధర కూడా పలకకపోతే సాగు చేసిన రైతు పరిస్థితి ఏమిటన్న ఆలోచన చేసేదెవరు. ఆదుకోవాలని కోరితే పండిన పంటలో పావు వంతే కొంటామనడం ఏ విధమైన ఊరడంపో అర్థం కాదు.  మిగిలిన పంటను ఎవరికి అమ్ముకోవాలన్నది వారే చెబితే బాగుండేది.  గత ఏడాది గరిష్టంగా క్వింటాకు 28 వేల రూపాయలు ధర పలికితే, ఇప్పుడు కేవలం 11,781 రూపాయల రేటు ఎలా నిర్ణయించారు. దీనికి ప్రాతిపదిక ఏమిటన్నద ఇపాలకులు వివరించాలి. అది కూడా నెలరోజుల వరకే కొంటామని చెప్పడం మరీ దారుణం. ఈ తరహా విధానాలు మిర్చి రైతాంగానికి పెనుశాపంగా మారాయి. కేంద్ర ప్రభుత్వం మద్దతుగా ప్రకటించిన 11,781 రూపాయలను ప్రామాణికంగా తీసుకుని గత ఏడాది ధరలతో పోలిస్తే ఎకరాకు రెండు లక్షల రూపాయల నష్టం వస్తుందని రైతులు లెక్కలు వేసి చెబుతున్నారు. ఇంత ఘోరంగా పరిస్థితులు ఉంటే, రాష్ట్రంలో ఏ రైతు కూడా కష్టాల్లో లేరని ఉభయ సభల నుద్దేశించి చేసిన ప్రసంగంలో గవర్నర్ చేత రాష్ట్ర ప్రభుత్వం చెప్పించడం మరీ దారుణం! ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో నెలకొన్న వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం గుర్తించాలి. తక్షణం నాఫెడ్, మార్క్‌ఫెడ్‌లను రంగంలోకి దించి రైతాంగం కోరుతున్నట్లు క్వింటాకు కనీసం 20 వేల రూపాయల చొప్పున చెల్లించి, మొత్తం పంటను కొనుగోలు చేయాలి. అన్ని రకాల షరతులను ఎత్తివేయాలి. దీనికోసం అవసరమైతే కలిసివచ్చే శక్తులను కలుపుకుని కేంద్రంపై ఒత్తిడి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం కావాలి. పాలక కూటమికి రాజకీయంగా ఇబ్బంది అనుకుంటే రైతులను, అన్ని రాజకీయ పార్టీలను సమీకరించి కేంద్రం వద్దకు వెళ్లాలి. ఢిల్లీ పాలకుల మెడలు వంచి మిర్చి రైతులకు న్యాయం జరిగేలా చూడాలి. ఒకసారి రైతు ఈ ధరకు పావు వంతు సరుకును అమ్మిన తరువాత మిగిలిన సరుకుకు ఎంత ధర పలుకుతుందో తెలియంది కాదు. ట్రేడర్లు అంతకన్నా తక్కువకే కొంటారు తప్ప ధరలు పెంచరు. నెలరోజుల గడువు ముగిసిన తరువాత మార్కెట్‌కు వచ్చే సరుకు పరిస్థితి ఏమిటన్న ఆలోచన కూడా చేయరంటే...వీరికి పంటలపై  ఎలాంటి అవగాహన ఉందో తెలుసుకోవచ్చు. ఉదయం లేచింది మొదలు మార్కెట్ ఎకానమి సూత్రాలను వల్లించే కేంద్ర ప్రభుత్వ పెద్దలకు మార్కెట్ ఒడిదుడుకులు, పంటల గురించి అవగాహన లేదనుకోవాలి. లాభాల పంటను, రైతులకు నష్టాల మంటను మిగల్చడం కాక మరోటి కాదు. ఆర్థికంగా రాష్ట్రం అనేక కష్టాలు ఎదుర్కుంటుంటే వర్కింగ్ కేపిటల్‌ను ఏర్పాటు చేసుకోవాలనడం, ఖర్చులో సగభాగాన్ని రాష్ట్రమే భరించాలని కేంద్రం షరతులు పెట్టడం మరింత దుర్మార్గం. ఇంత నిర్దయగా కేంద్రం వ్యవహరించినా, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు పెదవి విప్పడానికి సైతం సిద్ధపడకపోవడం బాధాకరం! తెలుగు ప్రజల ఆత్మగౌరవ నినాదంతో ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ తీరు, రైతులను ఆదుకనేలా లేదు. సొంతంగా పంటల కొనుగోలు విధానాలు అవలంబించాలి. గుంటూరు మిర్చి యార్డు నుండి చైనా, శ్రీలంక, బంగ్లాదేశ్, ఇండోనేషియా, థారులాండ్‌లకు మిర్చి ఎగుమతులు అత్యధికంగా జరుగుతాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారతదేశం నుండి 1.79 లక్షల టన్నుల మిర్చిని చైనా దిగుమతి చేసుకుంది. వీటి విలువ 4,123 కోట్ల రూపాయలు! అయితే, అమెరికాతో అంటకాగే విధానాల్లో భాగంగా చైనాతో పాటు పలు ఇతర దేశాలకు చేసే ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం అనేక ఆంక్షలు పెట్టింది. ఫలితంగా ఎగుమతుల మార్కెట్ భారీ స్థాయిలో క్షీణించి, నిల్వలు పేరుకుపోయాయి. రైతాంగం ఆందోళన నేపథ్యంలో చైనాతో ఆర్డర్లను పునరుద్ధరించడానికి రాష్ట్ర మార్కెటింగ్ అధికారులు ప్రయత్నించినప్పటికీ కేంద్రం నుండి సానుకూల స్పందన రాలేదని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు కళ్లు తెరవాలి. సమగ్ర పంటల విధానం అవలంబించాలి. ఎగుమతులు దిగుమతులపై సమీక్షించాలి. అప్పుడే వ్యవసాయరంగం పురోగమించగలదు.

# అబద్ధాలు పదేపదే చెబితే నిజాలుకావు



**పచ్చిఅబద్ధాలతోనే పరిపాలన సాగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి**

**హైడ్రాతో కూరుకపోయిన రియల్టీరంగం**

**రాష్ట్రంలో పడిపోతున్న ఆదాయం : ఎమ్మెల్సీ కవిత**

హైదరాబాద్ : రాష్ట్ర ప్రజలకు పదేపదే అబద్ధాలు చెబితే అవి నిజాలు అవిపోతాయని సీఎం రేవంత్‌రెడ్డి భ్రమిస్తున్నారని.. కానీ అలా ఎప్పటికీ కావనే నిజాన్ని ఆయన గుర్తించాలని ఎమ్మెల్సీ కవిత ఎద్దేవా చేశారు. తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడారు.నెలకు రూ.6500 కోట్ల వడ్డీ కడుతున్నామని అబద్ధాలు చెబుతున్న సీఎం.. కాగ్ నివేదిక ప్రకారం ఏనెల కూడా రూ. 2600 కోట్లకు మించి వడ్డీ కట్టలేదని పేర్కొన్నారు. మరి రూ. 6500 కోట్లు కడుతున్నామని సీఎం ఎందుకు అబద్దాలు చెబుతున్నారు..? అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కనీసం ఇప్పుడైనా నిజాలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆదాయంపై కూడా రేవంత్ రెడ్డి తప్పుడు లెక్కలు చెబుతున్నారని ఆరోపించారు. ప్రతీ నెల 18 వేల కోట్ల ఆదాయం వస్తున్నదని సీఎం చెబుతున్నారు. కానీ కాగ్ ప్రకారం 12 వేల కోట్లకు మించి ఈ ఏడాది ఆదాయం రాలేదన్నారు. మరి ఈ అబద్ధలు లెక్కలు ఎందుకు చెప్తున్నట్లు..? ఎవరిని మభ్యపెట్టడానికి చెబుతున్నారు..? అని కవిత ప్రశ్నించారు. ఆదాయం పడిపోవడానికి ప్రధాన కారణం హైడ్రా అని తేల్చిచెప్పారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా 18 వేల కోట్ల ఆదాయం వస్తుందని ప్రభుత్వం అంచనా వేసిందన్నారు. కానీ హైడ్రా విధ్వంసం వల్ల దాని ద్వారా ఆదాయం 5800 కోట్లకు పడిపోయిందన్నారు.  బీఆర్ఎస్ హయాంలో ఎస్ఎల్బీసీ పనులే జరగలేదని సీఎం పచ్చి అబద్ధాలు చెబుతున్నారని తెలిపారు. కేసీఆర్ విశాల హృదయం తెలవాలంటే ఎస్ఎల్బీసీ విషయంలో అర్థమవుతుందని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఈ ప్రాజెక్టుపై కేసీఆర్ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ విషయంలో అప్పటి ప్రతిపక్ష నేత జానా రెడ్డిని ముందుపెట్టి కాంట్రాక్టర్‌కు 100 కోట్లు అడ్వాన్స్ కేసీఆర్ ఇచ్చారన్నారు. కరోనా తర్వాత కాంట్రాక్టర్ పనులు చేపట్టలేమంటే మళ్లీ 100 కోట్లు ఇచ్చిన ఘనత కేసీఆర్‌ది అన్నారు. టీడీపీ, కాంగ్రెస్ పార్టీలు 30 ఏళ్లలో ఈ ప్రాజెక్టుపై పెట్టిన ఖర్చు 3340 కోట్లు. కానీ కేవలం 10 ఏళ్లలో కేసీఆర్ పెట్టిన ఖర్చు 3890 కోట్లు. ఇంత ఖర్చు పెట్టి 11 కీమీ మేర టన్నెల్ తవ్విస్తే ముఖ్యమంత్రి అబద్దాలు చెబుతున్నారని కవిత మండిపడ్డారు. సొంత జిల్లాలో సొంత ఊరు పక్కన విపత్తు జరిగితే పట్టించుకోకుండా సీఎం ఢిల్లీ వెళ్లారన్నారు. 8 మంది ప్రాణాలు చిక్కుకుంటే ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారానికి వెళ్లడం సరికాదన్నారు. ఉత్తరాఖాండ్‌లో టన్నెల్‌లో కార్మికులు చిక్కుకుంటే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వెళ్లి వాళ్ల ప్రాణాలతో బయటపడేవరకు అక్కడే ఉన్నారని గుర్తుచేశారు. కానీ మన ముఖ్యమంత్రికి సోయి లేదు.. ఐరన్ లెగ్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నాలుగు ప్రాజెక్టులు కొట్టుకుపోయాయన్నారు. సుంకిశాల ప్రాజెక్టు రిటైనింగ్ వాల్ కూలిపోతే ఇప్పటికీ అతీగతీ లేదు.. ఖమ్మం జిల్లాలో పెద్దవాగు మీద మొత్తం ప్రాజెక్టు కొట్టుకుపోతే ప్రభుత్వం స్పందించలేదని దుయ్యబట్టారు. మెఘా కృష్ణా రెడ్డి కడుతున్న ప్రాజెక్టుల గురించి మాట్లావద్దన్నట్లుగా సీఎం వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. సుంకిశాల ప్రాజెక్టు మీద ఒకరు ఆర్టీఐ వేస్తే దేశ భద్రతకు సంబంధించిన విషయం కాబట్టి జవాబు ఇవ్వమని ప్రభుత్వం చెప్పింది అని కవిత గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ ప్రజలు ముఖ్యమా కాంట్రాక్టర్లు ముఖ్యమా..? అని నిలదీశారు.

# మరోమారు వక్రబుద్ధి చూపించుకున్న పాకిస్థాన్

**జెనీవా వేదికగా కాశ్మీర్ ప్రజాస్వామ్యంపై గగ్గోలు**

**ధీటుగా తిప్పికొట్టిన భారత ప్రతినిధి**

న్యూఢిల్లీ : అంతర్జాతీయ వేదికలపై తరచూ పాకిస్థాన్  భారత్‌పై తన అక్కసు వెళ్లగక్కుతున్న పాకిస్థాన్‌కు మరోమారు భారత్ ధీటుగా బదులిచ్చింది. నోరు మూసుకునేలా చేసింది. దాని కుత్సిత బుద్దిని బయటపెట్టింది.  తాజాగా జమ్మూకశ్మీర్‌లో ప్రజాస్వామ్యం అణచివేతకు గురవుతోందని, మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలిలో దాయాది దేశం ఆరోపించింది. ఈ ఆరోపణలను భారత్ తీవ్రంగా  ఖండించింది. అంతేకాక.. మాకు ఉపన్యాసాలు ఇచ్చే స్థాయిలో ఆ దేశం లేదని స్పష్టం చేసింది జెనీవాలో జరిగిన ఈ సమావేశంలో జమ్మూకశ్మీర్‌ను ఉద్దేశించి పాక్ న్యాయ, మానవ హక్కుల మంత్రి అజం నజీర్ తరార్ వ్యాఖ్యలు చేశారు. దీనిపై భారత రాయబారి క్షితిజ్ త్యాగి దీటుగా స్పందించారు. 'కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లు ఎప్పుడూ భారత్‌లో అంతర్భాగమే. దశాబ్దాల తరబడి పాకిస్థాన్ ఉగ్రవాదం కారణంగా దెబ్బతిన్న ఆ ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. మానవ హక్కుల ఉల్లంఘన, మైనారిటీలను హింసించడంతో సహా ప్రజాస్వామ్య విలువలను పాటించని దాయాది దేశం భారత్‌కు ఉపన్యాసాలు ఇచ్చే స్థాయిలో లేదు. ఆ దేశ వాక్‌చాతుర్యంలోనే కపటత్వం కన్పిస్తోంది. ఐరాస జాబితాలోని పలు ఉగ్రవాద సంస్థలకు ఆ దేశం ఆశ్రయం కల్పిస్తుంది. ప్రజాస్వామ్య పురోగతి, ప్రజలకు గౌరవం కల్పించడం వంటి వాటిపై భారత్ దృష్టిసారిస్తుంది. ఆ దేశం మాపై ఆరోపణలు చేయడం మానేసి.. తమ దేశంలోని ప్రజలకు సుపరిపాలనను అందించడంపై దృష్టిపెట్టాలి' అని త్యాగి పేర్కొన్నారు. ఇక, ఇటీవల చైనా అధ్యక్షతన జరిగిన భద్రతామండలి సమావేశంలోనూ పాకిస్థాన్ విదేశాంగ మంత్రి మహమ్మద్ ఇషక్ దార్ జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తారు. దీనికి సైతం భారత్ ఘాటుగా స్పందించింది. జైషే మహమ్మద్ వంటి సంస్థలను ప్రోత్సహించే పాక్.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామని చెప్పడం అత్యంత హాస్యాస్పదమని ఆగ్రహం వ్యక్తంచేసింది. ముందుగా దీనిని సరిదిద్దుకోవాలని సూచించింది.

# గూగుల్‌లో ఉద్యోగుల తొలగింపు

**బ్లూమ్‌బర్గ్ కథనంలో వెల్లడి**

న్యూఢిల్లీ :  ప్రముఖ టెక్ కంపెనీ గూగుల్ తాజాగా ఉద్యోగుల తొలగింపు  పక్రియ చేపట్టింది. క్లౌడ్ డివిజన్‌లోని ఉద్యోగుల సంఖ్యను తగ్గించిందని సమాచారం. సంబంధిత వ్యక్తులు ఈవిషయాన్ని వెల్లడించినట్లు బ్లూమ్‌బర్గ్ తన కథనంలో పేర్కొంది. అయితే ఎంతమందిని తొలగించిందనే విషయం మాత్రం తెలియరాలేదు. వంద మందికి పైగా ఉండొచ్చని, అది కూడా కొన్ని టీమ్స్‌పై మాత్రమే తొలగింపుల ప్రభావం ఉందని తెలుస్తోంది. ఇదంతా కూడా ఖర్చు తగ్గించుకునే ప్రయత్నంలో భాగమని అంటున్నరు. కంపెనీ దీర్ఘకాలిక విజయాల కోసం వ్యాపారానికి కీలకమైన రంగాల్లో పెట్టుబడులు పెంచేందుకు సంస్థ ప్రయత్నిస్తోంది. అందులోభాగంగా కొన్ని మార్పులు చేస్తున్నామని గూగుల్ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా రానున్న రోజుల్లో అవకాశాల్ని అందిపుచ్చుకొనేందుకు అనేక సర్దుబాట్లు చేశామని వెల్లడించారు. మరోవైపు ఇటీవల త్రైమాసిక ఫలితాల్లో గూగుల్ తన క్లౌడ్ వ్యాపారంలో ఆదాయ అంచనాలను అందుకోలేకపోయింది. 2025 మూలధన వ్యయాలు కూడా అంచనాలకు మించిపోయాయి. ఈనేపథ్యంలో ఉద్యోగుల సంఖ్యను తగ్గించడం గమనార్హం.

# గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఉదిక్తతలు

**మంచిర్యాల జిల్లా నస్పూర్ మున్సిపాలిటీలో బీజేపీ, కాంగ్రెస్ వర్గాల మధ్య ఘర్షణలు**


**ఒకరిపై ఒకరు రాళ్లురువ్వుకున్న కార్యకర్తలు.. పోలీసుల రంగ ప్రవేశం**

**పరిస్థితిని సమీక్షించిన పోలీస్ కమిషనర్ శ్రీనివాస్**

మంచిర్యాల : తెలంగాణలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు గురువారం ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. కొన్ని చోట్ల ప్రశాంతంగా, మరి కొన్ని చోట్ల ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో మంచిర్యాల జిల్లా, నస్పూర్ మున్సిపాలిటీలోని తీగల్ పహాడ్ పోలింగ్ కేంద్రం వద్ద బీజేపీ కాంగ్రెస్ వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుని ఉద్రిక్తత పరిస్థితికి దారితీసింది. దీంతో బీజేపీ కార్యకర్తలపై కాంగ్రెస్ శ్రేణులు దూసుకెళ్ళాయి. పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. ఇరు వర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకుని ఇరు వర్గాలను చెదరగొట్టి.. పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కాగా పోలీసు కమిషనర్ శ్రీనివాస్ అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరిస్థితిని సమీక్షిస్తున్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద మోహరించారు.స్థానిక ఎస్ఐ కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని స్థానిక బీజేపీ నేత కమలాకరరావు ఎస్ఐతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఎస్ఐ బీజేపీ నేతపై దాడి చేశారంటూ బీజేపీ కార్కకర్తలు ఆందోళనకు దిగారు. మరోవైపు కాంగ్రెస్ కార్యకర్తలు కూడా బీజేపీ శ్రేణులపై దూసుకువచ్చారు. దీంతో ఇరు వర్గాల మధ్య పరస్పరం వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. ఒక నొక దశలో పరిస్థితి చేజారి ఇరు వర్గాలకు చెందిన కార్యకర్తలు పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సంఘటన ప్రదేశానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఎన్నికలను రెండు పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి.  ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఓటు హక్కును 69,134 మంది పట్ట భద్రులు, 5,693 మంది ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధికారులు150 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. బ్యాలెట్ పద్దతిలో ఓటింగ్ జరిగింది. ఎన్నికల విధుల్లో 1500 మంది సిబ్బంది, 2 వేల మంది పోలీసులతో బందోబస్త్ ఏర్పాటు చేశారు. మంచిర్యాల జిల్లాలో అత్యధిక ఓటర్లు ఉన్నారు. ఇక్కడ పురుష ఓటర్లు కీలకంగా ఉన్నాయి. అలాగే నిజామాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.

# సంపదతో పాటే శత్రువుల రాక !

తిరుమల : మనకు కలిసివచ్చే కాలంలో సిరిసంపదలు, పేరు ప్రఖ్యాతులు వస్తే అకారణ శత్రువులు ఏర్పడతారు. డబ్బుతో పాటే మనలను వ్యతిరేకింరే వారు పెరుగుతారు. అసూయాపరులు మనవైపే చూస్తుంటారు. వీరు ఎంత లౌక్యులంటే వారి చూపుల్లో గాని, ప్రవర్తనలోగానీ ఎక్కడా వారి క్షుద్రభావాలు వెల్లడి కావు. పంచదార పలుకులతో మనల్ని ప్రలోభపెడతారు. పైకి మిత్రులు, ఆత్మీయులు. లోపల అసూయ లావా కుతకుతలాడుతున్న అగ్నిపర్వతాలు. అవకాశం లభిస్తే మొదటి అపకారం వీళ్లే చేస్తారు. చాటున మన గురించి తీవ్రమైన దుష్ప్రచారం చేస్తారు. మనల్ని ఏకాకుల్ని చేయడానికి మిత్ర, బంధువర్గాల్లో మనకున్న మంచి పేరు చెడగొట్టడానికి శతథా యత్నిస్తారు. ఔషధ సేవనంతో రోగవిముక్తి పొందవచ్చు. కాని, శత్రు విముక్తికి ఎలాంటి ఉపాయమూ లేదు.'అపకారికి ఉపకారము నెపమెన్నక సేయువాడు నేర్పరి' అన్నాడు సుమతీ శతకకారుడు. అంతటితో శత్రుత్వ నశిస్తుందనలేదు. నేర్పుగా ఎలా జీవించాలో చెప్పాడంతే. నేర్పు అంటే దుష్పరిణామాల నుంచి ఉపాయంగా తప్పించుకోవడం. పాము పడగవిప్పి కాటు వెయ్యాలని మీదకు దూకుతుంటే పాములు పట్టేవాడు ఎలా తప్పించుకుంటాడు? చివరకు పాము తలను దొరకబుచ్చుకుంటాడు... అదీ నేర్పు అంటే ఇలాంటి నేర్పు పొందాల్సిన అవసరం కల్పించే వాడే శత్రువు. సోమరిపోతు, నిద్రాప్రియుడు కూడా ఇంట్లోకి పాము ప్రవేశించిందనగానే అప్రమత్తమై వేయికళ్లతో పాము జాడల కోసం వెతుకుతాడు. కనిపించగానే వెర్రి ఆవేశంతో కర్రదెబ్బలు కొడతాడు. ఇక్కడ పామే శత్రువు. దాన్ని చంపకపోతే అది మనల్ని చంపేస్తుంది.



ఆధ్యాత్మికం

# అంగరంగ వైభవంగా శివపార్వతుల కళ్యాణం

**- కమణీయం... రమణీయం తిలకించిన భక్త జనం.. - శివ నామస్మరణతో మారుమోగిన ఆలయ ప్రాంగణం**

**- పట్టు వస్త్రాలు సమర్పించిన వొడితల ప్రణవ్ - ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చిన ప్రణవ్**

**- కళ్యాణ దాతలకి ధన్యవాదాలు తెలిపిన ఆలయ కమిటీ చైర్మన్ కొండ విజయ్**



**ఇల్లందకుంట ఫిబ్రవరి 27 (ది క్రైమ్ న్యూస్):** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఇల్లందకుంట మండలంలోని సిరిసేడు గ్రామంలో శ్రీ అపర్ణ సోమేశ్వర స్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు. శ్రీ అపర్ణ సోమేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ కొండ విజయ్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు భైరవబట్ల నరేందర్ శర్మ స్వామి వారికి ప్రత్యేక అభిషేకలతో పూజ కార్యక్రమాలతో ప్రారంభించి శివపార్వతుల కళ్యాణం తో ముగించారు. అందంగా అలంకరించబడ్డ ఆలయ ప్రాంగణంలో ఉదయం ఉండే భక్తులు దర్శనాలు చేసుకొని అర్చన, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం శివపార్వతుల ఉత్సవ విగ్రహాల కు పల్లకి సేవ నిర్వహించారు..ఈ కార్యక్రమంలో భక్తులు పల్లకి మోస్తూ శివనామ స్మరణతో గ్రామం మారుమోగింది.. మహిళలు స్వామి వారికి నీళ్లు పోస్తూ స్వాగతం పలికారు.

**పట్టు వస్త్రాలు సమర్పించిన వొడితల ప్రణవ్ :** మహా శివరాత్రి సందర్భంగా సిరిసేడు శ్రీ అపర్ణ సోమేశ్వర స్వామి ఆలయం లో నిర్వహించే శివపార్వతుల కళ్యాణం కు ముఖ్య అతిథిగా హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ హాజరయ్యారు.. బుధవారం రాత్రి ఆలయ కమిటీ చైర్మన్ కొండ విజయ్ తో పాటు కమిటి సభ్యులు, సిరిసేడు, మర్రివానిపల్లి, పాతర్లపల్లి, భోగంపాడు భక్తుల తో మమేకమై మంగళవాయిద్యాల తో బయలు దేరి స్వామి వారికి పట్టు వస్త్రాలు,ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రజలందరు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతున్ని వేడుకుంటున్నట్లు తెలిపారు. దేవాలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని,రాబోయే రోజుల్లో ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వొడితల ప్రణవ్ ని శాలువతో, ఆలయ మెమోంటో ఘనంగా సన్మానించారు..

**కమణీయం...రమణీయం... శివపార్వతుల కళ్యాణం:** శ్రీ అపర్ణ సోమేశ్వర స్వామి ఆలయంలో సాయంత్రం రుద్ర హెూమం నిర్వహించిన అనంతరం రాత్రి మహా శివరాత్రి పర్వదిన సుముహూర్తన శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు.. కళ్యాణ వేదికలో వేద పండితులు ఆలయ అర్చకులు భైరవబట్ల నరేందర్ శర్మ, నాగరాజు శర్మ, మంత్రోత్చరణాలు, మంగళవాయిద్యాలు, భక్తుల జయ జయ ధ్వానాల మధ్య ఆలయ ప్రాంగణంలో రాత్రి 11 గంటలకు ప్రారంభమై రాత్రి 2గంటల వరకు కళ్యాణం వైభవంగా జరిగింది. పెళ్లి వేదికపై పట్టు వస్త్రాలు, శివ పార్వతులు భక్తులకు దర్శన మిచ్చారు.. ఆద్యంతం సాగిన కల్యాణ తంతును భక్తులు తన్మయత్వంతో చూసి తరించారు.. అనంతరం హాజరైనా భక్తులు స్వామివారి పాదాల చెంత తలంబ్రాలు పోసి తరించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ కొండ విజయ్ మాట్లాడుతూ



శివపార్వతుల కళ్యాణ మహెూత్సవానికి సహకరించిన దాతలు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.. వారికి శివపార్వతుల అనుగ్రహం ఎల్లవేళలా ఉంటూ వారి అభివృద్ధికి స్వామి వారు తోడ్పడాలని ఈ సందర్భంగా కోరుకున్నట్లు తెలిపారు.. ఈ కార్యక్రమంలో అలయకమిటి సభ్యలతో పాటు సిరిసేడు, మర్రివానిపల్లి, పాతర్లపల్లి, భోగంపాడు గ్రామ ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

## శ్రీ శైలంకు బయలుదేరిన సింగరేణి రెస్క్యూ టీం



**యైటింక్లయిన్ కాలని. (ది క్రైమ్ న్యూస్):** శ్రీ శైలం ఎమర్జెన్సీ సొరంగం (ఎస్.ఎల్.బి.సి) పనుల్లో సహాయక చర్యలు అందించేందుకు సింగరేణి రెస్క్యూ సిబ్బంది గురువారం బయలుదేరి వెళ్లింది. ప్రమాద ఘటన జరిగిన వెంటనే సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం ఆదేశాల మేరకు 16మందితో కూడిన రెస్క్యూ బృందం టన్నెల్ వద్దకు చేరుకొని సహాయక పనులలో నిమగ్నమయ్యాయి. అలాగే గురువారం ఉదయం 100 మంది సభ్యులతో కూడిన రెస్క్యూ సిబ్బంది, నాలుగు వాహనాలలో శ్రీశైలం ఎస్.ఎల్.బి.సి టన్నెల్ వద్దకు బయలుదేరి వెళ్లాయి. ఈ సహాయక పనుల్లో పాల్గొనేందుకు రామగుండం ఏరియా రెస్క్యూ స్టేషన్, మందమర్రి ఏరియా, భూపాల పల్లిఏరియా, కొత్తగూడెం ఏరియా నుండి సింగరేణి రెస్క్యూ సభ్యులు బయలుదేరి వెళ్లారు.

## ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

**- ఓటేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు**

**- కమలాపూర్‌లో కాసేపు కరెంట్ సరఫరాకు అంతరాయం**

**- హుజురాబాద్‌లో ఓటేసిన కాంగ్రెస్ ఇంచార్జి ప్రణవ్**

**- పిల్లాపాపలతో పోలింగ్ కేంద్రానికి ఓటర్లు**





**కమలాపూర్ (ది క్రైమ్ న్యూస్ ):** ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి. కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజాంబాద్ గ్రాడ్యుయేట్ ఎన్నికల ఓటింగ్కు ఓటర్లు పోటేత్తారు. కమలాపూర్ లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రారంభంలో కరెంట్ సరఫరా అంతరాయం కాగా ఓటర్లు ఇబ్బంది పడ్డారు.ఓటేసేందుకు ఓటర్లు పిల్లాపాపలతో పోలింగ్ కేంద్రాలకు తరలిరాగా గంటల కొద్ది క్యూ లైన్ లో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. హుజురాబాద్ లో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఓటేసారు. పోలింగ్ ప్రారంభంలో ఓటింగ్ మందకోడిగా సాగినప్పటికీ 11 గంటల నుండి ఓటు వేసేందుకు ఓటర్లు బారులు తీరారు. ఓటింగ్ సరళని ఎప్పటికప్పుడు ఎన్నికల ఆఫీసర్లు పర్యవేక్షిస్తున్నారు.

## ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు..!






**రామగిరి, (ది క్రైమ్ న్యూస్) ఫిబ్రవరి 27:** పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం రామగిరి మండలంలో ప్రశాంతంగా జరిగాయి. మండలంలో మొత్తం పట్టభద్రుల ఓటర్లు 1278 మంది ఉన్నారు. ఇందులో 901 మంది పట్ట భద్రులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో 377 మంది ఓటు హక్కును వినియోగించుకోలేదు. ఓటింగ్ శాతం 80/. గా నమోదైంది. ఇది ఇలా ఉండగా మండలంలో టీచర్స్ ఓటర్లు 42 మంది ఉండగా.. ఇందులో 36 మంది తమ ఓటు హకును వినియోగించుకున్నారు. ఇందులో 6 మాత్రమే ఓటు హక్క వినియోగించుకోలేదు. పోలింగ్ నమోదు శాతం 95 గా నమోదైంది. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడం కోసం రామగిరి మండలం ఎస్.ఐ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తూ నిర్వహించారు.ఈ ఎన్నికల నిర్వాహణను తహసీల్దార్ సుమన్ ప్రత్యేకంగా పరిశీలించారు. అలాగే ఈ ఎన్నికల ప్రక్రియను మంథని సీ.ఐ రాజు గౌడ్, గోదావరిఖని టూ టౌన్ సీ.ఐ నక్క ప్రసాద్ లు పరిశీలించారు. రామగిరి మండల కేంద్రంలోని రత్నాపూర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ సెకండరి పాఠశాలలో ఎమ్మెల్సీ పట్ట భద్రుల, టీచర్ల ఎన్నికల పోలింగ్ ప్రక్రియ నిర్వహించారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ-పీవీరావు

**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఫిబ్రవరి 27:** రామగిరి మండలం రత్నాపూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గురువారం కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఓటర్ల కేంద్రం ఏర్పాటు చేశారు. రత్నాపూర్ మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ, సీనియర్ జర్నలిస్ట్ పీవీరావు, ఐసీడీఎస్ సూపర్వైజర్ పల్లె అనిత సాఫ్టేర్ ఇంజనీర్ బుర్ర. ప్రణయ్ కుమార్ గౌడ్ ఓట్లు వేశారు.



## క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేత



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఫిబ్రవరి 27:** కమాన్ పూర్ మండలం పెంచికలపేట గ్రామంలో శివరాత్రి సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. నిర్వాహకులు నైట్ క్రికెట్ సర్కిల్ టోర్నమెంట్ ను పిడుగు రాజు, పెగడపల్లి రాఖీ, ఎరువురాళ్ల శ్రీధర్, పిడుగు విష్ణు, ఆవుల విజయ్‌ల ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ను నిర్వహించారు. ఈ టోర్నమెంట్లో విజేత టీంగా లింగాల రాజేందర్ టీం గెలుపొందింది. బహుమతి అందజేశారు. నిర్వాహకులు పల్లె నారాయణ, సిరివెన్నెల రాజు, వేణు ఫిల్లింగ్ స్టేషన్ ఎట్ల పవన్ కళ్యాణ్, తాళ్ల సురేష్, డీలర్ మల్లేష్, బైరి అంజయ్య గౌడ్, అన్నవేళ మల్లేష్, లింగాల కుమార్, దాడి ఎల్లయ్య, పెంచలపేట గ్రామపంచాయతీ కార్యదర్శి మలమూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లేశ్‌కు ఇఫ్టు పేరు చెప్పుకునే అర్హత లేదు

**- "ఇఫ్టు" రాష్ట్ర అధ్యక్షులు ఐ.కృష్ణ**




**యైటింక్లయిన్ కాలనీ. (ది క్రైమ్ న్యూస్):** స్థానిక ఐఎఫ్టీయూ కార్యాలయంలో గురువారం యూనియన్ 2,3 బ్రాంచుల ముఖ్యుల సమావేశం జరిగింది. ఉదయం యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.అశోక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు ఐ.కృష్ణ మాట్లాడుతూ.. ప్రజా పోరాటాల్లో సాగుతున్న విప్లవ కార్మిక సంఘాల నుండి ఈ నాలుగు దశాబ్దాల కాలంలో అనేకమంది సంఘాన్ని వదిలివెళ్ళారని, అదే క్రమంలో సాలిగామ మల్లేశ్ సంఘానికి రాజీనామా చేశారన్నారు. అలా వెళ్లిన ఆయనకు తిరిగి ఇఫ్టు పేరు చెప్పుకునే అర్హత లేదన్నారు. రాజీనామా చేసి వెళ్లిన ఆయనకు ఓసిపి.3 ప్రాజెక్టులో హెచ్ఎంఎస్ నాయకులతో తగాదాలున్నాయని ఆపరేటర్ల ప్రమోషన్ల అంటూ ఐఎన్టి యూసిలో చేరాడని అన్నారు. ఇకపోతే బ్రాంచి కమిటీ కార్యదర్శి కూడా తనతో చేరినట్లుచెప్పుకోవడం,పదవులఆకాంక్షతోఅబద్ధాలు,తప్పుడుప్రచారాలుచేయడంమానుకోవాలని హితవు పలికారు.చేస్తున్న అసత్య ప్రచారాలను గమనించాలని ఆయన కార్మికులను కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఈ.నరేష్, ఐ.రాజేశం, ఎస్.ప్రసాద్, ఎ.చంద్రయ్య, కె.శారద,ఎస్.నాగరాజు, కే.నారాయణ, సిహెచ్ శంకర్. తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీలకు ఎంపిక




**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఫిబ్రవరి 27:** నాలుగవ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బేస్బాల్ పోటీలకు పాలకుర్తి మండలం యూనివర్సల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ ఇస్మాయిల్ తెలిపారు.ఈనెల21వ తేదీన కరీంనగర్లోని అంబేద్కర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి బేస్బాల్ సబ్ జూనియర్స్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఈనెల 27వ తేదీ నుండి మార్చి 2 వరకు సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు యూనివర్సల్ పాఠశాల విద్యార్థులు ఏ అఖిలేశ్వర్, భరత్ చంద్ర, కే సిద్ధార్థలు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు కల్వల సంతోష్ తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఇస్మాయిల్ సయ్యద్ అఫ్జల్ విద్యార్థులని అభినందించారు.

## శివరాత్రి సంస్కృతిక" వేదికలో ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

**- కూచిపూడిలో రాణిస్తున్న చిన్నారి**

**- దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల ప్రశంసలు అందుకున్న తుమ్మల శాన్విత**



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఫిబ్రవరి 27:** మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని మంథని నియోజకవర్గం లోని శ్రీ కాలేశ్వరం ముక్తేశ్వర స్వామి దేవాలయం ( కాలేశ్వరం) లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో.. నిర్వహించిన సంస్కృతిక వేడుకలలో కోల్ బెల్ట్ ప్రాంతానికి చెందిన తుమ్మల.శన్విత (కూచిపూడి) నృత్య విభాగంలో ప్రదర్శన ఇచ్చి పలువురు ప్రశంసలు అందుకున్నారు.దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సంధ్యారాణి, ఆలయ ఈవో బుర్రి శ్రీనివాస్ లతోపాటు అధికారుల ప్రశంసలు అందుకున్నారు .చిన్నతనంలోనే కూచిపూడి నిత్యంలో రాణిస్తున్న శాన్విత మరెన్నో కళా ప్రదర్శనలు ఇచ్చి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవాలని వారు ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు.పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడుతున్న నేటి సందర్భంలో ప్రాచీన కళలలో రాణించడంలో ప్రోత్సహిస్తున్న వారి తల్లిదండ్రులను గురువులను అభినందించారు. అనంతరం శాలువా మెమెంటోళ్ళతో ఘనంగా సత్కరించారు.కాగా ఈ కార్యక్రమంలో దేవదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సంధ్యారాణి, కాలేశ్వరం ముక్తిశ్వర స్వామి ఆలయ ఈవో బుర్రి శ్రీనివాస్ శ్రీకృష్ణ డాన్స్ మ్యూజికల్ అకాడమీ (వరంగల్) ఆర్గనైజర్ భ్రమరాంబ , ప్రముఖ జానపద గాయకులు తుమ్మల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి దంపతులు

**మానకొండూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలో గురువారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా జిల్లా పరిషత్ బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సతీసమేతంగా ఓటు వేశారు. ఉదయమే తన సతీమణి డాక్టర్ అనురాధతో పోలింగ్ కేంద్రానికి చేరుకుని పట్టభద్రులైన ఓటర్లతో కలిసి క్యూ లైన్లో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న పట్టబద్రులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎక్కువ మంది ఓటు వేస్తే ఫలితం బాగుంటుందని ఓటు వేయకపోతే మాట్లాడే హక్కు ఉండదని సూచిస్తూ ఓటు వేసేందుకు వచ్చిన పట్టభద్రులకు దన్యవాదాలు తెలిపారు. అనంతరం మానకొండూర్ తో పాటు నియోజకవర్గంలోని తిమ్మాపూర్, శంకరపట్నం, గన్నేరువరం, బెజ్జంకి మండల కేంద్రాలలోని జిల్లా పరిషత్ పాఠశాలల్లోని పోలిగ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్న పోలింగ్ సరళిని పరిశీలించి ఎన్నికల అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల పరిసర ప్రాంతంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో పోలింగ్ జరుగుతున్న తీరుపై చర్చించి పట్టబధ్రులంతా ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని పార్టీశ్రేణులకు సూచించారు. ఆయా మండలాల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, మోరపల్లి రమణారెడ్డి,గోపగోని బసవయ్య గౌడ్, ముక్కీస రత్నాకర్ రెడ్డి,ముస్కు ఉపేందర్ రెడ్డి,టి పిసిసి సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్ వ్యవసాయ




మార్కెట్ కమిటీ చైర్మన్ లు మర్రి ఓదెలు యాదవ్, పులి కృష్ణ ,పార్టీ నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, కోంఢ్ర సురేష్, ఇర్ఫాన్, రామిడి శ్రీనివాస్, మడుపు ప్రేమ్ కుమార్, తాళ్లపల్లి నరేశ్, సహదేవ్, మహేందర్, ఓదెలు, తిరుపతిరెడ్డి అజహర్, మహమూద్,. రామిడి తిరుపతి, దేవయ్య, బాపురావు, శ్రీనివాస్ గౌడ్, తోట శ్రీనివాస్, మాడిశెట్టి రాజయ్య, బుర్ర శ్రీనాథ్, బుర్ర శ్రీధర్, సుభాష్, ఎడ్ల శ్రీధర్,గోపు మల్లారెడ్డి, మామిడి అనిల్ కుమార్, గంకిడిడ లక్ష్మారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాస్ రావు, కొండల్ రావు, తమ్మనవేణి రమేశ్, ఎంఏ సమద్, ఆశిక్ పాషా, లక్ష్మణ్ రావు, పోతుగంటి శ్రీనివాస్,నాయకులు ఉప్పుగళ్ల మల్లారెడ్డి, బండారు తిరుపతి, గట్టు తిరుపతి, నాంపల్లి తిరుపతి, మొలంగూరి సదానందం, ఎండీ ఇషాముద్దీన్, అజయ్, షారుఖ్




,బొంగోని శ్రావణ్, పూరెళ్ల ప్రశాంత్, శ్రీధర్, బాడిస కృష్ణకాంత్, జంపయ్య, జంగిలి సంపత్ ,సంతోష్, పడాల తిరుపతి, తాటికొండ సదానందం, గండికోట రవి, రాజయ్య, శ్రీకాంత్, కవ్వ పద్మ, శ్రీనివాస్ రెడ్డి, నారాయణ రెడ్డి, పచ్చునట్ల కొమురయ్య, అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, అలువాల కోటి, మాతంగి అనిల్, శ్రీధర్ రెడ్డి, అనంతరెడ్డి, సంగు వేణు, కటకం తిరుపతి, బి.సంపత్ రెడ్డి, నవీన్, నర్సింహారెడ్డి, బొద్దు సునీల్, స తిప్పర్తి పరిపూర్ణచారి, దొడ్డు మల్లేశం, డి.అనిల్, జె.మహేందర్, నక్క తిరుపతి, మల్లికార్జున్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా బిజెపిదే విజయం

## - కుట్రలకు కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ పార్టీ - బిజెపి కార్యకర్తలపై దాడులను ఖండిస్తున్నాం
## - పోలీసుల ఏకపక్ష వైఖరి ఆక్షేపణీయం - మూడు స్థానాల్లో విజయం కమలానిదే
## - బిజెపి నేతలు గోమాసే శ్రీనివాస్, దుగ్యాల ప్రదీప్ కుమార్

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కుట్రలు చేయడంలో, మోసానికి పాల్పడటంలో, దగాకు దిగడంలో కాంగ్రెస్ ను మించిన పార్టీ మరొకటి లేదని భారతీయ జనతా పార్టీ పెద్దపల్లి పార్లమెంటు కంటెస్టెడ్ నేత గోమాసే శ్రీనివాస్ ధ్వజమెత్తారు. ఈ మేరకు గురువారం జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ తో కలిసి మాట్లాడుతూ, రాష్ట్రంలో జరిగిన రెండు పట్టాభద్రులు, ఒక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో బిజెపి బలపరిచిన అభ్యర్థులు ఘన విజయం సాధించబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేస్తూ కాంగ్రెస్ పార్టీ డబ్బులు పంచినప్పటికీ, పట్టాభద్రుల ఓటర్లు ఆ పార్టీని తిరస్కరించారని ఎద్దేవా చేశారు. డబ్బులతో ఎన్నికల్లో గెలవాలని చూసిన కాంగ్రెస్ పార్టీకి కర్రుకాల్చి వాత పెట్టారని సెటైర్లు వేశారు.

**రేవంత్ సర్కారుపై వ్యతిరేకత :** 420 హామీలు, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని, కానీ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలం



అయ్యిందని ఇరువురు మండిపడ్డారు. 12యేళ్ళ క్రితం దేశంలో ప్రధాని నరేంద్రమోదీ ద్వారా అభివృద్ధి శకం మొదలయ్యిందన్న ఆయన, మోదీ పాలనతో రేవంత్ రెడ్డి సర్కారు పాలనను ప్రజలు పోల్చి చూస్తున్నారని పేర్కొన్నారు. రూ.12లక్షల 70వేల వరకు ఆదాయపు పన్ను నుండి మినహాయింపు నుండి తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం ఒక మైలురాయిగా వారు స్పష్టం చేశారు.

**జైళ్ళపాలయ్యింది బిజెపి కార్యకర్తలే :** తెలంగాణా రాష్ట్రంలో ఉపాధ్యాయ, నిరుద్యోగుల సమస్యల పట్ల నిజాయతిగా ఉద్యమాలు చేసింది భారతీయ జనతా పార్టీ కార్యకర్తలేనని, ఉద్యమాల్లో భాగంగా అనేకమంది కార్యకర్తలను పోలీసులు హింసించి, కేసులు పెట్టి జైళ్ళకు పంపించారని గుర్తు చేశారు. పోలీసులను అడ్డం పెట్టుకొని చేసే అరాచకాలకు బిజెపి కార్యకర్తలు భయపడరని, ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలో పోలీసులు చేసిన ఓవర్ యాక్షనుకు ప్రతిఘటన తప్పదని వారు హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా తమకు ఓటు వేసిన ఓటర్లకు, సహకరించిన అభిమానులకు, కష్టపడ్డ కార్యకర్తలు, నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ స్మావేశంలో నాయకులు ఆరుముళ్ళ పోషం, శిలారపు పర్వతాలు, మేకల శ్రీనివాస్, కావేటి రాజగోపాల్, వేల్పుల రమేష్, యెర్రోళ్ళ శ్రీకాంత్, తంగెడ రాజేశ్వరరావు, ఉప్పు కిరణ్, రాకేష్ పెంజర్ల, ఈర్ల శంకర్, పోల్సాని సంపత్ రావు, గాదాసి సతీష్, వొల్లె తిరుపతి, బొడ్డుపల్లి అంజి, తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గు నాణ్యత పై దృష్టి సారించాలి

## - సింగరేణి ఏరియా జీఎం వెంకటయ్య



**యైటింక్లయిన్ కాలని. (ది క్రైమ్ న్యూస్):** సింగరేణి బొగ్గు నాణ్యతపై ఏరియా అధికారులతో గురువారం రామగుండం రెండవ ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య సమీక్షా సమావేశం నిర్వహించారు. సాయంత్రం డివిజన్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో క్వాలిటీ డిప్యూటీ మేనేజర్ సుభాష్ పవర్ పాయింట్ ద్వారా ఓసిపీ.3 ప్రాజెక్టులోని రోజు వారి బొగ్గు నాణ్యతా వివరాలను తెలియజేశారు. తదనంతరం జీఎం వెంకటయ్య మాట్లాడుతూ.. మన సంస్థ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం ఆదేశాల మేరకు, బొగ్గు నాణ్యతపై ప్రత్యేక దృష్టి సాధించాలన్న సూచనలను అనుసరించి, వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు అందించాలన్నారు. బొగ్గు రవాణాలో మట్టి, షెల్ రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, బొగ్గులో మట్టి, షెల్ రావడంవల్ల బొగ్గు గ్రేడ్ తగ్గి సంస్థకు నష్టం వాటిల్లుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఓసిపి.3 ప్రాజెక్టు అధికారి ఎస్. మధుసూదన్, ఏరియా ఎస్ఓ టు జిఎం ఎం.రాముడు, వకీల్ పల్లి గని ఏజెంట్ ఎ.నెహ్రూ, కాలరీ మేనేజర్ భరత్ కుమార్, క్వాలిటీ డిప్యూటీ మేనేజర్ సుభాష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జగిత్యాల జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం

## - ఓటు వినియోగించుకున్న ప్రముఖులు..



జగిత్యాల (ది క్రైమ్ న్యూస్ ప్రతినిధి ): జగిత్యాల జిల్లాలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాలో మొత్తం పట్టభద్రుల ఓటర్లు 35,281కాగా అందులో పురుషులు 21,667, మహిళలు13,667 ఓటర్లున్నారు. ఉపాధ్యాయుల టీచర్స్ ఓటర్స్ మొత్తం 1760 గాను పురుషులు 1232, మహిళలు 537 ఉన్నారు. జగిత్యాల జిల్లాలో మొత్తం పోలింగ్ 71పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా అందులో పట్టభద్రుల ఎమ్మెల్సీకి 53, టీచర్ ఎలక్షన్స్ 18 పోలింగు కేంద్రాలు ఏర్పాటు చేశారు. జగిత్యాల కేంద్రంలోని పోలింగ్ స్టేషన్ నం. 188 లో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ దంపతులు కలిసి ఎమ్మెల్సీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్య ప్రాముఖ్యతను గుర్తు చేస్తూ, ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు. జగిత్యాలలోని పురానిపేట హైస్కూలో ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి, కోరుట్లలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. బుగ్గారంలో జగిత్యాల జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, జగిత్యాల నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పెండెం మహేందర్ జగిత్యాలలోఓటు హక్కు వినియోగించుకున్నారు...

# వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

## - సింగరేణి ఏరియా జీఎం బి. వెంకటయ్య



**యైటింక్లయిన్ కాలని. (ది క్రైమ్ న్యూస్):** రామగిరి మండలం చందనాపూర్ గ్రామంలో శుక్రవారం ఉదయం సింగరేణి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిభిరాన్ని నిర్వహిస్తున్నట్లు రామగుండం రెండవ ఏరియా జనరల్ మేనేజర్ బి. వెంకటయ్య తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఏరియాలోని వకిల్‌పల్లి గనికి సంబంధించి ఇదివరకు జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని, రేమేడియేషన్ మేషర్స్ క్రింద వైద్య శిభిరాలను ఏర్పాటు చేయడంలో బాగంగా, వకిల్ పల్లి ప్రాజెక్ట్ విస్తరణలో ప్రభావిత గ్రామమైన చందనాపూర్ గ్రామంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇక ఈ వైద్య శిబిరం గ్రామంలోని అంగనవాడి కేంద్రం (పోస్ట్ ఆఫీస్) వద్ద ఉదయం 9 గంటల నుండి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏరియా యాజమాన్యం నిర్వహిస్తున్న ఈ ఉచిత వైద్య శిభిరంలో నిష్ణాతులైన సింగరేణి డాక్టర్లచే వైద్య పరిక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. సింగరేణి యాజమాన్యం చేపట్టిన ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన గ్రామ ప్రజలను కోరారు.

# ఓటు రాజకీయ నాయకుల భవిష్యత్తును మారుస్తుంది

## - బిజీలో సైతం ఓటు హక్కు వినియోగం

**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఫిబ్రవరి 27:** ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని డాక్టర్ మేకల శరణ్య మేకల మారుతి దంపతులు పేర్కొన్నారు. కమాన్ పూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో వారు తమ ఓటు హక్కును గురువారం వినియోగించుకున్నారు. ఒకరు డాక్టర్ కాగా మరొకరు సింగరేణి లో కార్మికుడు. ఇద్దరు బిజీగా ఉన్నా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు మన జన్మ హక్కు అని ప్రతి ఒక్కరు తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఓటు రాజకీయ నాయకుల భవిష్యత్తును మారుస్తుందని పేర్కొన్నారు.



# శివాలయంలో అన్నదానం..




**జమ్మికుంట ఫిబ్రవరి 27 (ది క్రైమ్ న్యూస్):** వీణవంకకు చెందిన నీల నాగరాజు శ్రీలత ల పుత్రిక నీల వైష్ణవి 9వ జన్మదినం సందర్భంగా జమ్మికుంట పట్టణంలోని శివాలయంలో సుమారు 200 మందికి అన్నదానం, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైష్ణవి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని అన్నపూర్ణ సేవా సమితి వారు మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. అలాగే నీల నాగరాజు శ్రీలత దంపతులకు ఆలయ కమిటీ తరఫున ప్రత్యేకంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు కుటుంబ సభ్యులతో పాటు పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

# ఆలయం ఆవరణలో దొరికిన సెల్ ఫోన్ భక్తుడికి అప్పగించిన సిబ్బంది




**ధర్మపురి, ఫిబ్రవరి 27, (ది క్రైమ్ న్యూస్):** ఆలయం ఆవరణలో దొరికిన సెల్ ఫోన్ ని ఆలయ సిబ్బంది భద్రపరిచి పోగొట్టుకున్న భక్తుడికి అప్పగించినట్లు ఇఓ శ్రీనివాస్ తెలిపారు. జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం ఆవరణలో జి. మారుతి గ్రామం మామిడి పెల్లి, నిజామాబాద్ జిల్లా కు చెందిన భక్తుడికి సెల్ ఫోన్ దొరకగా వారు వెంటనే దేవస్థానంలో గల కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్‌కి అప్పగించారని ఇఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. దొరికిన సెల్ ఫోన్ పోగొట్టుకున్న భక్తుడు శ్రీ కాంతం సంజీవ్ నిర్మల్ గ్రామ వాస్తవ్యులు గా గుర్తించి కార్యాలయం నకు పిలిపించి వారికి అప్పగించినట్లు, దొరికిన మొబైల్ సుమారు 20,000/- విలువ గల సెల్ ఫోన్ ను దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ భక్తునికి అంధించినట్లు తెలిపారు.

# చింతగింజల వల్ల కలిగే ప్రయోజనాలు తెలిస్తే అస్సలోదలరు..ఆ సమస్యలకు చెక్ పెట్టొచ్చు!



కీళ్ల నొప్పులతో బాధపడేవారికి చింతగింజలు దివ్యౌషధంగా పనిచేస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. చింత గింజల పొడితో దంత సమస్యలను దూరం చేసుకోవచ్చునని చెబుతున్నారు. ఇందుకోసం ముందుగా చింత గింజలను పొడి చేసి అందులో నీళ్లు కలిపి పేస్ట్‌లా చేయా. దాంతో రోజూ దంతాలను తోముకోవాలి. దీంతో దంతాలు తెల్లగా మారుతాయి. దంతాలపై ఉండే గార, పాచి సైతం మాయమవుతుందని నిపుణులు చెబుతున్నారు. మధుమేహంతో ఇబ్బంది పడుతున్నవారికి చింత గింజలు అద్భుతమైన వరం అంటున్నారు నిపుణులు. ఇందుకోసం చింతల గింజల పొడిని నీళ్లలో కలిపి మరిగించి డికాషన్‌ను తయారు చేసుకోవాలి. ఈ డికాషన్‌ను రోజూ ఉదయం, సాయంత్రం భోజనానికి ముందు కప్పు మోతాదులో తాగుతుండాలి. దీంతో షుగర్ లెవల్స్ తగ్గుతాయి. మధుమేహం అదుపులో ఉంటుంది. అంతేకాదు, తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోతే చింతగింజలను పొడి ఒక టీస్పూన్ మోతాదులో తీసుకుని ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కలిపి తాగితే అజీర్ణం తగ్గుతుంది. చింత గింజల పొడి డికాషన్‌ను తాగడం వల్ల హైబీపీ సైతం తగ్గుతుంది. ఈ గింజల్లో ఉండే పొటాషియం బీపీని తగ్గిస్తుంది. చింత గింజల్లో యాంటీ వైరల్ గుణాలు ఉంటాయి. అందువల్ల ఈ గింజల పొడిలో నీళ్లు కలిపి ఆ మిశ్రమాన్ని గాయాలు, పుండ్లపై రాయాలి. ఇలా చేస్తుంటే అవి త్వరగా మానుతాయి. చర్మంపై మంగు మచ్చలు ఇతర సమస్యలతో బాధపడేవారు చింత గింజలను తీసుకోవాలని సూచిస్తున్నారు. చింత గింజల్లో ఉండే ఆయుర్వేద గుణాలు చర్మం పై ఉన్న మంగు మచ్చల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. చింత గింజలను పొడిలా తయారుచేసి, ఆ పొడిలో తేనె కలిపి మచ్చల ప్రభావిత ప్రాంతంలో అప్లై చేయడం వల్ల మంచి ఫలితాలు పొందుతారు. ఈ మిశ్రమాన్ని క్రమం తప్పకుండా అప్లై చేస్తూ ఉంటే.. మీ చర్మం సహజంగా కాంతివంతంగా మారుతుంది. చింతగింజల పొడిని రోజూ ఓ అర టీస్పూన్ మేర రోజుకు రెండు సార్లు నీటితో కలిపి తీసుకోవాలి. పాలు లేదా నెయ్యిని కూడా వాడొచ్చు. దీనివల్ల మోకాళ్ల నొప్పులు దూరమవుతాయి. నాలుగు వారాల్లో మోకాళ్ల నొప్పులు పూర్తిగా నయం కావడానికి అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మోకాలి నొప్పులతో బాధపడే వారు ఈ పొడిని క్రమం తప్పకుండా వాడితే ప్రయోజనం ఉంటుందని సూచించారు.



# నాగకేసర పువ్వులతో ఆరోగ్యప్రయోజనాలు పుష్కలం..! ఇలా వాడితే అనేక సమస్యలకు దివ్యౌషధం..!!

సహజంగా వచ్చే సీజనల్ వ్యాధులను అరికట్టడంలో నాగకేసర్ అద్భుతంగా పనిచేస్తుంది. నాగకేసర పువ్వుతో జలుబును తగ్గించుకోవచ్చు. అందుకు గాను.. ఈ పువ్వును తీసుకుని బాగా నలిపి పేస్ట్‌లా చేసి ఆ మిశ్రమాన్ని నుదుటిపై రాసుకుంటే జలుబు తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. నేటి జీవనశైలిలో కడుపు సంబంధిత సమస్యలు సర్వసాధారణం. అజీర్ణం, అసిడిటీ, గుండెల్లో మంట, గ్యాస్, కడుపునొప్పి, వాపు వంటి సమస్యలను అధిగమించడానికి నాగకేసర్ వాడితే ఉపశమనం కలుగుతుంది. . దీని కోసం, మీరు ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కొద్దిగా నాగకేసర పువ్వులతో తయారు చేసిన పొడి, తేనె కలిపి తీసుకుంటే, అజీర్ణం, అసిడిటీ, గ్యాస్, కడుపునొప్పి, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తగ్గుతాయి. చాలా మందికి వెక్కిళ్లు వచ్చాయంటే ఒక పట్టాన తగ్గవు. అటువంటి పరిస్థితిలో నాగకేసర పువ్వుల పొడితో వెక్కిళ్లను తగ్గించుకోవచ్చు. అందుకు గాను ఆ పువ్వుల పొడిని తేనెతో కలిపి తీసుకోవాలి. అదే పొడిని చెరుకు రసంతో కలిపి కూడా తీసుకోవచ్చు. దీంతో వెక్కిళ్లు



తగ్గిపోతాయి. ప్రస్తుత కాలంలో చాలా మందికి 40ఏళ్లు కూడా దాటకుండానే కీళ్ల నొప్పుల సమస్య కూడా సర్వసాధారణమైపోతోంది. ఈ సమస్య నుంచి బయటపడాలంటే నాగకేసర్ చక్కటి ఔషధంగా పనిచేస్తుంది. దీని కోసం, నాగకేసర గింజల నూనెను కీళ్లపై లేదా నొప్పి ఉన్న ప్రదేశాలపై నెమ్మదిగా మర్ధన చేయాలి.. ఇది నొప్పి నుండి ఉపశమనాన్ని కలిగిస్తుంది.దీంతో కీళ్ల నొప్పులు తగ్గుతాయి. నాగకేసర పువ్వుల పొడిని తేనెతో కలిపి తీసుకుంటుంటే జ్వరం కూడా తగ్గుతుంది. పావు టీస్పూన్ తేనెను అర టీస్పూన్ పొడితో కలిపి తీసుకోవాలి. దీన్ని రోజుకు 2 సార్లు తీసుకోవాల్సి ఉంటుంది. నాగకేసర పువ్వుల పొడిని తేనెతో కలిపి తీసుకుంటుంటే పైల్స్, ఆస్తమా వంటి సమస్యలు తగ్గుతాయి. ఆ మిశ్రమాన్ని రోజుకు 1 లేదా 2 సార్లు తీసుకోవాలి. నాగకేసర నూనెను గాయాలు, పుండ్లపై రాస్తుంటే అవి త్వరగా మానుతాయి. ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో అర టీస్పూన్ నాగకేసర పువ్వుల పొడిని కలిపి తాగితే తలనొప్పి తగ్గుతుంది. చాలా మంది మహిళలు బహిష్టు సమయంలో అధిక రక్తస్రావంతో ఇబ్బంది పడుతుంటారు. బహిష్టు రక్తస్రావం సాధారణమైనప్పటికీ, అధిక రక్తస్రావం అనారోగ్యకరం. మీరు ఈ సమస్యతో బాధపడుతున్నట్లయితే, నాగకేసరిని ఈ విధంగా ఉపయోగించండి. ఇందుకోసం 250-500 మి.గ్రా.నగకేసర్ పొడిని పాలవిరుగుడుతో కలిపి మూడు రోజులపాటు తినాలి. ఇది కాకుండా మీ రోజువారీ ఆహారంలో మజ్జిగ తీసుకోండి. ఇలా చేయడం వల్ల మెనోరేజియా సమస్య నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది

# తెల్ల జుట్టు నల్లగా మార్చడానికి హెన్నా అవసరం లేదు.. ఈ ఒక్కటి చాలు..!



తెల్లజుట్టును నల్లగా మార్చేందుకు రకరకాల బ్యూటీ ప్రొడక్ట్స్‌ను వాడుతుంటారు. కానీ ఈ రకమైన ఉత్పత్తులు మీ జుట్టును తాత్కాలికంగా నల్లగా చేసే రసాయనాలను ఉపయోగిస్తాయని, అవి దీర్ఘకాలంలో తీరని నష్టాన్ని కలిగిస్తాయని మీకు తెలుసా? అందుకే సహజసిద్ధంగా జుట్టును నల్లగా మార్చుకోవడం ఉత్తమం అంటున్నారు నిపుణులు. అందుకు ఒక మంచి రెసిపీని కూడా సూచించారు. దానికోసం పెద్దగా కష్టపడనక్కర్లేదు కూడా. మన వంటింట్లో ఎప్పుడూ రెడీగా ఉండేదే.. అదే కాఫీపొడి. అవును, ఇది తెల్లజుట్టును నల్లగా మార్చడంలో అద్భుతంగా పనిచేస్తుందంటున్నారు నిపుణులు. అదెలాగో చూద్దాం. సహజంగా తెల్ల జుట్టును నల్లగా మార్చడానికి కాఫీ నుండి రంగును తయారు చేసుకోవచ్చు. దీని కోసం, రెండు పెద్ద చెంచాల కాఫీ పొడి, ఒక కప్పు కండీషనర్ తీసుకోండి. ఈ రెండింటినీ బాగా కలపండి. తర్వాత ఆ పేస్ట్‌ని జుట్టుకు బాగా పట్టించి గంటపాటు అలాగే ఉంచాలి. అప్పుడు మీ జుట్టును నీటితో మాత్రమే కడగాలి. షాంపూ వాడకూడదు. అలాగే మరో విధానంలో కాఫీపొడి తీసుకొని అందులో అలోవెరా జెల్ కలపండి. ఇప్పుడు ఈ పేస్ట్‌ని జుట్టుకు పట్టించి గంటపాటు అలాగే ఉంచాలి. తర్వాత మీ జుట్టును సాధారణ నీటితో కడగాలి. ఇప్పుడు కూడా షాంపూ ఏమాత్రం ఉపయోగించకూడదు. కాఫీ తెల్లని జుట్టును నల్లగా మార్చడానికి చాలా బాగా పనిచేస్తుంది. ఇది హెన్నా కంటే ఎక్కువ ప్రయోజనకరం. కాఫీ మీ జుట్టుకు సహజంగా పోషణను అందిస్తుంది, ఇది జుట్టుకు అనేక విధాలుగా ప్రయోజనకరంగా ఉంటుంది. బ్రౌన్ కలర్ జుట్టు సహజంగా కూల్ గా కనబడేలా చేస్తుంది. కాఫీపొడితో మీ జుట్టు చక్కని మెరుపు సంతరించుకుంటుంది. కాఫీ లోపలి నుండి జుట్టుకు మెరుపు తెచ్చేలా పనిచేస్తుంది. దీనితో పాటు, ఇది తలలో కొల్లాజెన్‌ను పెంచుతుంది. కాబట్టి మెరిసే జుట్టు కావాలంటే కాఫీని ఇలా వాడండి. అంతేకాదు, కాఫీ జుట్టుకి మంచి కండీషనర్ కూడా. మీ జుట్టు లోపలి నుండి తేమగా ఉండేలా కాఫీ పనిచేస్తుంది. కాఫీలోని గుణాలు మీ జుట్టును సహజంగా సిల్కీగా చేస్తాయి. ఈ సూచనలు అన్నీ కేవలం మీకు అవగాహన కోసం మాత్రమే.. వీటిని ప్రయోగించేముందు నిపుణుల సలహాకూడా తీసుకుంటే మంచిది.

# ఖాళీ కడుపుతో ఈ నీళ్లు తాగండి.. దీని లాభాలు చూస్తే షాకవుతారు.!

బెండకాయ చాలా మందికి ఇష్టమైన కూరగాయ. దీంతో ఎన్నో రకాల వంటకాలు తయారుచేస్తాం. కొందరు పచ్చి బెండకాయలు కూడా తింటారు. అయితే బెండకాయను నీటిలో నానబెట్టి, ఆ నీటిని తాగితే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని నిపుణులు చెబుతున్నారు. నాలుగు లేత బెండకాయలు తీసుకొని వాటిని శుభ్రంగా కడిగి, నిలువుగా, అడ్డంగా ముక్కలుగా కోసి మంచినీటిలో రాత్రంతా నానబెట్టి, ఉదయం ఆ నీటిని వడపోసి తాగాలి. దీంతో కలిగే లాభాలు తెలిస్తే ఆశ్చర్యపోతారు.. బెండకాయలో ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు, ఫైబర్, మాంగనీస్, విటమిన్ సి,బి, ఫోలిక్ యాసిడ్, పుష్కలంగా ఉంటాయి. ఇది ఆకలిని తగ్గిస్తుంది. తద్వారా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అలాగే, ఫెన్నెల్ వాటర్ శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడానికి, జీవక్రియను పెంచడానికి సహాయపడుతుంది. బెండకాయలో మాంగనీస్ ఉంటుంది. ఇది జీవక్రియ, రక్తంలో చక్కెర నియంత్రణకు కీలకమైన ఖనిజం. బెండకాయలో విటమిన్ మరియు యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇది రక్తాన్ని శుద్ధి చేయడంతోపాటు టాక్సిన్స్‌ను బయటకు పంపుతుంది. ఇది చర్మం వృద్ధాప్య ఛాయలు తగ్గిస్తుంది. మచ్చలు ఇతర చర్మ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. బెండకాయ రోగనిరోధక వ్యవస్థపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. బెండకాయలో ఫ్లేవనాయిడ్స్, పాలీఫెనాల్స్ వంటి యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. కళ్లకు , ఎముకలకు బెండకాయ చాలా మంచిది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు బెండకాయ మంచి ఔషధం. ఉదయాన్నే ఖాళీ కడుపుతో బెండకాయలు నానబెట్టిన నీటిని తాగితే రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచడంలో సహాయపడుతుంది. గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. బెండకాయలో క్యాన్సర్ నిరోధక గుణాలు ఉన్నాయి. పేగు క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుచడంలో బెండకాయ సహాయపడుతుంది. బరువు తగ్గడానికి, రక్తపోటు నియంత్రణలో బెండకాయ సహాయపడుతుంది. ముఖ్య గమనిక ఏంటంటే ఇప్పుడు మనం చెప్పుకున్న విషయాలన్నీ కేవలం అవగాహన కోసం మాత్రమే.. వీటిని ప్రయోగించేముందు నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.



## పట్టభద్రుల ఓటు హక్కు వినియోగించుకున్న బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి...



**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి27(ది క్రైమ్ న్యూస్):** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటును హుజురాబాద్‌లోని స్థానిక ప్రభుత్వ పాఠశాలలో బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి , వారి సతీమణి వినియోగించుకున్నారు. అనంతరం కరీంనగర్ జిల్లా పరిధిలోని పలు మండలాల్లోని ఎమ్మెల్సీ పోలింగ్ బూత్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళి , పరిస్థితులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా బిజెపి శ్రేణులకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు ఎన్నికలు చారిత్రక తీర్పు ఇవ్వబోతున్నారన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం పట్టభద్రుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. పట్టభద్రుల , టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి చరిత్ర సృష్టించబోతుందన్నారు. ఆదిశగానే ఫలితాలు రాబోతున్నాయని ఆయన దీమా వ్యక్తం చేశారు.

## ముత్తారంలో ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు



**ముత్తారం.ఫిబ్రవరి.27.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటల వరకు ప్రశాంతంగా జరిగాయి. ఈ సందర్భంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా మండలంలో 17 ఓట్లు ఉపాధ్యాయులై ఉండగా 15 ఓట్లు నమోదు అయ్యాయి.గ్రాడ్యుయేట్ ఓట్లు 754 ఉండగా 584 ఓట్లు వినియోగించుకోగా 77.34 శాతం పోలింగ్ నమోదు అయినట్లు ముత్తారం తహసిల్దార్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. ముత్తారం ఎస్ఐ గోపతి నరేష్ ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి సంఘటనలు జరగకుండా సిబ్బందిని ఏర్పాటు చేశారు.

## నియోజకవర్గ వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్



**మానకొండూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం అన్ని మండలకేంద్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.మానకొండూర్ మండలంలో 3548 పట్టభద్రుల ఓట్లు ఉండగా 937 మహిళా ఓట్లు,1407పురుషుల ఓట్లతో మొత్తం 2344 ఓట్లు పోలై 66శాతం పోలింగ్ నమోదైంది.ఉపాధ్యాయ ఓట్లు 48 ఉండగా 15 మహిళా ఓట్లు,30పురుషుల ఓట్లతో మొత్తం 45 ఓట్లు పోలై 100శాతం పోలింగ్ నమోదైంది. శంకరపట్నం మండలంలో ఉపాధ్యాయ ఓటర్లు 51 ఉండగా మహిళా ఓట్లు12 పురుషుల ఓట్లు 37 మొత్తం 49ఓట్లతో 96శాతం పోలింగ్ నమోదైంది.పట్టబద్రుల ఓట్లర్లు 2009ఉండగా మహిళా ఓట్లు531, పురుషుల ఓట్లు 899 మొత్తం1430ఓట్లతో 71శాతం పోలింగ్ నమోదైంది.గన్నేరువరం మండలంలో 842 పట్టభద్రుల ఓటర్లు ఉండగా 368 పురుషుల ఓట్లు 204 మహిళా ఓట్లతో మొత్తం 572 ఓట్లు పోలై 68శాతం పోలింగ్ నమోదైంది.10మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 7 పురుషుల ఓట్లు, 3 మహిళా ఓట్లతో 100 శాతం పోలింగ్ నమోదైంది.ఇల్లంతకుంట మండలంలో 1969 పట్టభద్రుల ఓటర్లు ఉండగా 1316 ఓట్లు పోలై 66.8శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. కాగా సాయంత్రం నాలుగు గంటలకు పోలింగ్ ముగియడంతో అధికారులు పోలింగ్ కేంద్రానికి గేట్లు వేసి తాళం వేయగా దీంతో పోలింగ్ కేంద్రంలోపల ఉన్న వారికి మాత్రమే ఓటు వేసే అవకాశాన్ని కల్పించారు.దాదాపు 5 గంటల వరకు పోలింగ్ కొనసాగింది.

# షార్ట్ సర్క్యూట్‌తో కిరాణ దుకాణం దగ్ధం...

## - రూ.50లక్షల మేర ఆస్తి నష్టం- అర్ధరాత్రి గుంజపడుగులో ఘటన




**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఫిబ్రవరి 27:–** మంథని మండలం గుంజపడుగు గ్రామంలో గురువారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్నిప్రమాదంలో ఓ కిరాణ దుకాణం పూర్తిగా దగ్ధమైంది. గుంజపడుగు గ్రామానికి చెందిన ఊదరి శంకర్ అనే వ్యక్తికి చెందిన కిరణాదుకాణంలో ఏర్పడిన షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. బుధవారం రాత్రి యధావిధిగా కిరాణ దుకాణం మూసివేసి పక్కనే ఉన్న మరో ఇంట్లో నిద్రించారు. అయితే అర్ధరాత్రి సమయంలో కాలిపోతున్న వాసన, చప్పుడ్లు రావడంతో బయటకు వచ్చి చూడగా కిరాణ దుకాణంలో మంటలు వ్యాపించాయని బాధితుడు శంకర్ వాపోయాడు. స్థానికులు సైతం మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో మంథని ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో లీడింగ్ ఫైర్‌మెన్ ఆధ్వర్యంలో డ్రైవర్ కుమారస్వామి, ఫైర్‌మెన్‌లు నరేందర్, హరికృష్ణ, రఘు, సతీష్‌లు హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ఈ అగ్నిప్రమాదంలో కిరాణ దుకాణ సామగ్రి, ఇంటి సామానులతో పాటు రూ.5లక్షల మేర నగదు కాలిపోయినట్లు బాధితుడు తెలిపారు. ఈ ప్రమాదంలో తనకు రూ.50లక్షల మేర ఆస్తినష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. కాగా సకాలంలో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేయకుంటే పెను ప్రమాదం జరిగేదని పలువురు చర్చించుకుంటున్నారు.

# బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

## - మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్





**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఫిబ్రవరి 27:–** విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగి సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ కోరారు. మంథని మండలం గుంజపడుగు గ్రామంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన శివ శంకర్ కిరాణ దుకాణంను ఆయన పరిశీలించి బాధితుడు ఊదరి శివ శంకర్ కుటుంబాన్ని ఆయన పరామర్శించి ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో జీవనాధారమైన కిరణ దుకాణంలోని సామాన్లు, వస్తువులు కాలి బూడిదయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆధారం కోల్పోయిన బాధితుడికి సాయం అందించి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ ప్రమాదంపై అధికారులు స్పందించి ప్రభుత్వపరంగా ఆదుకునే విదంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన బందోబస్తు

## - కమీషనరేట్ వ్యాప్తంగా ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ - క్షేత్ర స్థాయిలో పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సిపి

## - రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్

**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్)** పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా రామగుండం కమీషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌ల వ్యాప్తంగా 108 పోలింగ్ కేంద్రాలలో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని,కమీషనరేట్ వ్యాప్తంగా ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరిగిందని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. రామగుండం పోలీస్ కమీషనరేట్ పెద్దపల్లి జోన్ రామగుండంలోని రామగుండం జడ్పిహెచ్‌ఎస్ స్కూల్, గోదావరిఖనిలోని సెక్రేడ్ హార్ట్ స్కూల్‌లను సిపి ఎం.శ్రీనివాస్ క్షేత్ర స్థాయిలో పోలింగ్ కేంద్రాలను గురువారం సందర్శించి, ఎన్నికలు జరుగుతున్న తీరును పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అప్రమత్తంగా ఉండాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలు చేయడం జరుగుతుందన్నారు. ఎసిపిలు, సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది మొత్తం 560 మందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమస్యాత్మక ప్రాంతాలలో ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ముందస్తు జాగ్రత్తలు, భద్రతా చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి అయి రిసెప్షన్ సెంటర్ చేరే వరకు పట్టిష్ట భద్రత రోడ్డు బందోబస్తు వేయడం జరిగిందని తెలిపారు. సిపి వెంట అడిషనల్ డిసిపి అడ్మిన్ సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఎసిపి రాఘవేంద్ర రావు, గోదావరిఖని ఎసిపి రమేష్, గోదావరిఖని వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి, ఆర్ఐ సంపత్, రామగుండం ఎస్ఐ సంధ్య రాణి ఉన్నారు.





# నీటి కాలువను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు



**ముత్తారం.ఫిబ్రవరి.27.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండల కాంగ్రెస్ నాయకులు సాగునీటి కాలువలను గురువారం పరిశీలించారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం నుండి అడవి శ్రీరాంపూర్ గ్రామానికి సాగునీరు వచ్చే కెనాల్ కొందరు భూ యజమానుల అభ్యంతరాల వల్ల నీళ్లు రావడంలేదని రైతాంగానికి ఇబ్బంది అవుతుందని తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకువెళ్లగా వారి ఆదేశానుసారం కెనాల్ వద్దకు వెళ్లి పరిశీలించి ఎలాగైతే అడవి శ్రీరాంపూర్ రైతాంగానికి సాగునీరు ఇవ్వగలుగుతాము అని చూసి ఇట్టి విషయాన్ని మంత్రి కి ఉన్నతాధికారులకు తీసుకువెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు వచ్చి పరిశీలించి సమస్య పరిష్కారం చేయవలసిందిగా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మాజీ జెడ్పిటిసి సభ్యులు చొప్పరి సదానందం, ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొడ్డ బాలాజీ, మద్దెల రాజయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు, గాదం శ్రీనివాస్ ముత్తారం మండల కిసాన్ సెల్ అధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తూటు రఫీ ,ముత్తారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు అనుము సమ్మయ్య, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బక్కతట్ల వినీత్ తదితరులు పాల్గొన్నారు.

# పేదవారికి దానం చేయడం మహా పుణ్యం

## • బృహత్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వారికి ధన్యవాదాలు



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఫిబ్రవరి 27:** శివరాత్రి సందర్భంగా 105 మంది పేదలకు శివరాత్రి మహాదానం పేరు మీద నిత్యవసర సరుకులు, బియ్యం సుమారు రెండు లక్షల 50 వేల తో పంపిణీ చేయడం జరిగింది. దీనికి సహకరించిన వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు అంటూ హెల్పింగ్ హాండ్స్ అధ్యక్షుడు నారగోని సతీష్, సభ్యులు మేడగొని విజయ్, మల్యాల విజయ్, తదితరులు గురువారం కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో వారం రోజుల నుండి ఒక దీక్ష లా శ్రమించి ప్రతీ రూపాయి పేద కుటుంబానికి చెందేలా చేసి విజయవంతం చేశారని అన్నారు, పేదవారికి దానం చేయడం మహా పుణ్యం అని రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని అలాగే దాతలు ముందుకు వచ్చి తమ వంతుగా సహాయ సహకారాలు అందించారని అన్నారు. హెల్పింగ్ హాండ్స్ ద్వారా ప్రజల సహకారంతో దాతల సహకారంతో పేదలకు బీదలకు సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని స్పష్టం చేశారు. హెల్పింగ్ హాండ్స్ వారు తమ కార్యక్రమాలను ఒక యజ్ఞంలో చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. గత వారం రోజులుగా శ్రమించినమల్యాల రమేష్ ,జబ్బార్ ఖాన్, వడ్లకొండ తిరుపతి, గీసాగోని శ్రీనివాస్, ,మల్యాల నరేష్, మిడివేల్లి రఘు, అనవేన కొండన్న, నారగోని ప్రశాంత్, జంగిలి పోచాలు, రెడ్డి చైతన్య,సయ్యద్ నజీబ్ ,బుర్ర సాయ్, దయ్యాల రాజు, కల్వల రాకేష్, మెడగోని సాయి, కొత్తపల్లి శ్రీనివాస్, కోలేటీ మహేష్, కోసాన అనిల్ , ఈర్ల అజయ్ ,మల్యాల రాజు, గుంజపడుగు శ్రావణ్, ఈరగోని సాయికిరణ్ ,బుర్ర శ్రీకాంత్, నల్లెలి ఈశ్వర్, మోదుంపురం సాయ్, జిల్లాల అశోక్, గుమ్మడి ప్రకాష్ తగు కృతజ్ఞతలు తెలిపారు.



# ఆదివారా స్వామి వద్ద పూజలు నిర్వహించిన ఉద్యమకారులు.



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఫిబ్రవరి 27:–** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు కమాన్ పూర్ ఆది వరహాస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఉద్యమకారులు శ్రీ ఆది వరహ స్వామి ఆలయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నూనె రాజేశం, ముదిరాజ్ రాష్ట్ర కార్యదర్శి కదరా కళాధర్ రెడ్డి, ఉత్తర తెలంగాణ కన్వీనర్ బత్తుల శంకర్, కమాన్ పూర్ మండలం అధ్యక్షులుమట్ట రాజయ్య, ఉపాధ్యక్షులు దాసరి రామస్వామి, చందుపట్ల ప్రతాపరెడ్డి ,తదితర తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు..!



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఫిబ్రవరి 27:** పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం కమాన్ పూర్ మండలంలో ప్రశాంతంగా జరిగాయి. మండలంలో మొత్తం పట్టభద్రుల ఓటర్లు 867 మంది ఉన్నారు. ఇందులో 679 మంది పట్ట భద్రులు ఓటు హక్కు వినియోగిం చుకున్నారు. ఇందులో 188 మంది ఓటు హక్కును వినియోగించుకోలేదు. ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో పురుష ఓటర్లు 377 మంది, మహిళ ఓటర్లు 302 మంది వినియోగిం చుకున్నారు. ఓటింగ్ శాతం 78.31 గా నమోదైంది. ఇది ఇలా ఉండగా.. మండలంలో టీచర్స్ ఓటర్లు 20 మంది ఉండగా.. ఇందులో 19 మంది తమ ఓటు హకును వినియోగిం చుకున్నారు. ఇందులో ఒక్కరూ మాత్రమే ఓటు హక్కు వినియోగించుకోలేదు. ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో పురుష ఓటర్లు 14 మంది, మహిళ ఓటర్లు 5 మంది ఉన్నారు. పోలింగ్ నమోదు శాతం 95 గా నమోదైంది. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడం కోసం కమాన్ పూర్ ఎస్. ఐ కొట్టె ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తూ నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రక్రియను గోదావరిఖని టూ టౌన్ సీ. ఐ నక్క ప్రసాద్ పరిశీలించారు. కమాన్ పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ సెకండరి పాఠశాలలో ఎమ్మెల్సీ పట్ట భద్రుల, టీచర్ల ఎన్నికల పోలింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఈ ఎన్నికల నిర్వాహణను తహసీల్దార్ వాసంతి ప్రత్యేకంగా పరిశీలించారు.



## చిన్నారులకు బహుమతులు అందజేత



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఫిబ్రవరి 27:–** కమాన్ పూర్ మండల కేంద్రంలోనిశ్రీఆది వరహాస్వామి ప్రాంగణంలో బిట్ బిట్ డ్యాన్స్ అకాడమీ నిర్వాహకులు పులిపాక దేవ చిన్నారి నృత్య కళాకారులకు అవార్డులను ప్రముఖ కళాకారుడు దాసరి రామస్వామి చేతులమీదుగా అందజేయడం జరిగింది. బుధవారం రోజు రాత్రి ఈ అవార్డులను అందజేయడం జరిగింది. ఇందులో చిన్నారులు తమ ప్రదర్శనను నిర్వహించారు. అలాగే ప్రతిఒక్క చిన్నారి తమ నృత్య ప్రదర్శనలతో ఆకర్షించారు. శివతాండవం కాళీమాత నృత్యాలను చేసి పలువురి మనలను పొందారు. బాగా చిన్నారులు మరిన్ని ప్రదర్శనలు చేసి రాటు తేలాలని పలువురు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ఆదివార స్వామి మాజీ డైరెక్టర్ భూపల్లి జ్యోతి, సురభి శ్రీధర్ సీనియర్ జర్నలిస్ట్ జబ్బర్‌ఖాన్, కళాధర్‌రెడ్డి, మట్ట రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పాక్‌తో మ్యాచ్‌లో గాయం!

స్పోర్ట్స్

## ప్రాక్టీస్‌లో పాల్గొనని రోహిత్

ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో ఇప్పటికే సెమీస్ కు వెళ్లిన భారత్.. వచ్చేనెల 2న జరిగే లీగ్ మ్యాచ్ కోసం సన్నాహకాలు స్టార్ట్ చేసింది. న్యూజిలాండ్ తో దుబాయ్ వేదికగా ఈ మ్యాచ్ జరుగుతుంది. అయితే కెప్టెన్ రోహిత్ శర్మ ప్రాక్టీస్ సెషన్లో చురుకుగా పాలు పంచుకోకవపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. పాక్ తో మ్యాచ్ సందర్భంగా తను తొడ కండరాల గాయానికి గురయ్యాడు. ఆ గాయం వల్ల తను ప్రాక్టీస్ సరిగ్గా చేయడం లేదా..? అనే సందేహాలు ముసురుకుంటున్నాయి. ఇక కివీస్ మ్యాచ్ కోసం భారత ఆటగాళ్లు చెమటోడుస్తున్నారు. కింగ్ విరాట్ కోహ్లీ తన సహజ ధోరణిలో కఠోరంగా శ్రమించాడు. ముఖ్యంగా స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజాను ఎదుర్కొన్నాడు. అలాగే టీమ్ లోని మిగతా పేసర్లను కూడా ఎదుర్కొన్నాడు. పాక్ తో మ్యాచ్ లో అజేయ సెంచరీ (100 నాటౌట్) తో సత్తా చాటిన కోహ్లీ.. సెమీస్ కు ముందు కివీస్ తో మ్యాచ్ లోనూ అదే తరహా సత్తా చాటాలని భావిస్తున్నాడు. పాక్ తో మ్యాచ్ లో బౌలింగ్ చేయడంలో ఇబ్బంది పడిన వెటరన్ పేసర్ మహ్మద్ షమీ.. ప్రాక్టీస్ సెషన్ లో ఉత్సాహంగా కనిపించాడు. బంతిని రెండు వైపులా స్వింగ్ చేయడానికి ప్రయత్నించాడు.



అర్షదీప్ సింగ్, హర్షిత్ రాణా కూడా ఫుల్లు జోష్ లో కనిపించారు. ఇక రోహిత్ విషయానికొస్తే తను హెడ్ కోచ్ గౌతం గంభీర్ తో చర్చిస్తూ కనిపించాడు. అలాగే కాసేపు షాడో బ్యాటింగ్ చేసిన హిట్ మ్యాన్.. ప్రాక్టీస్ లో ఎక్కువగా గడపలేదు. మిగతా ప్లేయర్లు ఫుట్ బాల్ ఆడటంతోపాటు, రన్నింగ్ ప్రాక్టీస్, చిన్న చిన్న కసరత్తులు చేస్తూ కనిపించారు. టోర్నీలో సూపర్ ఫామ్ లో ఉన్న స్టార్ ఓపెనర్ శుభమాన్ గిల్ ప్రాక్టీస్ రాలేదు. మ్యాచ్ కు ఇంకా మూడురోజులు సమయం ఉండటంతో తను విశ్రాంతి తీసుకున్నాడేమోనని పలువురు భావిస్తున్నారు. మెగాటోర్నీ ప్రారంభానికి ముందు స్వదేశానికి వెళ్లిన బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ తాజాగా జట్టుతో కలిశాడు. వ్యక్తిగత కారణాలతో ఈనెల 18న తను సౌతాఫ్రికాకు వెళ్లాడు. అయితే పనులు ముగించుకుని జట్టుతో కలిసి, ఆటగాళ్ల ప్రాక్టీస్ ను పర్యవేక్షించాడు. అలాగే గంభీర్ తో కలిసి చర్చిస్తూ కనిపించాడు. స్థానిక ఐసీసీ అకాడమీలో ప్రాక్టీస్ నిర్వహించిన భారత ఆటగాళ్లు ఉత్సాహంగా కనిపించారు. ఇక కివీస్ తో మ్యాచ్ లో గెలిస్తే గ్రూపు లో అగ్రస్థానంలో నిలుస్తుంది. సెమీస్ కు ముందు ఆటగాళ్ల ఆత్మవిశ్వాసం పెంచుకునేందుకు ఇది ఉపకరించగలదని నిపుణులు వ్యక్తం చేశారు.



## డబ్ల్యూపీఎల్‌లో ముంబై జైత్రయాత్ర

### యూపీ వారియర్స్ పై ఎనిమిది వికెట్లతో జయం

డబ్ల్యూపీఎల్ లో మాజీ చాంపియన్ ముంబై ఇండియన్స్ ముచ్చటగా మూడో విజయాన్ని అందుకుంది. బుధవారం బెంగళూరులో జరిగిన మ్యాచ్ లో యూపీ వారియర్స్ పై ఎనిమిది వికెట్లతో సునాయస విజయం సాధించింది. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్ కు దిగిన యూపీ వారియర్జ్ నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 142 పరుగులు చేసింది. ఓపెనర్ గ్రేస్ హారిస్ (26 బంతుల్లో 45, 6 ఫోర్లు, 2 సిక్సర్లు) వేగంగా ఆడి టాప్ స్కోరర్ గా నిలిచింది. బౌలర్లలో నాట్ స్కివర్ బ్రంట్ మూడు వికెట్లతో సత్తా చాటింది. అనంతరం ఛేజింగ్ ను ముంబై సునాయాసంగా పూర్తి చేసింది. బ్యాటింగ్ లో నూ సత్తా చాటిన బ్రంట్ విధ్వంసక అజేయ ఫిఫ్టీ (44 బంతుల్లో 75 నాటౌట్, 13 ఫోర్లు)తో సత్తా చాటింది. దీంతో కేవలం 17 ఓవర్లలోనే రెండు వికెట్లకు 143 పరుగుల చేసిన ముంబై గెలుపొందింది. ఆల్ రౌండ్ షో తో అదరగొట్టిన బ్రంట్ కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. తర్వాతి మ్యాచ్ లో ఆర్సీబీతో గుజరాత్ జెయింట్స్ తలపడుతారు. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన యూపీని బ్యాటర్ల వైఫల్యం వెంటాడింది. ఓపెనర్ కిరణ్ నవగిరే (1)తో విఫలం కాగా. మరో ఓపెనర్ హారిస్.. వన్ డౌన్ బ్యాటర్ దినేశ్ వృందా (33) తో కలిసి కొద్ది సేపు ఓపికగా ఆడింది. వీరిద్దరూ సత్తా చాటి మెరైన స్ట్రైక్ రేట్ తోపాటు బౌండరీలు సాధించడంతో ఒక దశలో స్కోరు 81-1తో నిలిచింది. అయితే వీరిద్దరూ వరుస ఓవర్లలో ఔటవడంతో యూపీ పతనం మొదలైంది. వచ్చినవారు వచ్చినట్లు వెనుదిరిగారు. మధ్యలో శ్వేతా షెరావత్ (19), వికెట్ కీపర్ బ్యాటర్ ఉమా ఛెత్రి (13 నాటౌట్) డబుల్ డిజిట్ స్కోర్లతో పోరాడటంతో యూపీ కాస్త గౌరవ ప్రదమైన స్కోరును సాధించింది. బౌలర్లలో షబ్నిం ఇస్మాయిల్, సంస్కృతి గుప్తాకు రెండు, హాలీ మథ్యూస్, అమెలియా కెర్ కు తలో వికెట్ దక్కింది. ఛేదన ఆరంభంలోనే ముంబైకి యస్తికా భాటియా డకౌట్ రూపంలో చిన్నపాటి షాక్ తగిలినా, కోలుకుంది. మరో ఓపెనర్ హీలీ (50 బంతుల్లో 59, 7 ఫోర్లు, 2 సిక్సర్లు) ధాటిగా ఆడింది. బ్రంట్ తో కలిసి యూపీ బౌలర్లను ఈజీగా ఎదుర్కొన్న హీలీ.. స్కోరుబోర్డును పరుగులు పెట్టించింది. వీరిద్దరూ రెచ్చిపోవడంతో రెండో వికెట్ కు ఏకంగా 133 పరుగుల భాగస్వామ్యం నమోదైంది. దీంతో 29 బంతుల్లో బ్రంట్.. 45 బంతుల్లో హీలీ అర్ధ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. విజయానికి మరో నాలుగు పరుగులు అవసరమైన దశలో హీలి వెనుదిరిగింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (4 నాటౌట్) ఎదుర్కొన్న తొలి బంతినే బౌండరీకి పంపి, జట్టుకు అద్భుత విజయాన్ని అందించింది. బౌలర్లలో సోఫీ ఎకిల్ స్టోన్, దీప్తి శర్మకు తలో వికెట్ దక్కింది. గత మ్యాచ్ లో యూపీతో సూపర్ ఓవర్లో నెగ్గి అద్భుత పోరాట పటిమ ప్రదర్శించిన యూపీ.. ఈ మ్యాచ్ లో పూర్తిగా తేలిపోయింది.

## ఇంగ్లండ్‌పై విజయంతో ఆఫ్ఘనిస్థాన్‌లో సంబరాలు

క్రికెట్‌లో ఏ టీమ్ అయినా అసాధారణ విజయం సాధిస్తే.. ఆ దేశపు క్రికెట్ అభిమానులు సంబురాలు చేసుకోవడం కామన్. ఇండియాలో మన టీమ్ పాకిస్థాన్‌పై గెలిస్తే, వరల్డ్ కప్ లాంటి బిగ్ ఈవెంట్స్ గెలిస్తే దేశంలో సంబురాలు చేసుకుంటారు జనం. కానీ, ఆఫ్ఘనిస్థాన్‌లో మాత్రం బుధవారం రాత్రి పెద్ద ఎత్తున్న సంబురాలు జరిగాయి. ఆ దేశపు పట్టణాల్లోని గల్లీ గల్లీ దద్దరిల్లింది. జనమంతా రోడ్లపైకి వచ్చేశారు. బైకులు, ఆటోలతో స్టంట్లు వేస్తూ తమ సంతోషాన్ని వ్యక్తి చేశారు. కొన్ని చోట్ల బాణాసంచా కూడా కాల్చారు. ఇదంతా ఎందుకు జరిగిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఛాంపియన్స్ ట్రోఫీలో ఆఫ్ఘాన్ జట్టు ఇంగ్లండ్‌పై విజయం సాధించింది. ఇది కేవలం గ్రూప్ మ్యాచ్ అయినప్పటికీ.. ఇంగ్లండ్ లాంటి ఒక స్ట్రాంగ్ టీమ్‌పై గెలుపు వారికి ఎనలేని సంతోషాన్ని ఇచ్చింది. అది కూడా హై స్కోరింగ్ గేమ్‌లో చివరి వరకు నరాలు తెగే ఉత్కంఠ మధ్య అద్భుతమైన విజయం అందుకోవడంతో ఆఫ్ఘాన్‌లోని క్రికెట్ అభిమానులంతా రోడ్లపైకి వచ్చిన సంబురాలు చేసుకున్నారు. వాటికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్ల రూలింగ్ నడుస్తున్న విషయం తెలిసిందే. తాలిబన్లు ఇలాంటి సంబురాలకు వ్యతిరేకం అయినా కూడా క్రికెట్ అభిమానులను వాళ్లు అడ్డుకోలేకపోయారు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘానిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 325 పరుగులు చేసింది. ఓపెనర్ ఇబ్రహీం జద్రాన్ 146 బంతుల్లో 12 ఫోర్లు 6 సిక్సులతో 177 పరుగుల భారీ ఇన్నింగ్స్ ఆడాడు. అలాగే కెప్టెన్ షాహిదీ 40, అజ్మతుల్లా ఒమర్జాయ్ 41, సీనియర్ ప్లేయర్ నబీ 40 పరుగులతో రాణించడంతో ఆఫ్ఘాన్ భారీ స్కోర్ చేసింది. ఇంగ్లండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ , లివింగ్‌స్టన్ 2, ఓవర్టన్, ఆదిల్ రషీద్ చెరో వికెట్ తీసుకున్నారు.

## స్టేడియాన్ని రినోవేట్ చేయనున్న హెచ్‌సీఏ

ఐపీఎల్ 2025 సీజన్ ప్రారంభానికి ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) గుడ్ న్యూస్ చెప్పింది. ఐపీఎల్ 2025 సీజన్‌కు ముందు స్టేడియం మొత్తాన్ని రినోవేట్ చేస్తామని తెలిపింది. స్టేడియం సీటింగ్, బాక్స్, వాష్ రూమ్స్‌తో పాటు అన్ని సౌకర్యాలను మెరుగుపరుస్తామని పేర్కొంది. ఈ విషయాన్ని హెచ్‌సీఏ ప్రెసిడెంట్ జగన్‌మోహన్ రావు గురువారం మీడియాకు తెలియజేశారు. ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా ఉప్పల్ స్టేడియం వేదికగా ఈ సారి 9 మ్యాచ్‌లు జరగనున్నాయి. 7 లీగ్ మ్యాచ్‌లతో పాటు రెండు ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లను కూడా కేటాయించారు. ఈ క్రమంలోనే స్టేడియాన్ని రినోవేట్ చేయాలని భావించాం. గతేడాది వన్డే ప్రపంచకప్ ముందే స్టేడియాన్ని పునరుద్దరించాం. స్టేడియానికి వచ్చే ప్రేక్షకులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాం. ఈ సారి మరింత గొప్ప అనుభూతిని కలిగేలా స్టేడియాన్ని తీర్చిదిద్దాలనుకుంటున్నాం. రాబోయే 15 రోజుల్లోనే వాష్ రూమ్స్‌తో పాటు బాక్స్, సీటింగ్ పెయింటింగ్ పూర్తి చేస్తాం. మార్చి 2 నుంచి సన్‌రైజర్స్ హైదరాబాద్ క్యాంప్ ప్రారంభమవ్వనుంది. సన్‌రైజర్స్ మేనేజ్‌మెంట్‌తో కలిసి హెచ్‌సీఏ పనిచేస్తోంది. ఇందులో తెలంగాణ పోలీస్ విభాగం కూడా భాగమవ్వనుంది. స్టేడియం భద్రత విషయంలో పోలీస్ డిపార్ట్‌మెంట్ సూచనలను పాటిస్తాం. 'అని జగన్‌మోహన్ రావు తెలిపారు. ప్యాట్ కమిన్స్ సారథ్యంలోని సన్‌రైజర్స్ హైదరాబాద్ గత సీజన్‌లో తృటిలో టైటిల్ చేజార్చుకున్న విషయం తెలిసిందే. ఫైనల్లో కోల్‌కతా నైట్‌రైడర్స్ చేతిలో ఓటమిపాలైంది. ఈ సారైన టైటిల్ గెలవాలనే లక్ష్యంతో ఉంది. ఐపీఎల్ 2025 సీజన్‌కు మార్చి 22న తెరలేవనుండగా.. సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ తొలి మ్యాచ్‌ను మార్చి 23న రాజస్థాన్ రాయల్స్ తో హైదరాబాద్ వేదికగానే ఆడనుంది. మార్చి 23, మార్చి 27, ఏప్రిల్ 6, ఏప్రిల్ 12, ఏప్రిల్ 23, మే 5, మే10 తేదీల్లో ఉప్పల్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌లు జరగనున్నాయి.



## నేను ఇతరులతో అంత కలివిడిగా ఉండలేను

### మైదానం నుంచి వచ్చాక నా లోకంలో నేను ఉంటా

### మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ




భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీతో జరిగిన సంఘటనను తాజాగా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ గుర్తు చేసుకున్నాడు. తను ఇతరులతో అంత కలివిడిగా ఉండలేనని, క్రికెట్ మైదానం నుంచి బయటకు వచ్చాక తన లోకంలో తను ఉంటానని చెప్పుకొచ్చాడు. అయితే తన సహచరులకు సహాయం అవసరమైనప్పుడు మాత్రం తను టచ్ లోకి వస్తానని వెల్లడించాడు. నిజానికి ధోనీపై కొన్ని విమర్శలు ఉన్నాయి. తను క్రికెట్ ఆడే కాలం నుంచి కూడా, ఒక్కసారి మైదనాం నుంచి దూరమయ్యాక, సహచరులలకు, మాజీ ప్లేయర్లుకు కూడా ధోనీ అందుబాటులో ఉండేవాడు కాదని చిన్న కంప్లైంట్స్ ఉన్నాయి. ఇటీవల ఒక కార్యక్రమంలో ఒక ఫ్యాన్ అడిగిన ప్రశ్నకు ధోనీ పై విధంగా సమాధానమిచ్చాడు. ఇక 2022లో టెస్టు కెప్టెన్ గా కోహ్లీ దిగిపోయాక, ధోనీ ఒక్కడు మాత్రమే తనకు మెసేజీ చేశాడని కోహ్లీ గతంలో చెప్పుకొచ్చాడు. అప్పటి విషయాన్ని గురించి కోహ్లీ మాట్లాడుతూ.. 2022 కెప్టెన్సీ నుంచి దిగిపోయాక, కాస్త కష్టకాలంలో తాను ఉన్నట్లు భావించానని ఆ సమయంలో ఒక్క ధోనీ మాత్రమే మెసేజీ చేశాడని చెప్పుకొచ్చాడు. తన నెంబర్ చాలామంది దగ్గర ఉందని, అయితే టీవీల్లో, ఇంటర్వ్యూల్లో చాలా బాగా చెప్పే ఏ ఒక్కరూ కూడా తనను సంప్రదించలేదని వాపోయాడు. సలహాలు, సూచనలు అనేవి ముఖాముఖిగా కలిసి చేబితే బాగుంటుందని, అందరి ముందే చెబితే దానికి వ్యాల్యూ ఉండబోదని పేర్కొన్నాడు. తనకు సంబంధించిన ఏ విషయమైనా, సలహాలు సూచనలు స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నానని కోహ్లీ తెలిపాడు. తాను ఆట విషయంలోనే కాకుండా, జీవితంలోనూ నిజాయితీగా ఉంటానని కోహ్లీ చెప్పుకొచ్చాడు. ధోనీ, తన మధ్య స్నేహం చాలా స్వచ్ఛమైనదని, ఒకరి నుంచి మరొకరికి ఏదో ఆశించి చేసే స్నేహం కాదని, తోడు అవసరమైన సమయంలో ముందుంటామని పేర్కొన్నాడు. తన స్నేహితులు ఎవరైనా ఇబ్బందుల్లో ఉన్నప్పుడు, తొలిగా స్పందించి, వారికి చేతనైనంత సాయం చేస్తానని వెల్లడించాడు. ఇక అంతర్జాతీయ క్రికెట్లో ధోనీ, కోహ్లీ స్నేహం చాలా ప్రసిద్ధి చెందింది. ధోనీ ఆడుతున్న సమయంలో కెప్టెన్ గా కోహ్లీ ఉన్నప్పటికీ, ధోనీపైనే ఎక్కువగా నమ్మకం ఉంచి , అతని సలహాలు సూచనలు పాటించేవాడని నిపుణులు పేర్కొంటారు. భారత్ తరపున అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో కోహ్లీ ఒకడు. సౌరవ్ గంగూలీ తర్వాత జట్టుకు దూకుడు నేర్పి, మూడు ఫార్మాట్లలోనూ నెం.1 గా నిలిపిన ఘనత అతని సొంతం. ఇక వచ్చేనెల 22 నుంచి ప్రారంభం కాబోయే, ఐపీఎల్ 2025కి ధోనీ సిద్ధమవుతున్నాడు. తను చెన్నై సూపర్ కింగ్స్ తరపున బరిలోకి దిగబోతున్నాడు. ప్రస్తుతం కోహ్లీ.. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ కోసం దుబాయ్ లో ఉన్నాడు. తను వచ్చే ఐపీఎల్లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తరపున బరిలోకి దిగనున్నాడు.

## టాస్ పడకుండానే రద్దైంది

### వర్షం కారణంగా పాకిస్థాన్- బంగ్లాదేశ్ మ్యాచ్ రద్దు

ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా గురువారం పాకిస్థాన్- బంగ్లాదేశ్ మధ్య జరగాల్సిన గ్రూప్ స్టేజ్? మ్యాచ్ వర్షం కారణంగా టాస్ పడకుండానే రద్దైంది. ఇరుజట్లకు చెరో పాయింట్ ఇస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. దీంతో స్వదేశంలో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా నెగ్గకుండానే పాకిస్థాన్ ఇంటిముఖం పట్టింది. అటు బంగ్లాదేశ్‌ది కూడా అదే పరిస్థితి. కాగా, డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగిన పాక్ ఈ టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా నెగ్గకుండా ఇంటిబాట పట్టడం ఆ జట్టు అభిమానులకు ఘోర అవమానకరం. టోర్నీలో తొలి రెండు మ్యాచ్?ల్లో న్యూజిలాండ్, భారత్?తో ఆడిన పాక్ చిత్తుగా ఓడింది. దీంతో ఇప్పటికే సెమీస్ రేస్ నుంచి నిష్క్రమించిన పాక్, ఆఖరి మ్యాచ్‌లోనైనా నెగ్గి సొంత అభిమానుల ముందు పరువు కాపాడుకోవాలని భావించింది. కానీ, వర్షం ఆటకు అంతరాయం కలిగించింది. కొంత సమయం తర్వాత వర్షం తగ్గినా, ఔట్ ఫీల్డ్ చిత్తడిగా ఉండడం వల్ల మ్యాచ్ నిర్వాహణ సాధ్యం కాలేదు. దీంతో అంపైర్లు మ్యాచ్ రద్దు చేశారు. దీంతో బంగ్లాదేశ్, పాకిస్థాన్ చెరో ఒక్క పాయింట్?తో పట్టికలో మూడు, నాలుగో స్థానాల్లో నిలిచి టోర్నీ నుంచి నిష్క్రమించాయి. ఇక ఆదివారం గ్రూప్‌లో భారత్- న్యూజిలాండ్ మధ్య జరిగే పోరులో గెలిచిన జట్టు గ్రూప్- ఎలో అగ్రస్థానంలో నిలుస్తుంది.

## వరుస విజయాలతో టీమిండియా జోరు

### మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైన భారత్

### న్యూజిలాండ్‌తో అమీతుమీ తేల్చుకోనున్న టీమిండియా

### గత మెగా టోర్నీల్లో భారత్‌పై న్యూజిలాండ్‌దే పై చేయి

### భయపెడుతున్న న్యూజిలాండ్ రికార్డ్స్!

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో వరుస విజయాలతో జోరు మీదున్న టీమిండియా.. మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. ఆదివారం దుబాయ్ వేదికగా జరిగే ఆఖరి లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. ఇరు జట్లు రెండేసి విజయాలతో ఇప్పటికే సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాయి. అయితే ఈ మ్యాచ్‌లో గెలిచే జట్టే గ్రూప్-ఏ టాపర్‌గా నిలవనుంది. దాంతో ఇరు జట్లు విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నాయి. ఈ మెగా మ్యాచ్‌కు ముందు అభిమానులను గత రికార్డ్స్ కలవరపెడుతున్నాయి. మెగా టోర్నీల్లో భారత్‌పై న్యూజిలాండ్‌దే పై చేయిగా ఉంది. 2019 వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్లో టీమిండియాను న్యూజిలాండ్ ఓడించగా.. 2023 వన్డే ప్రపంచకప్‌లో మాత్రం కివీస్‌కు రోహిత్ సేన షాకిచ్చింది. గత 20 ఏళ్లుగా ఐసీసీ టోర్నీల్లో టీమిండియాపై న్యూజిలాండ్‌దే పై చేయిగా నిలుస్తోంది. 2019 వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్‌తో పాటు 2021 టీ20 ప్రపంచకప్‌లోనూ భారత్‌కు న్యూజిలాండ్ షాకిచ్చింది. 2000లో






జరిగిన ఐసీసీ నాకౌట్(ఛాంపియన్స్ ట్రోఫీ) ఫైనల్లోనూ న్యూజిలాండ్.. భారత్‌ను ఓడించింది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ అరంగేట్ర ఎడిషన్ ఫైనల్లో భారత్‌ను న్యూజిలాండ్ మట్టికరిపించింది. ఓవరాల్‌గా ఇరుజట్ల మధ్య ఐసీసీ టోర్నీల్లో 16 మ్యాచ్‌లు జరగ్గా.. న్యూజిలాండ్ 10 మ్యాచ్‌లు గెలిచింది. భారత్ మాత్రం 5 మ్యాచ్‌ల్లోనే విజయం సాధించింది. మరో మ్యాచ్ ఫలితం తేలలేదు. వన్డే ప్రపంచకప్‌ల్లో 11 సార్లు, టీ20 ప్రపంచకప్‌ల్లో 3, ఛాంపియన్స్ ట్రోఫీ, ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో ఒక్కసారి భారత్, న్యూజిలాండ్ తలపడ్డాయి. 2007 టీ20 ప్రపంచకప్‌లో భారత్ విజేతగా నిలిచినా.. లీగ్ దశలో న్యూజిలాండ్ చేతిలో ఓటమిపాలైంది. 2016 టీ20 ప్రపంచకప్‌లో సూపర్ 10 మ్యాచ్, 2021 టీ20 ప్రపంచకప్ గ్రూప్ దశలో భారత్‌పై న్యూజిలాండ్ విజయం సాధించింది.

# విశ్వేజి



## పాలల్లో ఇవి నానబెట్టి తీసుకుంటే ఊహించని శక్తి..

### అసలు సంగతి తెలిస్తే!

ఖర్జూరాలను పాలల్లో నానబెట్టి తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు అనేకం ఉన్నాయి. ఖర్జూరాలు , పాలు రెండూ పోషకాలతో నిండిన ఆహారాలు, వీటిని కలిపి తీసుకోవడం వల్ల ఆరోగ్యం మరింత మెరుగుపడుతుంది. ఈ కలయిక శరీరానికి శక్తినివ్వడమే కాకుండా అనేక వ్యాధుల నుండి రక్షించడంలో సహాయపడుతుంది. శక్తిని పెంచుతుంది: ఖర్జూరాలు , పాలు రెండూ శక్తిని పెంచే ఆహారాలు. ఖర్జూరాలలో ఉండే సహజ చక్కెరలు తక్షణ శక్తిని అందిస్తాయి, అయితే పాలలో ఉండే ప్రోటీన్ , ఇతర పోషకాలు శక్తి స్థాయిలను ఎక్కువసేపు నిలబెట్టడానికి సహాయపడతాయి. ఉదయం ఖర్జూరాలను పాలలో నానబెట్టి తినడం వల్ల రోజంతా శక్తివంతంగా ఉండవచ్చు. పాలలో లాక్టోజ్ ఉంటుంది, ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. ఖర్జూరాలలో ఉండే ఫైబర్ మలబద్ధకాన్ని నివారిస్తుంది మరియు ప్రేగు కదలికలను మెరుగుపరుస్తుంది. ఎముకలను బలోపేతం చేస్తుంది: పాలు కాల్షియం , విటమిన్ డికి గొప్ప మూలం, ఇవి ఎముకల ఆరోగ్యానికి చాలా అవసరం. ఖర్జూరాలలో పొటాషియం , మెగ్నీషియం వంటి ఖనిజాలు కూడా ఉన్నాయి, ఇవి ఎముకల సాంద్రతను పెంచడానికి సహాయపడతాయి. ఈ రెండింటి కలయిక ఎముకలను బలంగా, ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. బరువు పెరగడానికి సహాయపడుతుంది: ఖర్జూరాలు మరియు పాలు రెండూ కేలరీలు మరియు పోషకాలు అధికంగా ఉండే ఆహారాలు. బరువు పెరగాలనుకునే వారికి లేదా తక్కువ బరువు ఉన్నవారికి ఈ కలయిక చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఆరోగ్యకరమైన రీతిలో బరువు పెరగడానికి ఖర్జూరాలను పాలలో నానబెట్టి తినడం ఒక మంచి మార్గం. పాలలో ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం ఉంటుంది, ఇది నిద్రను ప్రోత్సహించే హార్మోన్ అయిన మెలటోనిన్ ఉత్పత్తికి సహాయపడుతుంది. ఖర్జూరాలలో మెగ్నీషియం ఉంటుంది, ఇది కండరాలను సడలించడానికి, నిద్రను మెరుగుపరచడానికి సహాయపడుతుంది. రాత్రి పడుకునే ముందు ఖర్జూరాలను పాలలో నానబెట్టి తినడం వల్ల నిద్ర నాణ్యతను మెరుగుపరచవచ్చు. చర్మం , జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది: ఖర్జూరాలలో యాంటీఆక్సిడెంట్లు మరియు విటమిన్లు ఉన్నాయి, ఇవి చర్మ కణాలను దెబ్బతినకుండా కాపాడతాయి , చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. పాలలోని విటమిన్లు , ప్రోటీన్లు జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తాయి ,జుట్టును బలంగా ఉంచుతాయి. రోగనిరోధక శక్తిని పెంచుతుంది: ఖర్జూరాలు , పాలు రెండూ రోగనిరోధక శక్తిని పెంచే పోషకాలను కలిగి ఉంటాయి. ఖర్జూరాలలో యాంటీఆక్సిడెంట్లు , విటమిన్లు రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి సహాయపడతాయి. పాలలో విటమిన్ డి , ఇతర పోషకాలు కూడా రోగనిరోధక శక్తిని పెంచడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఎలా తీసుకోవాలి: గర్భిణీ స్త్రీలకు అవసరమైన పోషకాలు ఖర్జూరాలు, పాలలో పుష్కలంగా ఉంటాయి. పాలిచ్చే తల్లులకు ఇది శక్తిని అందిస్తుంది . వీటిని ప్రతి రోజూ తీసుకుంటే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. 2-3 ఖర్జూరాలను రాత్రిపూట ఒక గ్లాసు పాలలో నానబెట్టండి. మీరు కావాలనుకుంటే, ఖర్జూరాలను మెత్తగా చేసి పాలలో కలిపి కూడా తీసుకోవచ్చు. రుచి కోసం కొంచెం తేనె లేదా యాలకుల పొడిని కూడా కలపవచ్చు. ప్రతి రోజూ ఉదయం లేదా సాయంత్రం దీనిని తీసుకోవచ్చు. అయితే డయాబెటిస్ ఉన్నవారు లేదా రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉన్నవారు ఖర్జూరాలను మితంగా తీసుకోవాలి, ఎందుకంటే వాటిలో చక్కెరలు ఎక్కువగా ఉంటాయి. పాలు పడని వారు లేదా లాక్టోస్ అసహనం ఉన్నవారు పాల బదులు బాదం పాలు లేదా సోయా పాలు వంటి ప్రత్యామ్నాయాలను ఉపయోగించవచ్చు. ఏదైనా ఆహారాన్ని అధికంగా తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది కాదు. పాలల్లో నానబెట్టిన ఖర్జూరాలను కూడా మితంగా తీసుకోవడం ఉత్తమం.

## డయాబెటిక్ రోగులు ఈ పిండి పదార్థాలను తిన్నారో డేంజర్‌లో పడ్డట్లే.!



డయాబెటిస్ ఉన్న వ్యక్తులు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి , సమస్యలను నివారించడానికి వారి ఆహారంపై శ్రద్ధ వహించడం చాలా ముఖ్యం. పిండి పదార్థాలు రక్తంలో చక్కెర స్థాయిలను ప్రభావితం చేసే పోషకాలు, కాబట్టి వాటిని ఎంచుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. శుద్ధి చేసిన పిండి పదార్థాలు త్వరగా జీర్ణమవుతాయి, దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరుగుతాయి. అందువల్ల, డయాబెటిక్ రోగులు శుద్ధి చేసిన పిండి పదార్థాలకు బదులుగా సంక్లిష్ట పిండి పదార్థాలను ఎంచుకోవాలి. సంక్లిష్ట పిండి పదార్థాలు: ఇవి నెమ్మదిగా జీర్ణమవుతాయి, రక్తంలో చక్కెర స్థాయిలను క్రమంగా పెంచుతాయి. ఇవి సాధారణంగా ఫైబర్, విటమిన్లు , ఖనిజాలను కలిగి ఉంటాయి. అదే శుద్ధి చేసిన పిండి పదార్థాలు ఇవి త్వరగా జీర్ణమవుతాయి. రక్తంలో చక్కెర స్థాయిలను వేగంగా పెంచుతాయి. వీటిలో సాధారణంగా తక్కువ ఫైబర్, విటమిన్లు , ఖనిజాలు ఉంటాయి. డయాబెటిక్ రోగులు తీసుకోవాల్సిన పిండి పదార్థాలు: వోట్స్ లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇవి నెమ్మదిగా జీర్ణమవుతాయి, దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు క్రమంగా పెరుగుతాయి. బార్లీలో కూడా ఫైబర్ అధికంగా ఉంటుంది, ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది నెమ్మదిగా జీర్ణమవుతుంది, దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు క్రమంగా పెరుగుతాయి. బ్రౌన్ రైస్: బ్రౌన్ రైస్ అనేది సంక్లిష్ట పిండి పదార్థం, ఇది నెమ్మదిగా జీర్ణమవుతుంది. దీనిలో ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు అధికంగా ఉంటాయి. క్వినోవా కూడా ఆరోగ్యానికి మంచిది. ఇది ప్రోటీన్ యొక్క మంచి మూలం. ఇది నెమ్మదిగా జీర్ణమవుతుంది, దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు క్రమంగా పెరుగుతాయి. మొలకెత్తిన ధాన్యపు రొట్టె అనేది సంక్లిష్ట పిండి పదార్థం, ఇది నెమ్మదిగా జీర్ణమవుతుంది. దీనిలో ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు అధికంగా ఉంటాయి. రాగి పిండి : ఫింగర్ మిల్లెట్ అని కూడా పిలువబడే రాగులు చాలా పోషకమైన తృణధాన్యాల పిండి, దీనిలో ఫైబర్, కాల్షియం , యాంటీఆక్సిడెంట్ల అధికం. రాగుల పిండిలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది, ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు అనువైనది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. అంతే కాకుండా రాగులలో మొత్తం ఆరోగ్యానికి తోడ్పడే ముఖ్యమైన అమైనో ఆమ్లాలతో నిండి ఉంటాయి. తగ్గించుకోవాల్సిన పిండి పదార్థాలు: తెల్ల బియ్యం అనేది శుద్ధి చేసిన పిండి పదార్థం, ఇది త్వరగా జీర్ణమవుతుంది. వీటిల్లో తక్కువ ఫైబర్, విటమిన్లు ,ఖనిజాలు ఉంటాయి. పాస్తా, బేకరీ ఉత్పత్తులు త్వరగా జీర్ణమవుతాయి. కేకులు, కుకీలు , పేస్ట్రీలు వంటి బేకరీ ఉత్పత్తులు సాధారణంగా శుద్ధి చేసిన పిండి పదార్థాలు, చక్కెర , అనారోగ్యకరమైన కొవ్వులతో తయారు చేయబడతాయి. వీటితో పాటు ప్రాసెస్ చేసిన స్నాక్స్ కూడా డయాబెటిక్ రోగులకు మంచిది కాదు. చిప్స్, క్రాకర్స్ , ప్రీట్జెల్స్ వంటి ప్రాసెస్ చేసిన స్నాక్స్ సాధారణంగా శుద్ధి చేసిన పిండి పదార్థాలు, ఉప్పు , అనారోగ్యకరమైన కొవ్వులతో తయారు చేయబడతాయి. డయాబెటిక్ రోగులు శుద్ధి చేసిన పిండి పదార్థాలను మితంగా తీసుకోవాలి. వారు వాటిని పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు , లీన్ ప్రోటీన్ వంటి ఇతర ఆరోగ్యకరమైన ఆహారాలతో సమతుల్యం చేసుకోవాలి. డయాబెటిక్ రోగులు వారి ఆహారంలో ఏవైనా మార్పులు చేసే ముందు వైద్యుడిని లేదా రిజిస్టర్డ్ డైటీషియన్‌ను సంప్రదించడం చాలా ముఖ్యం.

## ఇడ్లీలో క్యాన్సర్ కారకాలు..

### ఆరోగ్య శాఖ నివేదికలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి.!

ఇడ్లీ... పేరు వింటేనే నోరూరించే ఆహారం. దక్షిణ భారతదేశంలో ఇది ఒక ముఖ్యమైన ఆహారం మాత్రమే కాదు, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి ఇష్టమైన అల్పాహారం కూడా. పేద, ధనిక అనే తేడా లేకుండా, చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు అందరూ ఇడ్లీని సాంబార్‌తో కలిపి తినడానికి ఇష్టపడతారు. ఆరోగ్యకరమైన కార్బోహైడ్రేట్లు మరియు ప్రోటీన్‌ను అందించే ఈ ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. అంతేకాదు, ఇడ్లీని తయారు చేయడానికి నూనె లేదా ఎక్కువ మసాలాలు కూడా అవసరం లేదు. అందుకే చాలామంది ఆరోగ్యకరమైన అల్పాహారంగా ఇడ్లీని ఎంచుకుంటారు. కానీ, బెంగళూరు నగరంలో వెలుగులోకి వచ్చిన ఒక సంచలన విషయం ఇడ్లీ ప్రియులను షాక్‌కు గురిచేసింది. బెంగళూరులోని ఆరోగ్య శాఖ అధికారులు జరిపిన అధ్యయనంలో కొన్ని రెస్టారెంట్లు , వీధి వ్యాపారులు ఇడ్లీలను తయారుచేసే విధానం క్యాన్సర్‌కు కారణమయ్యే ప్రమాదం ఉందని తేలింది. ఈ వార్త ఇడ్లీ ప్రియులను తీవ్ర దిగ్భ్రాంతిని గురిచేస్తుంది.. బెంగళూరు ఆరోగ్య శాఖ అధికారులు నగరంలోని హోటళ్లు ,వీధి వ్యాపారులు ఇడ్లీలను ఎలా తయారుచేస్తున్నారో తెలుసుకోవడానికి ఒక ప్రత్యేక అధ్యయనం నిర్వహించారు. దీనిలో భాగంగా, నగరంలోని వివిధ ప్రాంతాల నుండి ఇడ్లీ నమూనాలను సేకరించి ప్రయోగశాలలో పరీక్షించారు. ఈ పరీక్షల్లో విస్తుపోయే విషయాలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. అనేక ఇడ్లీ నమూనాలలో క్యాన్సర్ కారక రసాయనాలు ఉన్నాయని అధికారులు గుర్తించారు. దాదాపు 500 ఇడ్లీ నమూనాలను



పరీక్షించిన ఆరోగ్య శాఖ, వాటిలో 35 నమూనాలలో క్యాన్సర్ కారక రసాయనాలు ఉన్నాయని నిర్ధారించింది. ఈ రసాయనాలు వినియోగదారులలో క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని పెంచుతాయని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇంకా వందలాది నమూనాల పరీక్ష ఫలితాలు రావాల్సి ఉంది. ఈ ఫలితాలు ఇప్పుడు అందరిని ఆందోళన కలిగిస్తుంది. కలుషితమైన ఇడ్లీ నమూనాలను గుర్తించిన తరువాత, ఆరోగ్య శాఖ అధికారులు ఆ ఇడ్లీలను తయారుచేసిన హోటళ్లు , వ్యాపారులను సందర్శించి వారి తయారీ విధానాలను నిశితంగా పరిశీలించారు. సాధారణంగా సంప్రదాయ పద్ధతిలో, ఇడ్లీ పిండిని శుభ్రమైన కాటన్ వస్త్రాలపై వేసి, ఆపై ఇడ్లీ ట్రేలపై పెట్టి ఆవిరిలో ఉడికిస్తారు. కానీ, చాలా హోటళ్లు , వీధి వ్యాపారులు ఇప్పుడు కాటన్ వస్త్రాలకు బదులుగా ప్లాస్టిక్ షీట్లను ఉపయోగిస్తున్నారు. ఆరోగ్య నిపుణులు చెబుతున్న ప్రకారం, అధిక వేడికి ప్లాస్టిక్ గురైనప్పుడు రసాయనాలను విడుదల చేస్తుంది. ఈ రసాయనాలలో కొన్ని క్యాన్సర్ కారకాలుగా మారే అవకాశం ఉంది. ఈ కారణంగానే ఇడ్లీలలో క్యాన్సర్ కారకాలు కనుగొనబడ్డాయని అధికారులు భావిస్తున్నారు. ఈ వార్త వెలువడిన వెంటనే ఇడ్లీ వినియోగదారులలో తీవ్ర భయాందోళనలు మొదలయ్యాయి. ప్రజలు తమకు ఇష్టమైన ఇడ్లీని తినాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. మిగిలిన నమూనాల పూర్తి నివేదిక కోసం ఆరోగ్య శాఖ అధికారులు ఎదురుచూస్తున్నారు. ఒకవేళ మిగిలిన నివేదికలు కూడా ఇలాగే వస్తే, ఆహార పరిశ్రమలో ప్లాస్టిక్ వినియోగంపై ప్రభుత్వం పూర్తి నిషేధం విధించే అవకాశం ఉంది. అటు కర్ణాటక ఆరోగ్య శాఖ మంత్రి దినేష్ గుండురావు దీనిపై స్పందించారు. ఆహార తయారీలో, ముఖ్యంగా ఇడ్లీ తయారీలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించే విషయాన్ని ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తోందని ఆయన తెలిపారు. త్వరలోనే ఈ విషయంపై ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. మరో వైపు వెంటనే ఆహార తయారీలో ప్లాస్టిక్ వాడకాన్ని ప్రభుత్వం నిషేధించాలని, ఈ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# మార్కెట్

## ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు..

దేశీయ స్టాక్ మార్కెట్లు ఫ్లాట్‌గా ముగిశాయి. మహాశివరాత్రి పర్వదినం కావడంతో మార్కెట్లు బుధవారం మూతపడిన విషయం తెలిసిందే. గురువారం ఉదయం మార్కెట్లు సానుకూల పవనాల మధ్య లాభాల్లో ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. చివరి సెషన్‌లో సెనెక్స్ లాభాల్లో కదలాడినా.. లాభాల స్వీకరణకు దిగడంతో మార్కెట్లు ఫ్లాట్‌గా ముగిశాయి. క్రితం సెషన్ (మంగళవారం ముగింపు)తో పోలిస్తే సెన్సెక్స్ 74,706.60 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 74,520.78 కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. గరిష్ఠంగా 74,834.09 పాయింట్లకు పెరిగింది. %చివరకు 10.31 పాయింట్లు పెరిగి.. 74,612.43 వద్ద ముగిసింది. నిఫ్టీ 2.50 పాయింట్లు తగ్గి.. 22,545.05 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 892 షేర్లు లాభపడ్డాయి. మరో 2,925 షేర్లు పతనమయ్యాయి. శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, సన్ ఫార్మా, హిందాల్కో ఇండస్ట్రీస్ నిఫ్టీలో లాభాలను ఆర్జించాయి. అల్ట్రాటెక్ సిమెంట్, ట్రెంట్, జియో ఫైనాన్షియల్, బజాజ్ ఆటో, టాటా మోటార్స్ నష్టపోయాయి. బ్యాంక్, మెటల్ మినహా అన్ని ఇతర రంగాల సూచీలు నష్టాల్లోనే కొనసాగాయి. ఆటో, మీడియా, ఎనర్జీ, క్యాపిటల్ గూడ్స్, రియాల్టీ, పవర్ ఒకటి నుంచి రెండుశాతం వరకు పతనమయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఒకశాతం తగ్గగా.. స్మాల్ క్యాప్ ఇండెక్స్ 2శాతం పడిపోయింది.



## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

### నేలచూపులు చూస్తున్న కొనుగోలుదారులు

### ధరల పెరుగుదలతో సామాన్యులకు అందుబాటులో లేని గోల్డ్



న్యూఢిల్లీ : బంగారం ప్రియులకు స్వల్ప ఊరట లభించింది. ఫిబ్రవరి నెల ప్రారంభం నుంచి భారీగా పెరిగాయి. అంతర్జాతీయంగా బంగారం ధరల్లో వృద్ధి చెందటం, ఆర్థిక సంక్షోభం, డాలర్ మారకంలో వచ్చిన మార్పులు లాంటి కారణాలు ఈ ధరల పెరుగుదలకు కారణమయ్యాయి. ఇక ఇప్పుడు గత రెండు రోజులుగా గోల్డ్ రేట్స్.. నేలచూపులు చూస్తున్నాయి. 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారంపై రూ. 280 మేరకు తగ్గగా.. 22 క్యారెట్ల బంగారం రూ. 260 మేరకు తగ్గింది. అటు వెండి ధరలు కూడా బంగారం బాట పట్టాయి. రెండు రోజుల్లో సుమారు రూ. 3100 మేరకు తగ్గింది. అయితే ధరలు పెరిగినప్పుడు ఉన్న దూకుడు తగ్గుదలలో మాత్రం కానరావడం లేదు. దీంతో సామాన్య ప్రజలు బంగారం వైపు చూడడం మానేశారు. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ. 87,810 ఉండగా.. 22 క్యారెట్ల తులం బంగారం రూ. 80,490గా ఉంది. అలాగే విజయవాడలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం రూ. 87,810 ఉండగా.. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ. 80,490 వద్ద కొనసాగుతోంది. వెండి ధరల విషయాని కొస్తే.. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో కేజీ వెండి ధర రూ. 1,05,900గా ఉంది. చెన్నైలో కూడా ఇదే రేటు కొనసాగుతోంది. అటు ముంబై, ఢిల్లీ, కోల్‌కతాలో కిలో వెండి రూ. 97,900గా ఉంది. పేద, సామాన్యులకు బంగారం ధరలు అందుబాటులో లేకుండా పోవడంతో పసిడికి డిమాండ్ పడిపోతోంది. దీంతో దిగుమతులు సగానికి తగ్గనున్నాయని రిపోర్టులు వస్తోన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో బంగారం దిగుమతులు 15 టన్నులకు పరిమితం కానుందని రాయిటర్స్ ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. ఏడాది క్రితం నాటి దిగుమతులతో పోల్చితే 85 శాతం క్షీణించి.. 20 ఏళ్ల నాటి కనిష్ట స్థాయికి పడిపోవచ్చని అంచనా వేసింది. ఈ ఏడాది జనవరిలోని 30-35 టన్నుల దిగుమతులతో పోల్చితే దాదాపుగా సగానికి క్షీణించొచ్చని విశ్లేషించింది. అంతర్జాతీయ బులియన్ మార్కెట్‌లో సోమవారం ఔన్స్ ధర రికార్డ్ స్థాయిలో 2,956 డాలర్లకు ఎగిసింది. అధిక ధరల కారణంగా డిమాండ్ భారీగా తగ్గింది. అమెరికా వాణిజ్య సుంకాల దాడికి తోడు ప్రపంచ ఆర్థిక అనిశ్చితి, భౌగోళిక ఆందోళనలు బంగారం ధరలకు ఆజ్యం పోస్తున్నాయి. వీటికి తోడు డాలర్‌తో రూపాయి మారకం విలువ భారీగా క్షీణించి పసిడి ధరలను ఎగిసిపడేలా చేస్తోన్నాయి. 2025 జనవరిలో బంగారం దిగుమతులు 30-35 టన్నులకు పడిపోయి.. ఆరు నెలల కనిష్ట స్థాయి వద్ద నమోద య్యాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ప్రస్తుత నెలలో డిమాండ్ మరింత సన్నగిల్లిందని మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు. దేశీయంగా డిమాండ్ తక్కువగా ఉండటం, రికార్డు స్థాయిలో పెరిగిన ధరల కారణంగా ఈ నెలలో బంగారం దిగుమతులు 50 శాతం తగ్గొచ్చన్నారు. దేశంలో వివాహాల సీజన్ కొనసాగు తున్నప్పటికీ డిమాండ్ తక్కువగానే ఉందన్నారు. ధరలు పెరగక ముందు కొన్ని బ్యాంక్‌లు దిగుమతి చేసుకున్న బంగారాన్ని తిరిగి అమెరికాకు పంపిస్తున్నాయన్నారు. దీంతో అధిక రాబడులను పొందుతున్నా యన్నారు. భారత్‌లోని ఆభరణాల తయారీదారుల కోసం టోకుగా ఒక్క ఔన్స్‌పై 23 డాలర్ల తగ్గింపును అందిస్తోన్నాయన్నారు. గతేడాది దీర్ఘకాలంగా అస్థిరంగా ఉన్న ధరలు.. నవంబర్‌లో అకస్మాత్తుగా తగ్గినప్పటికీ.. తిరిగి ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత బంగారం ధరలకు రెక్కలు వచ్చాయి. ట్రంప్‌తో ప్రపంచ దేశాల్లో అనిశ్చిత్తి నెలకొనడంతో సురక్షిత పెట్టుబడి కోసం బంగారంపై సెంట్రల్ బ్యాంక్‌లు, బులియన్ వర్తకులు పెట్టుబడులు పెంచారు. దీంతో రెండు, మూడు నెలల్లోనే బంగారం ధరలు 14 శాతం మేర పెరిగాయి. దేశీయంగా బుధవారం 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.270 తగ్గి రూ.87,970 వద్ద నమోదయ్యింది. 22 క్యారెట్ల ధర రూ.250 తగ్గి రూ.80,650 వద్ద ముగిసింది. వచ్చే నెలలో 10 గ్రాముల ధర రూ.87,300 నుంచి 89,000 వరకు చేరొచ్చని కూడా భావిస్తున్నారు.

# నేడు అసెంబ్లీ ముందుకు ఏపి బడ్జెట్

### తొలిసారి బడ్జెట్ ప్రవేశ పెడుతున్న కేశవ్
### సూపర్ సిక్స్ పథకాలపై సర్వత్రా ఆసక్తి



అమరావతి : ఏపీ బ్జడెట్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. 28న శుక్రవారం ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ తన తొలి బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశ పెట్టనున్నారు. ఇప్పటికే వివిధ శాఖలతో ఆయన సమీక్షించారు. తొలి పూర్తిస్థాయి బడ్జెట్ కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ బడ్జెట్‌కు ముఖ్య లక్ష్యం రాష్ట్ర వృద్ధి రేటు 15 శాతం సాధించడం, 2.4 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందడమే. ఇందుకోసం మూలధన వ్యయాన్ని పెంచుతూ, దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇకపోతే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను ముందుకు తీసుకుని వెళ్లాల్సి ఉంది. అలాగే హామీలను అమలు చేస్తామని సిఎం చంద్రబాబు కూడా ప్రకటించారు. పట్టణ పునరుద్ధరణ ప్రాజెక్టులు, మెరుగైన రహదారి కనెక్టివిటీ, పరిశ్రమల వృద్ధి, పునరుత్పత్తి శక్తి రంగాల్లో పెట్టుబడులు బ్జడెట్‌లో ముఖ్య ప్రాధాన్యత పొందనున్నాయి. ముఖ్యంగా డిజిటల్ గవర్నెన్స్, ఐటీ హబ్‌ల అభివృద్ధి, తయారీ పరిశ్రమల వృద్ధి తదితర రంగాల్లో ప్రత్యేక నిధులు కేటాయించే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వ పథకాలతో సమన్వయం చేసుకుంటూ, రాష్ట్ర బడ్జెట్‌లో విద్య, ఆరోగ్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. పాఠశాలల మౌలిక సదుపాయాల మెరుగుదల, ఉచిత ఆరోగ్య సంరక్షణ పథకాలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల బలోపేతం అన్నవి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. తమ పథకాల అమలుకు తగినంత నిధులు కేటాయించడమే కాకుండా, వాటి ఆర్థిక ప్రభావాన్ని సమీక్షించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ముఖ్యంగా సూపర్ సిక్స్ పథకాల అమలుకు పెద్దపీట వేస్తోంది. సూపర్ సిక్స్ పథకాల్లో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం 2.0, సామాజిక భద్రతా పెన్షన్లు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ కీలకమైనవి. వీటిలో కొన్నింటిని ఇప్పటికే అమలు చేస్తున్నారు. మరికొన్నింటిని త్వరలోనే అమలు చేస్తామని ప్రకటించారు. ఈ హామీల అమలుకు భారీగా నిధులు కేటాయించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ఆర్థిక లోటు ఉన్నా, సంక్షేమ పథకాలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాజధాని అభివృద్ధిని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న చంద్రబాబు ప్రభుత్వం మూడేళ్లలో రూ.60,000 కోట్ల వ్యయంతో అమరావతిని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. వరల్డ్ బ్యాంక్, ఆసియా డెవలప్మెంట్ బ్యాంక్ వంటి అంతర్జాతీయ సంస్థల నుంచి రూ.30,000 కోట్ల పైగా రుణాలకు హామీ తెచ్చుకున్నట్లు తెలుస్తోంది. బడ్జెట్ సందర్భంగా దీనిపై మరింత స్పష్టత ఇవ్వనుంది. ఆర్థిక శాఖకు 28 శాఖల బడ్జెట్ సమీక్షలు పూర్తి కావడంతో, మంత్రులంతా తమ శాఖలకు అధిక నిధులు కేటాయించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఇరిగేషన్ మంత్రిత్వ శాఖ మాత్రమే రూ.37,000 కోట్లు కోరగా, ప్రభుత్వం రూ.27,000 కోట్లు కేటాయించేందుకు సిద్ధంగా ఉంది. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే ఈ పూర్తి స్థాయి బ్జడెట్, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని స్థిరపరిచేలా, సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, పరిశ్రమల పెట్టుబడులకు సమతుల్యత కల్పించేలా ఉండబోతోందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

## ఓబులవారిపల్లె పీఎస్‌కు పోసాని తరలింపు

### అక్కడే వైద్య పరీక్షలు చేసిన ప్రభుత్వ వైద్యుడు

మదనపల్లె : వైకాపా నేత, సినీనటుడు పోసాని కృష్ణమురళి ని పోలీసులు అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె పీఎస్‌కు తీసుకొచ్చారు. హైదరాబాద్‌లోని రాయదుర్గంలో మైహోమ్ భూజాలో అదుపులోకి తీసుకున్న తర్వాత నేరుగా ఇక్కడికి తీసుకొచ్చారు. పోలీస్‌స్టేషన్‌లోనే ప్రభుత్వ వైద్యుడు గురుమహేశ్ ఆధ్వర్యంలో పోసానికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆయన స్టేట్‌మెంట్‌ను రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు నమోదు చేశారు. పోసాని కృష్ణమురళినిరైల్వేకోడూరు కోర్టులో హాజరు పరిచే అవకాశముంది. సినీ పరిశ్రమలో వర్గవిభేదాలు తలెత్తేలా, ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై పోసాని అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ జనసేన నేత జోగినేని మణి రెండు రోజుల క్రితం ఇచ్చిన ఫిర్యాదుపై ఓబులవారి పల్లె పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. వర్గాల మధ్య విభేదాలు రెచ్చగొట్టడం, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం, వ్యవస్థీకృత నేరానికి పాల్పడడం వంటి అభియోగాలపై బీఎన్ఎస్‌లోని 196, 353(2), 111 రెడ్‌విత్ 3(5) సెక్షన్ల కేసు నమోదైంది. దీనిలోనే పోలీసులు పోసానిని అరెస్టు చేశారు. వైకాపా హయాంలో నాటి ప్రభుత్వ పెద్దల అండదండలు, ఆదేశాలతో చంద్రబాబు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్ సహా నాటి ప్రతిపక్షంలోని ముఖ్యులు, వారి కుటుంబాల్లోని మహిళలపై అసభ్య పదజాలం, బూతులతో పోసాని కృష్ణమురళి పేట్రేగిపోయారు.

## పోసాని అరెస్ట్ నిరంకుశ విధానం

### తీవ్రంగా ఖండించిన వైకాపా అధినేత జగన్



అమరావతి : సినీ నటుడు పోసాని కృష్ణమురళి అరెస్టును వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ఖండించారు. ఏపీలో కూటమి ప్రభుత్వ పాలన నిరంకుశంగా సాగుతోందని మండిపడ్డారు. అరెస్ట్ నేపథ్యంలో పోసాని భార్య కుసుమలతను జగన్ ఫోన్‌లో పరామర్శించారు. అరెస్ట్ విషయంలో పోసానికి వైసీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జరుగుతున్న వ్యవహారాలను ప్రజలు, దేవుడు చూస్తున్నారని.. కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలన్నారు. 'ఏపీలో కూటమి ప్రభుత్వ పాలన నిరంకుశంగా సాగుతోంది. అరెస్ట్ విషయంలో పోసాని కృష్ణమురళికి వైసీపీ అండగా ఉంటుంది. రాష్ట్రంలో జరుగుతున్న వ్యవహారాలను ప్రజలు, దేవుడు చూస్తున్నారు. కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలి. పోసానికి వైసీపీ పార్టీ తరుపున న్యాయ పరంగా సహాయం అందిస్తాం. పార్టీకి సంబంధించిన సీనియర్ న్యాయవాదులతో లీగల్ గా ముందుకు వెళ్తామని వైఎస్ జగన్ పేర్కొన్నారు. పోసాని కృష్ణమురళిని ఏపీ పోలీసులు బుధవారం రాత్రి అరెస్టు చేశారు. ప్రస్తుతం పోసాని అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లి పోలీస్ స్టేషన్లో ఉన్నారు. ఓబులవారిపల్లి పీహెచ్సీ డాక్టర్ గురు మహేష్ ఆయనకు వైద్య పరీక్షలు చేస్తున్నారు. జనసేన రాయలసీమ జోన్ కన్వీనర్ జోగిమణి ఫిర్యాదు మేరకు పోసానిపై కేసు నమోదైంది. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్, టీడీపీ నేత నారా లోకేశ్‌లు.. వారి కుటుంబ సభ్యులను అసభ్యంగా దూషించినందుకు పోసానిపై కేస్ఫుల్ అయింది.

## పోసాని వ్యాఖ్యలతో నిద్ర పట్టలేదు

### దారుణ విమర్శలతో హద్దులు దాటారు
### జనసేన రాయలసీమ జోన్ కన్వీనర్ జోగిమణి

తిరుపతి : జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై పోసాని కృష్ణమురళి చేసిన వ్యాఖ్యలు విని ఎన్నో నిద్రలేని రాత్రులను గడిపాను అని జనసేన రాయలసీమ జోన్ కన్వీనర్ జోగిమణి తెలిపారు. తమ నాయకుని కుటుంబ సభ్యుల గురించి మాట్లాడుతూ ఉంటే.. తాము కూడా మాట్లాడాలి అనుకున్నాం కానీ పవన్ వద్దని సూచించారని చెప్పారు. సంస్కారం అడ్డువచ్చే తాము అలా మాట్లాడలేదని, పోసాని ప్రవర్తన సరిగా లేకనే ఫిర్యాదు చేయాల్సి వచ్చిందన్నారు. పోసానిపై గత ప్రభుత్వ హయాంలో ఎన్నో ఫిర్యాదులు చేసినా.. స్వీకరించలేదని జోగిమణి చెప్పుకొచ్చారు. వైసీపీ హయాంలో చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్‌పై అసభ్య పదజాలం వాడిన పోసానిని గత రాత్రి అన్నమయ్య జిల్లా ఓబులవారిప్లలె పోలీసులు అరెస్ట్ చేశారు.జోగిమణి మీడియాతో మాట్లాడుతూ 'జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై పోసాని చేసిన వ్యాఖ్యలు విని ఎన్నో నిద్రలేని రాత్రులను గడిపాను. మా అధినేత, కుటుంబ సభ్యుల గురించి మాట్లాడుతూ ఉంటే మేము కూడా మాట్లాడాలి అనుకున్నాం. కానీ మా నాయకుడు వద్దని సూచించారు. సంస్కారం అడ్డువచ్చే మేము మాట్లాడలేదు. అతని ప్రవర్తన సరిగా లేకనే ఫిర్యాదు చేయాల్సి వచ్చింది. నేను ఎందుకు పుట్టాను, ఈ ఎదవ మానవ జన్మ అనే విధంగా మేము కూడా మాట్లాడగలం. గత ప్రభుత్వ హయంలో కూడా పోసానిపై ఫిర్యాదు చేశాం. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో ఫిర్యాదులు చేశాం, మా ఫిర్యాదులు స్వీకరించలేదు. మా నాయకుడికి భయపడి.. మేము అతనిలా బూతులు మాట్లాడలేదు. పోసాని మాట్లాడే మాటలు భరించలేక ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం. ఆయన మాటలకు మా మనోభావాలు దెబ్బతిన్నాయి. సోషల్ మీడియా ఉందని వారి ఇష్టానుసారంగా మాట్లాడితే సమంజసం కాదు. ఇకనుంచి ఎవరైనా సోషల్ మీడియా ఉందని ఎలా అంటే అలా మాట్లాడకూడదు, నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని ఈ ఫిర్యాదు చేశా' అని తెలిపారు.

## గ్రామ సచివాలయాల్లో మిగులు సిబ్బంది గుర్తింపు

### క్షేతస్థాయిలో విజన్ అమలు యంత్రాంగంలో భర్తీకి కసరత్తు

అమరావతి: స్వర్ణాంధ్ర విజన్ -2047 అమలు దిశలో రాష్ట్రప్రభుత్వం జోరుగా కసరత్తు చేస్తోంది. దీనిలో భాగంగా ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల్లో మిగులు సిబ్బందిని గుర్తించింది. వీరిని క్షేతస్థాయిలో విజన్ అమలు యంత్రాంగంగా వినియోగించుకోవాలని భావిస్తోంది. ఎక్కడ అవసరమో అక్కడ పనిచేయించడం లక్ష్యంగా కసరత్తు చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 15,498 మందిని మిగులు ఉద్యోగులు ఉన్నట్లు ప్రభుత్వం లెక్కలు తేల్చింది. ఇందులో గ్రామ సచివాలయాల్లో 12,126 మంది, వార్డు సచివాలయాల్లో 3,372మంది మిగులు ఉద్యోగులు ఉన్నట్లు సమాచారం. గ్రామ సచివాలయాల్లో మిగులు ఉద్యోగుల్లో అత్యధికంగా సర్వేయర్లు (గ్రేడ్-3) 4,722మంది, గ్రామ మహిళా పోలీసులు 2,107 మంది, విఆర్ఓలు 2,899 మంది వార్డు ఎ÷-లానింగ్, రెగ్యులరేషన్ కార్యదర్శులు 1,336మంది ఉన్నారు. వార్డు సచివాలయాల్లో అత్యధికంగా వార్డు రెవెన్యూ కార్యదర్శులు 1,006మంది, వార్డు, ఎ÷-లానింగ్ రెగ్యులేషన్ కార్య దర్శులు 1,336మంది మిగులు సిబ్బందిగా తేలారు. వీరిలో అర్హులను 'విజన్-2047' విధుల్లో వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. తొలిదశలో ఒక్కో నియోజకవర్గానికి ఐదుగురు సిబ్బందికి విజన్ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయిం చినట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో విజన్ లక్ష్యాల అమలు తీరును పర్యవేక్షించడం, అందుకు అవసర మైన సూచనలు చేయడం వీరి ప్రధాన పనిగా ఉంటుందని చెబుతున్నారు. ప్రభుత్వ ఆదేశాలు మారుమూల గ్రామాల్లో సైతం అమలయ్యేలా మార్గదర్శకాలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం మార్చి నెలాఖరు నుండే 'విజన్' అమలు పక్రియ క్షేత్రస్థాయిలో ప్రారంభం కానుంది. మిగులు ఉద్యోగులుగా ఇప్పటికే గుర్తించిన వారి వివరాలను అందజేయాలని ప్రణాళికా శాఖ సచివాలయాల శాఖను ఇప్పటికే కోరింది. మిగులు ఉద్యోగుల్లో బిటెక్, ఎంటెక్ వంటి ఉన్నత విద్యార్హతలు ఉన్న వారితో పాటు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, గ్రీన్ ఎనర్జీపై అవగాహన ఉన్న వారిని గుర్తించి విజన్ అమలు కోసం వినియోగించుకుంటామని అధికారులు చెబుతున్నారు.

## మార్చి 1 నుంచి ఇంటర్ పరీక్షలు

### భారీగా ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ రెగ్యులర్, ఓపెన్ స్కూల్ సొసైటీ ఇంటర్ పరీక్షలు మార్చి నుంచి ప్రారంభంకానున్నాయి. మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు రెగ్యులర్ ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్నాయి. ఇందులో మార్చి 1 నుంచి 19 వరకు ఫస్ట్ ఇయర్, మార్చి 3 నుంచి 20 వరకు సెకండ్ ఇయర్ పరీక్షలు నిర్వహించనున్నారు. మొత్తం 26 జిల్లాల్లో దాదాపు 10,58,892 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారు. ఓపెన్ స్కూల్ సొసైటీ ఇంటర్ పరీక్షలు మార్చి 3 నుంచి 15 వరకు జరగనున్నాయి.పరీక్షాకేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకోవడానికి వీలుగా విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడపనున్నారు. విద్యుత్తు అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేయనున్నారు. ప్రశ్నపత్రాలను పోలీసు అధికారుల సమక్షంలో భద్రపరిచి.. ఎలాంటి లీకేజీలకు తావులేకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు విద్యార్థులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టడంతో పాటు ప్రతి కేంద్రంలో మౌలిక వసతులు సదుపాయాలను అధికారులు పూర్తి చేశారు. అయితే ఈ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను కూడా ఇప్పటికే ఇంటర్ బోర్డు జారీ చేసింది. హాల్‌టికెట్లను విద్యార్థులే నేరుగా ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని ఈ పర్యాయం రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. మరోవైపు పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని జిల్లాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రెగ్యులర్ ఇంటర్ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1535 కేంద్రాలను ఏర్పాట్లు చేయగా.. అందులో 68 సెంటర్లను సున్నిత, 36 కేంద్రాలను అతి సున్నితమైనవిగా అధికారులు గుర్తించారు. వీటన్నింటిలో సీసీకెమెరాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలను సీసీ కెమెరాలతో అనుసంధానించి అమరావతిలోని చీఫ్ సూపరింటెండెంట్ లైవ్ స్ట్రీమింగ్‌లో పర్యవేక్షించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. పరీక్షలు జరిగే రోజుల్లో పరీక్ష కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో 144వ సెక్షన్ విధించనున్నారు. అలాగే చుట్టుపక్కల ఉండే జిరాక్స్ సెంటర్లు, ఇంటర్ నెట్ కేంద్రాలు పూర్తిగా మూసేలా అధికారులు చర్యలు చేపట్టారు. పరీక్షల నిర్వహణలో ఫిర్యాదుల స్వీకరణకు కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబరు 18004251531 ఏర్పాటు చేశారు. అన్ని జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లను కూడా నెలకొల్పనున్నారు..పరీక్ష కేంద్రాల్లోకి ఎట్టిపరిస్థితుల్లోనూ మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించేది లేదని ఇంటర్ బోర్డు స్పష్టం చేసింది. విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు కూడా మొబైల్ ఫోన్లను పరీక్ష కేంద్రానికి బయటే వదిలేసి వెళ్లాల్సి ఉంటుందని పేర్కొంది.

## శరవేగంగా భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు

### కేంద్రమంత్రి రామమోహన్ నాయుడు ప్రత్యేక శ్రద్ధ

విజయనగరం : రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విజయనగరం జిల్లా భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ తగిన సూచనలు చేస్తున్నారు. సిఎం చంద్రబాబు కూడా త్వరగా దీనిని పూర్తి చేసేలా ఆదేశ్రాలు ఇస్తున్నారు. మొదటి విడత కింద రూ.4,650 కోట్లతో జీఎమ్మార్ సంస్థ ఈ పనులు చేపట్టింది. 2026 జూన్ నాటికి పూర్తి చేస్తామని ఆ సంస్థ ప్రకటించినా, జనవరి నాటికే పూర్తి చేయించాలన్న సంకల్పంతో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పిస్తోంది. ఎన్‌హెచ్16 నుంచి విమానాశ్రయం వరకు అనుసంధాన రహదారికి భోగాపురం మండలంలోని నాలుగు గ్రామాల పరిధిలో 60.08 ఎకరాలు సేకరించారు. ఇందులో 20.22 ఎకరాలకు పరిహారం చెల్లించారు. సవరవిల్లి పరిధిలో 39.86 ఎకరాలకు సంబంధించి 45 మందికి చెల్లించాల్సిన రూ.19.89 కోట్ల పరిహారాన్ని న్యాయస్థానంలో డిపాజిట్ చేశారు. ప్రత్యామ్నాయ రోడ్లకు రావాడ, కవులువాడల్లో 3.13 ఎకరాల తీసుకుని 0.78 ఎకరాలకు రూ.47.84 లక్షలు చెల్లించారు. రూ.3.19 కోట్లు చెల్లించాల్సి ఉంది. ముంజేరు వద్ద ల్యాండ్ పార్శిల్-1 వరకు రోడ్డు నిర్మాణానికి 1.11 ఎకరాలను గత నెలలో రైతులు అప్పగించగా, వారికి రూ.71.25 లక్షల పరిహారం చెల్లించాలి. బసవపాలెం వద్ద విమానాశ్రయం సిబ్బంది నివాస గృహ సముదాయం నిర్మాణానికి 24.30 ఎకరాలు గుర్తించారు. మరోవైపు 132/33 కేవీ విద్యుత్తు ఉప కేంద్రం నిర్మాణానికి 4.50 ఎకరాలు సేకరించగా, అందుకోసం ప్రభుత్వం రూ.70.21 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. జాతీయ రహదారి నుంచి విమానాశ్రయం వరకు ట్రంపెట్ నిర్మాణానికి 19.75 ఎకరాలు సేకరించారు. వాటికి పరిహారంగా రూ.14.43 కోట్ల మేర ప్రభుత్వం చెల్లించనుంది. మరికొంత భూమికి రూ.22 కోట్లు అవసరం. ఫేజ్-1లో మార్చి తొలి వారం నుంచి రోజూ 1.7 ఎంఎల్‌డీల నీటి సరఫరాకు ఆర్‌డబ్ల్యూఎస్ ఇప్పటికే ట్రయల్‌రన్ పూర్తి చేసింది. ఫేజ్-2లో 3.3 ఎల్ఎండీలు అవసరమని జీఎమ్మార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఆ మేరకు తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు నుంచి సరఫరాకు ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తంగా పనుల వేగంతో అనుకున్న సమయానికన్నాముందే విమానాశ్రయం అందుబాటులోకి రానుంది. దీంతో ఉత్తరాంధ్ర గతి మారుతుందని భావిస్తున్నారు.

## 1,2 తేదీల్లో అనంత శ్రీగంగమ్మ జాతర

మదనపల్లె : అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిప్లలె మండలంలో అనంతపురం గంగమ్మ తల్లిని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా.. మంత్రి రాంప్రసాద్ రెడ్డికి ఆలయ పూజారులు ఘన స్వాగతం పలికారు. కాగా.. మార్చి 1, 2 తేదీలలో అనంతపురం శ్రీ గంగమ్మ జాతర జరగనుంది. జాతర సందర్భంగా జిల్లా స్థాయి అధికారులతో మంత్రి రాంప్రసాద్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. జాతర ఏర్పాట్లను అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు, మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత జిల్లా స్థాయి అధికారులను మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆదేశించారు. గంగమ్మ జాతర నిర్వహణ పై ఎన్టీవీ, భక్తి టీవీతో మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడారు. మార్చి 1, 2 తేదీలలో జరిగే అనంతపురం గంగమ్మ జాతరను కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. భక్తులను దృష్టిలో ఉంచుకొని అందరికీ అమ్మవారి దర్శనం కల్పిస్తామన్నారు.

## అక్రమాలకు తెగించిన అధికార టిడిపి

### స్వతంత్ర అభ్యర్థి కె.ఎస్ లక్ష్మణరావు విమర్శలు
### పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ప్రత్తిపాటి

గుంటూరు : కృష్ణా, గుంటూరు జిల్లాల శాసనమండలి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ అక్రమాలకు తెగబడిందని స్వతంత్ర అభ్యర్థి కె.ఎస్ లక్ష్మణరావు తీవ్రంగా విమర్శించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ' ముఖ్యంగా పల్నాడు ప్రాంతంలోని దుర్గి, బెల్లంకొండతో పాటు మరికొన్ని మండలాల్లోని కొన్ని బూత్‌లలో మా ఏజెంట్లను బయటకు పంపారు. ఇదేమి న్యాయం అని అడిగితే సమాధానం లేదన్నారు. మీకు చేతనైతే తలపడండి.. అంతేగాని, ఏజెంట్లను అలా బయటకు పంపడం ఏంటన్నారు. తెనాలిలో మున్సిపల్ హైస్కూల్‌లోని ఏడు బూత్‌లలో కోగంటి శివయ్య అనే వ్యక్తి పెద్ద ఎత్తున దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నం చేసారు. మంగళగిరిలో కూడా ఆ విధంగానే జరుగుతోంది. అధికార పార్టీ వాళ్లు గేటు దాకా వచ్చి ప్రచారం చేసుకుంటున్నారు. మేము ప్రచారం చేసుకోకూడదా అని నిలదీసారు. వీటన్నింటిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయబోతున్నట్లు వెల్లడించారు. ప్రజల మద్దతు, గ్రాడ్యుయేట్‌ల మద్దతు పొందండి. వారి మద్దతు పొందలేకపోవడంతో జావగారిపోయి ఇలాంటి పద్ధతులకు పాల్పడుతున్నారు. వీటిని మేం ఖండిస్తున్నాం. అధికార పార్టీ పాల్పడుతున్న ప్రజాస్వామ్య వ్యతిరేక పద్ధతులపై ఎన్నికల సంఘం అధికారి వివేక్ యాదవ్‌కి, ఆర్వో, జిల్లా కలెక్టర్, ఎస్పి లకు కూడా ఫిర్యాదు చేశాం. రాబోయే మూడు నాలుగు గంటల్లో ఎన్నికలు క్రమపద్ధతిలో నిర్వహించాలని మేం డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఇదిలావుంటే ఎంఎల్ సి ఎన్నికల సందర్భంగా ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు పోలింగ్ కేంద్రాల వద్దకు కూటమి నేతలు చేరుకున్నారు. చిలకలూరిపేటలో ఆర్వీఎస్ సీబీఎస్ హైస్కూల్లోని పోలింగ్ బూత్ లను శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పరిశీలించి అనంతరం ఎక్కువ శాతం ఓట్లు పోలయ్యేలా శ్రద్ధ వహించాలని కార్యకర్తలకు సూచనలు చేశారు.

## నోరుంది కదాని ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఎలా ?

### పోసాని గతంలో ఆడబిడ్డలపైనా అనుచిత పోస్టులు
### బియ్యం కుంభకోణం నుంచి పేర్ని నాని తప్పించుకోలేడు
### మీడియాతో మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి

మచిలీపట్నం : చట్టబద్ధంగానే పోసాని కృష్ణమురళి అరెస్ట్ జరిగిందని, గతంలో ఆయన మాట్లాడిన తీరును రాష్ట్ర ప్రజలు ఎవరూ మరచిపోరని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. నోరు ఉంది కదా అని ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ఇలానే ఉంటుందన్నారు. ఆడబిడ్డలపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టే ఏ ఒక్కరినీ క్షమించమని.. ఆడబిడ్డల సంరక్షణ, సమాజ శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. సినీ రచయిత, నటుడు, వైఎస్సార్‌సీపీ నేత పోసాని కృష్ణ మురళీ అరెస్టు పై స్పందించిన ఆయన మచిలీపట్నంలో మీడియాతో మాట్లాడుతూ.. అధర్మంగా, దుర్గార్గంగా వ్యవహరించిన ప్రతి ఒక్కరినీ ధర్మం శిక్షిస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ లను పోసాని ఇష్టం వచ్చినట్టు మాట్లాడి దూషించాడని, ఇంట్లో ఉన్న ఆడ బిడ్డల గురించి కూడా చాలా అసహ్యంగా మాట్లాడాడని మంత్రి మండిపడ్డారు. సోషల్ మీడియాలో ఆడబిడ్డలపై అనుచిత పోస్టులు పెట్టే ఏ ఒక్కరినీ ఉపేక్షించమని స్పష్టం చేశారు. ఆడబిడ్డలకు రక్షణ కల్పించే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటోందని, రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేయాలనుకుంటే అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే అందరినీ లోనికి పంపించేవాళ్లమని చెప్పారు. ప్రజాస్వామ్యబద్ధం గానే కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. వైసీపీ నేతలు చేసిన పాపాలే వాళ్లని వెంటాడు తున్నాయని, కూటమి పాలనలో ప్రజలంతా సంతోషంగా, ఆనందంగా ఉన్నారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ఒకొక్కటిగా అమలు చేస్తున్నామని, పెన్షన్ సొమ్ము పెంచి ఇస్తున్నామని తెలిపారు. దీపం పథకం కింద అర్హులందరికీ ఉచిత గ్యాస్ సిలెండర్లు అందిస్తున్నామని తెలిపారు. మే నెలలో తల్లికి వందనం, రైతులకు ఆర్థిక సాయం అందించనున్నట్లు చెప్పారు. అమరావతి, పోలవరం ప్రాజెక్ట్ లకు నిధులు తెచ్చి పనులు ప్రారంభించామని.. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రానికి నిధులు, పెట్టుబడులు తెస్తున్నామని తెలిపారు. రానున్న ఆరు నెలల్లో రాష్ట్రం అతివేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటిగా నిలవనుందని అన్నారు.మాజీ మంత్రి పేర్ని నాని మీద మంత్రి కొల్లు రవీంద్ర ఘాటు వ్యాఖ్యలు చేశారు. పేర్ని నాని చాలా ప్రెస్టేషన్‌లో ఉన్నారని, తన గోడౌన్ నుండి రేషన్ బియ్యం ఏ రకంగా తరలి వెళ్లిందో, ఎక్కడి నుంచి ఏ లారీ బయల్దేరిందో చెక్‌పోస్ట్ నుంచి ఏ లారీ దాటిందో అన్నీ బయటకు వస్తాయని అన్నారు. కాకినాడ షిప్పుల్లో అక్రమంగా బియ్యం ఎలా రవాణా అయ్యిందో వివరాలన్నీ ఉన్నాయని మంత్రి తెలిపారు. పేర్ని నాని అకౌంట్‌లో డబ్బులు ఏ విధంగా వచ్చాయి.. ఆయన భార్య జయసుధ అకౌంట్‌లో డబ్బులు ఎలా క్రెడిట్ అయ్యాయో ఇలా అన్నీ బయటకు వస్తాయని మంత్రి కొల్లు రవీంధ్ర అన్నారు.


## ఎస్ఎల్‌బీసీ వద్దకు వెళ్లనీయకుండా హరీశ్‌రావును అడ్డుకున్న పోలీసులు

మహబూబ్‌నగర్ :ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు వద్దకు మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌తో పాటు మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, బీరం హర్షవర్ధన్ రెడ్డితో పాటు పలువురు నేతలు చేరుకున్నారు. అయితే సొరంగంలోకి వెళ్లనీయకుండా హరీశ్‌రావు బృందాన్ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో హరీశ్‌రావు, ఇతర నాయకులు రోడ్డుపైనే బైఠాయించిన నిరసన తెలిపారు. పోలీసుల తీరుపై హరీశ్‌రావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాద ఘటనను పరిశీలించేందుకు మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలకు చెందిన బీఆర్ఎస్ నేతలు హైదరాబాద్ నుంచి గురువారం బయల్దేరిన సంగతి తెలిసిందే. కల్వకుర్తిలో బీఆర్ఎస్ నేతలతో కలిసి హరీశ్‌రావు టీ తాగారు. అనంతరం అక్కడ్నుంచి నేరుగా ఎస్ఎల్బీసీ సొరంగం వద్దకు చేరుకున్నప్పటికీ.. లోపలికి పోలీసులు అనుమతించడం లేదు. భారీగా పోలీసులు మోహరించారు. మీడియాపై కూడా పోలీసులు ఆంక్షలు విధించారు.



# చీరకట్టులో మెరిసిన మలయాళ ముద్దుగుమ్మ అనుపమపరమేశ్వరన్

మలయాళ ఇండస్ట్రీ నుంచి వచ్చిన ముద్దుగుమ్మల్లో అనుపమ పరమేశ్వరన్ క్రేజే వేరు. ఈ చిన్నది తక్కువ సమయంలోనే విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ సొంతం చేసుకుంది. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన అఆ సినిమాలో నటించింది. ఈ సినిమాలో సెకండ్ హీరోయిన్‌గా నటించి మెప్పించింది అనుపమ. ఆతర్వాత ఈ బ్యూటీ క్రేజ్ పెరిగిపోయింది. సోలో హీరోయిన్ గా నటించిన సినిమాలన్నీ సూపర్ హిట్‌గా నిలిచాయి. యంగ్ హీరోలందరి సరసన నటించిన ఈ వయ్యారి తెలుగులో స్టార్ హీరోయిన్ క్రేజ్ ను సొంతం చేసుకుంది. అయితే అనుపమ పరమేశ్వరన్ ఇప్పటివరకు రొమాంటిక్ సీన్స్ లో నటించలేదు. అలాగే బోల్డ్ గానూ కనిపించలేదు. మొన్నామధ్య మాత్రం రౌడీ బాయ్స్ సినిమాలో లిప్ లాక్ తో షాక్ ఇచ్చింది. దాంతో అభిమానులంతా అవాక్ అయ్యారు. అనుపమ ఇలా లిప్ లాక్ తో రెచ్చిపోయిందేంటి అంటూ ఆశ్చర్యపోయారు. ఇక ఇప్పుడు సిద్ధూ జొన్నలగడ్డ హీరోగా నటించిన టిల్లు స్క్వేర్ సినిమాలో హీరోయిన్ గా చేసింది అనుపమ. అయితే ఈ సినిమాలో అనుపమ మునుపెన్నడూ లేని విధంగా బోల్డ్ గా కనిపించి అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రస్తుతం అనుపమ లేడీఓరియేంటేడ్ సినిమాలు చేస్తుంది. అలాగే సోషల్ మీడియాలోనూ ఈ చిన్నది చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా ఫోటోలు షేర్ చేస్తూ ఆకట్టుకుంటుంది. తాజాగా ఈ బ్యూటీ చీరకట్టులో కొన్ని ఫోటోలు షేర్ చేసింది . ఈ ఫోటోలు ఆకట్టుకుంటున్నాయి.



# రాజమౌళిపై సంచలన కామెంట్స్

ఆయన వల్లే ఆత్మహత్య చేసుకుంటున్నానని సూసైడ్ నోట్ టాలీవుడ్ దిగ్గజ దర్శకుడు రాజమౌళి, ఆయన సతీమణి రమా రాజమౌళి వివాదంలో చిక్కుకున్నారు. జక్కన్న స్నేహితుడైన యు.శ్రీనివాస్ రావు రాజమౌళి టార్చర్ భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సుసైడ్ నోట్ రాయడంతో పాటు సెల్ఫీ వీడియో తీసి విడుదల చేయడం సంచలనంగా మారింది. రాజమౌళిది నాది 34 ఏళ్ళ స్నేహం. ఈటీవీలో రాజమౌళి శాంతి నివాసం సీరియల్ చెయ్యక ముందు నుంచే మేం ఇద్దరం ఫ్రెండ్స్. ఈ విషయం అందరికి తెలుసు. యమదొంగ సినిమాకి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా నేను చేశాను. కానీ రాజమౌళి జీవితంలో ఒక మహిళ ప్రవేశించడంతో నన్ను దూరం పెట్టారు. ముందు రాజమౌళి..ఆ తర్వాత నేను ఆ అమ్మాయిని ప్రేమించానని తెలిపాడు అయితే కెరీర్ బిగినింగ్ టైమ్‌లో వివాదం ఉందన్న కారణంతో రాజమౌళి కోరిక మేరకు నేను ఆ అమ్మాయిని త్యాగం చేశాను. రాజమౌళి వల్లే 54 ఏండ్లుగా బ్యాచిలర్‌గా మిగిలిపోయాను. ఆయన నెంబర్ వన్ అవ్వడం కోసం నా జీవితాన్నే త్యాగం చేశాను. రాజమౌళి స్టార్ డైరెక్టర్ అయ్యాక ఈ విషయం ఎవరికైనా చెప్తానని.. నన్ను ఇండస్ట్రీలో లేకుండా చేశాడు. చివరకి నేను చనిపోయే దాకా తెచ్చాడు. పోలీసులు కేసు ఫైల్ చేసి రాజమౌళికి రమ రాజమౌళికి లై డిటెక్టర్ టెస్ట్ చెయ్యాలి అంటూ సుసైడ్ నోట్‌లో రాసుకోచ్చాడు. రాజమౌళి క్షుద్ర విద్యలని వచ్చని.. అతడికి అడ్డుగా వస్తారని అనుకున్న దర్శకులందరనీ పక్కకు తప్పించి తానే నెంబర్ వన్ డైరెక్ట్ అయ్యాడని తెలిపాడు.



# కాయలోహర్ జాతకం మారిపోయింది!

మూడేళ్ళ క్రితం శ్రీవిష్ణు మూవీ 'అల్లూరి'లో నటించిన కాయదు లోహర్ తాజాగా 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' మూవీతో మరోసారి తెలుగువారిని పలకరించింది. ఈ సారి ఈ మూవీని తెలుగువాళ్ళు బాగానే ఆదరించారు. తమిళ డబ్బింగ్ సినిమా అయినా... గత వారం విడుదలైన సినిమాలలో కాస్తంత ఆదరణ దీనికే లభించింది. దాంతో కాయదు లోహర్ పై మన నిర్మాతలు దృష్టి సారించారు. మరీ ముఖ్యంగా కాయదు తెలుగులో ఓ క్రేజీ ప్రాజెక్ట్ కు సైన్ చేసినట్టు తెలుస్తోంది. ఈ విషయాన్ని డైరెక్ట్ గా కాయదు చెప్పలేదు కానీ ఓ తెలుగు సినిమాలో తనకు ఛాన్స్ లభించిందని తెలిపింది. ఈశాన్య భారత్ లో పుట్టిన కాయదు లోహర్ పెరిగింది పూణేలో. అయితే ఇప్పటికే అమ్మడు దక్షిణాది చిత్రాలను చుట్టేసింది. ఏ భాషా చిత్రంలో నటించానా ఆ భాషను నేర్చుకోవడానికి కాయదు గట్టిగా ప్రయత్నిస్తుంది. అలా ఇప్పటికే చక్కగా తమిళం మాట్లాడేస్తోంది. తెలుగులో 'అల్లూరి'లో నటించే సమయంలో కాస్తంత మన భాషనూ అర్థం చేసుకునే స్థితికి చేరింది. ఇప్పుడిప్పుడే క్యూట్ క్యూట్ గా తెలుగు పదాలను పలుకుతోంది. ఇంతకూ విషయం ఏమంటే... విశ్వక్ సేన్‌హీరోగా కె.వి. అనుదీప్ దర్శకత్వంలో సితార ఎంటర్ టైన్ మెంట్స్ సంస్థ నిర్మిస్తున్న 'ఫంకీ' మూవీలో కాయదు ఛాన్స్ దక్కించుకుంది. ఇవాళ సితార ఎంటర్ టైన్ మెంట్ సంస్థలోకి ఏ హీరోయిన్ అయినా అడుగుపెడితే... వాళ్ళ జాతకం మామూలుగా ఉండటం లేదు. వరుసగా అదే బ్యానర్ లో సినిమా ఛాన్సులు దక్కడమే కాదు... కలిసొస్తే... స్టార్ హీరోల పక్కన కూడా అవకాశం లభిస్తుంటుంది. అంత గొప్ప ఛాన్స్ దక్కడం పట్ల కాయదు ఫుల్ ఖుషీలో ఉంది.



# బాలీవుడ్ నటి అమీషా పటేల్‌కు చేదు అనుభవం

బాలీవుడ్ నటి అమీషా పటేల్‌కు చేదు అనుభవం ఎదురైంది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివుడిని దర్శించుకునేందుకు ముంబై జుహూలోని ఓ శివాలయానికి వెళ్లారు అమీషా పటేల్. ఇక అమీషా పటేల్ వచ్చిందని తెలిసిన అక్కడి భక్తులు, బాబాలు ఒక్కసారిగా ఆమెని చూసేందుకు ఎగబడ్డారు. అమీషా ఆలయంలో పూజలు చేస్తున్న సమయంలో అమెతో ఫొటోలు దిగేందుకు ఫ్యాన్స్‌తో పాటు సాధువులు సైతం పోటీ పడ్డారు. ఒక్కసారిగా ఆమెను చుట్టుముట్టి ఫొటోలు తీసుకున్నారు. అయితే సెల్ఫీల కోసం జనాలు ఎగపడటంతో అమీషా చాలా ఇబ్బంది పడింది. అది గమనించిన టెంపుల్ సెక్యూరిటీ వారిని చెదరగొట్టే ప్రయత్నం చేయడంతో పాటు. అమీషాతో సెల్ఫీ దిగేందుకు ముందుకు వచ్చిన ఒక సాధువుని అక్కడి నుంచి లాక్కెల్లారు. ఇక బాబా నుంచి తనను రక్షించినందుకు టెంపుల్ సెక్యూరిటీ సిబ్బందికి అమీషా పటేల్ కృతజ్ఞతలు తెలిపింది. కాగా ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. సినిమాల విషయానికి వస్తే.. ఇటీవలే గదర్ 2 సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకుంది అమీషా పటేల్. సన్నీ డియోల్ హీరోగా వచ్చిన ఈ చిత్రంలో అమీషా కథానాయికగా నటించింది. అనిల్ శర్మ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం దాదాపు రూ.600 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది.

# రజనీకాంత్ సరసన పూజా హెగ్డే ఫిక్స్

## అధికారికంగా తెలిపిన కూలీ మూవీ టీం

రజనీకాంత్ కథానాయకుడిగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'కూలీ'. నాగార్జున, శ్రుతిహాసన్, సత్యరాజ్, ఉపేంద్ర తదితరులు కీలక పాత్రధారులు. ఆ సినిమాలో పూజా హెగ్డే నటించనున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే! అయితే ఇప్పుడు ఈ చిత్రంలో పూజా ఫిక్స్ అయ్యారు. ఈ విషయాన్ని చిత్ర బృందం అధికారికంగా తెలిపింది. దీనికి సంబంధించి ఓ ప్రీ లుక్ పోస్టర్ విడుదల చేసి ఈ స్టార్ హీరోయిన్ ఎవరో గుర్తుపట్టాలంటూ పోస్ట్ పెట్టింది. తాజాగా ఆ ప్రీ లునిక్ పోస్టర్ పూజా హెగ్డేదేనంటూ ఖరారు చేశారు. ఇందులో పూజా ఇందులో కీలక పాత్రలో నటించనున్నారా, ప్రత్యేక గీతంలో కనిపించనున్నారా అనేది తెలియాల్సి ఉంది. అనిరుధ్ ఈ సినిమాకు 'జైలర్'లోని 'కావాలయ్యా' పాట తరహాలో ఓ ప్రత్యేక గీతాన్ని ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. బంగారం స్మగ్లింగ్ అంశంతో ముడిపడి ఉన్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో.. రజనీ పవర్‌ఫుల్ రోల్‌లో కనిపిస్తారు. ఆమిర్‌ఖాన్, నాగార్జున, ఉపేంద్ర, శ్రుతిహాసన్ తదితరులు కీలక పాత్రలు ఆగస్టులో రిలీజ్ చేసే అవకాశం ఉంది.

# మా పుట్టబోయే పిల్లలపై కామెంట్స్ చేస్తున్నారు : ప్రియమణి

ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ వరుస అవకాశాలు దక్కించుకుంటోంది అందాల తార ప్రియమణి . దక్షిణాదితోపాటు బాలీవుడ్‌లోనూ ప్రియమణికి మంచి గుర్తింపు ఉంది. ప్రస్తుతం ఆమె సినిమాలు, సిరీస్, టీవీ ప్రోగ్రామ్స్‌తో బిజీ బిజీగా మారిపోయింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నటి.. వివాహం అనంతరం ఎదురైన అనుభవాలను పంచుకుంది. మతాంతర వివాహం కారణంగా తాను లవ్ జిహాద్ ఆరోపణలను ఎదుర్కొన్నట్లు చెప్పుకొచ్చింది. తనకు పుట్టబోయే బిడ్డల గురించి కూడా అనవసరంగా కామెంట్స్ వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేసింది. 2017లో ప్రియమణి ఈవెంట్ ఆర్గనైజర్ అయిన ముస్తఫా రాజ్‌ను ప్రేమ వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. 2016లో వీరి నిశ్చితార్థం జరిగింది. నిశ్చితార్థం జరిగిన నాటి నుంచి తనపై విమర్శలు ఎక్కువయ్యాయని ప్రియమణి తెలిపింది. 'ఎనిమిదేళ్ల క్రితం మా వివాహం అయ్యింది. ఇప్పటికీ మా పెళ్లి విషయంలో ట్రోల్స్ చేస్తూనే ఉన్నారు. 2016లో నిశ్చితార్థం జరిగింది. ఈ ఆనందకరమైన విషయాన్ని అందరితో పంచుకోవాలనుకున్నా. ఇది తెలిసి అంతా సంతోషిస్తారని అనుకున్నా. బదులుగా నాపై అనవసరమైన ద్వేషం ప్రారంభమైంది. లవ్ జిహాద్ ఆరోపణలు వచ్చాయి. ఆ ద్వేషం ఎక్కడి వరకూ వెళ్లిందంటే.. మాకు పిల్లలు పుట్టాక వారు ఐసిస్‌లో చేరతారని చెప్పేంత వరకూ వెళ్లింది. ఆ కామెంట్స్ ఎంతగానో బాధించాయి. నేను మీడియా పర్సన్‌ను కాబట్టి విమర్శలను పట్టించుకోను. కానీ నా భర్తపై అలాంటి కామెంట్స్‌తో ఎందుకు దాడి చేస్తున్నారు..? నా భర్త గురించి వివరాలకు కూడా మీకు తెలీవు. కానీ కామెంట్స్ మాత్రం చేసేస్తారు. ఇప్పటికీ నేను నా భర్తతో దిగిన ఫొటోను పోస్ట్ చేస్తే.. పదిలో తొమ్మిది కామెంట్స్ మా పెళ్లి మీదనే ఉంటాయి. వాటి వల్ల బాధపడాల్సి వస్తోంది' అని ప్రియమణి ఆవేదన వ్యక్తం చేశారు.



Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com